www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కేటీఆర్.. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు



మేం ఓ బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం
మీలా అడ్డగోలుగా దోచుకోవడానికి రాలేదు
మీ పాపాల వల్లే బిల్లులన్నీ పెండింగ్: భట్టి
30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ
కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై అట్టుడికిన సభ
భట్టి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన, వాకౌట్ 12



గురువారం | 27-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 341

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా.11.04 తదుపరి చతుర్దశి, నక్షత్రం: శతభిషం రా.12.34 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.9.07-10.35, తె.6.19 మొదలు, అమృతఘడియలు: సా.5.56-7.25, దుర్ముహూర్తం: ఉ.10.19-11.07, మ.3.10-3.58, రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 6.23 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉప ఎన్నికలు రావు

బీఆర్ఎస్ హయాంలో రానివి ఇప్పుడెలా వస్తాయి?.. అప్పుడున్న రాజ్యాంగమే ఇప్పుడుంది

బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లపై కఠిన చర్యలు.. వాటి నిరోధానికి సిట్
వాటిని నిర్వహించినా, ప్రచారం చేసినా ఉపేక్షించం.. కేటీఆర్, హరీశ్‌ల దుష్ప్రచారం
పెట్టుబడులను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు.. వారి పోటీ తలనొప్పిగా మారింది
గచ్చిబౌలిలో ఓ వ్యక్తికి గతంలో ఇచ్చిన భూమిని సుప్రీంలో గెలిచి స్వాధీనం చేసుకున్నాం
శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేద్దాం

ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరం
ఉపాధ్యాయులతో కొట్లాడే శక్తి నాకు లేదు
వ్యవస్థ బలోపేతానికి సహకరించాలి: సీఎం

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలెవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే వారమే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ నేతలు ఊదరగొడుతున్నారని, కానీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ రావని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న రాజ్యాంగమే ఇప్పుడు కూడా ఉందని, స్పీకర్ వ్యవస్థ, చట్టం అవే ఉన్నాయని, ఏవీ మారలేదని గుర్తు చేశారు. అలాంటిది.. బీఆర్ఎస్ హయాంలో పార్టీలు మారిన నేతల విషయంలో రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని ప్రశ్నించారు. బుధవారం శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. వీటి నిరోధానికి, నిషేధానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీలకు ప్రచారం చేసినా, నిర్వహించినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో ఆన్‌లైన్ గేమ్స్ నిషేధానికి చట్టం చేసినప్పటికీ.. అమల్లో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించారు. గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందన్నారు. గత చట్టంలో ఇటువంటి కేసులకు రెండేళ్ల వరకే జైలుశిక్ష ఉందని, దానిని సవరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ రమ్మీ, గేమ్స్‌కు ప్రచారం కల్పించిన వారిని విచారించామని తెలిపారు. అయితే కేవలం ప్రచారం కల్పించిన వారిని విచారించడం వల్ల సమస్య పరిష్కారం కాదని, అందుకే సిట్‌ను ఏర్పాటు

మిగతా 13వ పేజీలో...

కోర్టులో అంశం.. అసెంబ్లీలో సీఎం తీర్పు

ఎమ్మెల్యేల అనర్హతపై సీఎం వ్యాఖ్యలు
సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తాయి
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను
సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తాం: హరీశ్‌రావు 13

సీఎం ఎక్కడా కోర్టు పేరు తీయలేదు

శాసనసభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 13
చట్టసభలో ఏ అంశంపైనైనా మాట్లాడే
అవకాశం ఉంటుంది: మంత్రి ఉత్తమ్

మా సీఎం మంచోడు

అందుకే మీరు 15 నెలలుగా ప్రశాంతంగా ఉన్నారు

మరో వెయ్యి జన్మలెత్తినా బీఆర్ఎస్‌కు అధికారం కలే: రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా మంచివారని, ఆయన మంచితనం వల్లే, బీఆర్ఎస్ వాళ్లు 15 నెలలుగా ప్రశాంతంగా ఉంటున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. లేకుంటే రేపటి నుంచి మరో లెవల్‌లో ఉంటుందన్నారు. బుధవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు బుగ్గకారు, సైరన్ సౌండ్‌కు బాగా అలవాటు పడ్డారని, అది లేనిదే నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు. మరో వెయ్యి జన్మలెత్తినా ఆ పార్టీకి అధికారం కలేనన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో 8,742 హత్య కేసులు, 18,246 లైంగిక దాడి కేసులు నమోదు అయ్యాయన్నారు. 2014-23 మధ్య పోలీసులను అడ్డంపెట్టుకుని అనేక అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రాజెక్టులకు భూముల కోసం రైతులను పోలీసులతో బెదిరించి, భూములు లాక్కున్నారని చెప్పారు. రాజగోపాల్‌రెడ్డి ప్రసంగం ముగియగానే ఎమ్మెల్యే హరీశ్ స్పందిస్తూ 'కంగ్రాచ్యులేషన్స్.. నీకు హోంమంత్రి పక్కా' అని వ్యాఖ్యానించారు.

రాపై ఆంక్షలు విధించండి

సిక్కు వేర్పాటువాదుల హత్య కుట్రలో 'రా' పాత్ర

అమెరికా ప్రభుత్వానికి మత స్వేచ్ఛ కమిషన్ సిఫారసు
భారత్‌లో మత స్వేచ్ఛ క్షీణించిందంటూ నివేదిక
ఆందోళనకర దేశంగా ప్రకటించాలని ప్రతిపాదన
యూఎస్‌సీఐఆర్ఎఫ్ సిఫారసుపై భారత్ మండిపాటు



వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 26: భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)పై ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా కమిషన్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) సిఫారసు చేసింది. సిక్కు వేర్పాటువాదులను అంతమొందించే కుట్రలో భాగస్వామిగా రా ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అమెరికా ప్రభుత్వానికి ఆ సంస్థ ఆంక్షల ప్రతిపాదనలు చేసిందని ఆంగ్ల పత్రిక రాయిటర్ తన కథనంలో పేర్కొంది. కమిషన్ నివేదికలోని పలు అంశాలను ఆ కథనంలో ప్రస్తావించింది. భారతదేశంలోని మైనారిటీలు దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు ఆ కమిషన్ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. మత స్వేచ్ఛ ఉల్లంఘన విషయంలో ఆందోళనకర దేశంగా భారత్‌ను గుర్తించాలని ప్రతిపాదించింది. ఆయుధాలను అమ్మే విషయంలో పునరాలోచన చేయాలని సూచించింది. వియత్నాం కూడా మత స్వేచ్ఛను నియంత్రిస్తోందని, ఆ దేశాన్ని కూడా ఆందోళనకర దేశంగా ప్రకటించాలని కోరింది. 2024లో భారత్‌లో మత స్వేచ్ఛ దిగజారిపోయిందని పేర్కొంది. ఆ ఏడాది బీజేపీ నేతలు, ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో ముస్లింలు, ఇతర మైనారిటీ మతాలపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని తెలిపింది. అయితే ప్రస్తుతం

మిగతా 2వ పేజీలో...



12

హామీ.. మంత్రం!

అధిష్ఠానంపై నమ్మకంతో రాజగోపాల్, వివేక్
గతంలో రేవంత్ ఇచ్చిన హామీలు ఫలిస్తే
శ్రీహరి, సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు
తాజా విస్తరణలో వీరికి ఖాయమని ప్రచారం
ఐదో వ్యక్తికి పదవి ఇవ్వాల్సి వస్తే మైనారిటీకి..
ఆరో పదవి ఇస్తే.. ఆది శ్రీనివాస్‌కు అవకాశం



సాయికృష్ణ, అప్సర(ఫైల్)

అప్సర హత్య కేసులో పూజారికి జీవిత ఖైదు

రూ.10 లక్షల జరిమానా.. అందులో
9.75 లక్షలు మృతురాలి కుటుంబానికి..
సాక్ష్యాలను తారుమారు చేయాలని
యత్నించినందుకు మరో ఏడేళ్ల జైలు
రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు 14
2023 జూన్ 3న పథకం ప్రకారం
అప్సరను చంపిన పూజారి సాయికృష్ణ
ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం
పెళ్లికి అప్సర ఒత్తిడి చేయడంతో హత్య



కూలిపోయిన భవనం వద్ద రోదిస్తున్న మేస్త్రీ ఉపేందర్ భార్య, కుటుంబ సభ్యులు

సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ బృందం

భద్రాచలంలో కుప్పకూలిన ఆరంతస్తుల భవనం

శిథిలాల కింద ఇద్దరు మేస్త్రీలు.. పలువురు కూలీలూ ఉండే అవకాశం!
కొనసాగుతున్న సహాయక చర్యలు.. కాపాడాలంటూ ఓ మేస్త్రీ ఆర్తనాదాలు
స్లాబ్‌కు రంధ్రం చేసి ఆక్సిజన్, నీరు.. పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారులు
పాత భవనంపై సామర్థ్యానికి మించి ఐదంతస్తుల నిర్మాణం వల్లే ప్రమాదం
పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన భవన యజమాని! 14

నోట్ల కట్టల వీడియోలు డిలీట్ చేయండి!

ఢిల్లీ పోలీసులకు ఉన్నతాధికారుల ఆదేశం?

ప్రమాదం జరిగిన రోజు నన్ను లోపలికి రానివ్వలేదు
నాడు అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వాంగ్మూలం
జస్టిస్ వర్మ ఇంటికెళ్లి పరిశీలించిన ఢిల్లీ పోలీసులు
ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలంటూ వేసిన
పిల్‌పై అత్యవసర విచారణకు నో అన్న సుప్రీంకోర్టు
రిజిజును కలిసిన అలహాబాద్ హైకోర్టు లాయర్లు



అలహాబాద్ హైకోర్టు వద్ద సమ్మె చేస్తున్న న్యాయవాదులు

న్యూఢిల్లీ, మార్చి 26: జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం వార్త తెలియగానే అక్కడికి చేరుకున్న పోలీసులు.. సగం కాలిన నోట్ల కట్టలకు సంబంధించి పలు వీడియోలు తీశారని, కానీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని తమ ఫోన్లలోంచి డిలీట్ చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ రిపబ్లిక్ వార్తాసంస్థ ఒక కథనాన్ని వెలువరించింది. ఆ వీడియోల తాలూకు కాపీలు తీయొద్దని, వాటిని ఎవరికీ పంపించొద్దని పై అధికారుల నుంచి వారికి కఠిన ఆదేశాలు వచ్చినట్టు అందులో పేర్కొంది. నిజంగానే ఉన్నతాధికారులు అలా డిలీట్ చేయాలని ఆదేశించి ఉంటే అది సాక్ష్యాధారాల ధ్వంసం కిందికే వస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాదు.. అగ్నిప్రమాదం జరిగిన రోజు తనను స్టోర్‌రూమ్‌లోకి రాకుండా అడ్డుకున్నారని నాడు జడ్జి ఇంటి వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం ప్రజల అనుమానాలను మరింతగా పెంచుతోంది. ఆరోజు అగ్నిమాపక శాఖకు చెందిన ఆరుగురు అధికారులను, ఐదుగురు పోలీసు అధికారులను

మిగతా 2వ పేజీలో...

అమెరికా ప్రతీకార సుంకాలతో మన 'ఫార్మా'కు దెబ్బ

ఔషధాల ధరలు పెరిగిపోయి యూఎస్ మార్కెట్లో మన వాటా తగ్గిపోయే ముప్పు
రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ, హెటెరో గ్రూప్ సంస్థల చైర్మన్ పార్థసారథి రెడ్డి ఆందోళన
అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
కుదుర్చుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని సూచన



న్యూఢిల్లీ, మార్చి 26: భారతీయ ఫార్మా ఎగుమతులపై అమెరికా గనక ప్రతీకార సుంకాలు విధిస్తే ఔషధాల ధరలు పెరిగిపోయి, ఆ దేశ మార్కెట్లో మన సంస్థల వాటా తగ్గిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ ఎంపీ, హెటెరో గ్రూపు సంస్థల చైర్మన్ బి.పార్థసారథి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మన ఫార్మా ఉత్పత్తులను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం అమెరికాయేనని.. భారత ఫార్మా ఎగుమతుల్లో ఆ దేశ వాటా 31 శాతంగా ఉందని.. 2023-24లో అమెరికాకు మన ఫార్మా ఎగుమతుల విలువ దాదాపు రూ.74 వేల కోట్లని బుధవారం రాజ్యసభలో ఆయన వివరించారు. ఇప్పుడు మన ఫార్మా ఉత్పత్తులపై అమెరికా అధిక సుంకాలు విధిస్తే అక్కడ మన

మిగతా 2వ పేజీలో...



భూగర్భ క్షిపణి నగరం

భూమికి 500 మీటర్ల అడుగున నిర్మించిన ఇరాన్

వీడియోను విడుదల చేసిన ఐఆర్‌జీసీ
అందులో.. ఖైబర్ షేకాన్స్, ఘద్రహోస్, సెజ్జిల్స్, హాజ్ ఖాసీమ్స్, పహేవ్ క్షిపణులు
ఇప్పటికే ఇరాన్‌లో పలు భూగర్భ నగరాలు!
ఇతర దేశాల నిఘా నుంచి తప్పించుకునేందుకే..

టెహ్రాన్/వాషింగ్టన్, మార్చి 26: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ తమ దేశంలో క్షిపణులను భద్రపరిచే భారీ భూగర్భ నగరం వివరాలను ప్రపంచానికి తెలియజేసింది. భూమికి 500 మీటర్ల లోతులో ఈ నగరాన్ని

మిగతా 2వ పేజీలో...

యూపీఐ సేవల్లో అంతరాయం

దేశవ్యాప్తంగా కొన్ని గంటలపాటు నిలిచిన లావాదేవీలు
పేమెంట్ యాప్స్ పనిచేయక తీవ్రంగా ఇబ్బందిపడ్డ ప్రజలు
డబ్బు కోసం ఏటీఎంల వద్దకు పరుగులు.. వ్యాపారాలపై దెబ్బ



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి దాదాపు రాత్రి 8.30 గంటల దాకా యూపీఐ సేవల్లో అంతరాయం ఏర్పడింది. సర్వర్ డౌన్ కావడంతో చెల్లింపులు జరగక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిరాక్స్ దుకాణాల్లో రూ.2 చెల్లించడానికి సైతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్స్‌పై ఆధారపడుతూ, వాటికి అలవాటుపడిపోయిన ప్రజలు.. కొంత సేపు అవి పనిచేయకపోవడంతో

మిగతా 2వ పేజీలో...

ఇన్‌బిల్ట్ కాలర్ ఐడీ

స్పామ్ కాల్స్ నిరోధానికి థర్డ్‌పార్టీ యాప్స్
అవసరం లేకుండా సీఎన్ఏపీ సేవలు 2
ఇప్పటికే ట్రయల్స్ పూర్తిచేసిన జియో,
ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సంస్థలు
త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు
తొలుత ఏ నెట్‌వర్క్‌కు ఆ నెట్‌వర్క్ పరిధిలోనే





ఎట్టకేలకు తేజస్‌కు 2

అమెరికా ఇంజన్లు

డెలివరీ ప్రారంభించిన జీఈ ఏరోస్పేస్
ఎఫ్-404లో మొదటిది త్వరలోనే హాల్‌కు

పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై తిరుగుబాటు



ఇస్లామాబాద్, మార్చి 26: తిరుగుబాట్లతో.. ప్రభుత్వాలనే మార్చిన చరిత్ర ఉన్న పాక్ ఆర్మీలో ఇప్పుడు వింత పరిస్థితి నెలకొంది. జవాన్ మొదలు, కెప్టెన్, మేజర్, కల్నల్ ర్యాంకు అధికారులు తమ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. "ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ రాజీనామా చేయాల్సిందే" అంటూ అల్టిమేటం జారీచేశారు. ఆసిమ్ వైఫల్యాలను ఒక్కొక్కటిగా పేర్కొంటూ.. ఓ లేఖ రాశారు. ఆయన హయాంలో పాక్ సైన్యం పరిస్థితి 1971లకు వెళ్లిపోయిందని వాపోయారు. 1971లో జరిగిన యుద్ధంతో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయిన విషయం తెలిసిందే..! ఒకవేళ ఆసిమ్ రాజీనామా చేయకుంటే.. తామే చర్యలకు ఉపక్రమించాల్సి వస్తుందని, సైన్యాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని వారు హెచ్చరించారు.

నల్ల సముద్రంలో సైనిక చర్యల నిలిపివేత

● రష్యా-ఉక్రెయిన్ అంగీకరించాయన్న అమెరికా

వాషింగ్టన్, మార్చి26: కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా నల్ల సముద్రం ప్రాంతంలో పరస్పరం సైనిక చర్యలు నిలిపి వేసేందుకు రష్యా-ఉక్రెయిన్ అంగీకరించాయి. నల్ల సముద్రంలో నౌకలపై పరస్పరం దాడికి పాల్పడరాదని రెండు దేశాలు అంగీకరించాయని అమెరికా అధ్యక్ష భవనం కార్యాలయం వైట్‌హౌస్ తెలిపింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో అమెరికా-రష్యా అధికారుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందం కుదిరింది. అంతేకాదు ఇంధన మౌలిక వసతులపై కూడా దాడులకు పాల్పడరాదని రష్యా-ఉక్రెయిన్ అంగీకరించాయని శ్వేతసౌధం తెలిపింది. శాశ్వత శాంతి కోసం యత్నాలు కొనసాగించేందుకు, పరస్పరం యుద్ధ ఖైదీల అప్పగింత, పౌరుల విడుదలకు రెండు దేశాలు అంగీకరించాయని తెలిపింది. మరోవైపు నల్ల సముద్రం తీరప్రాంత భద్రతపై ఒప్పందానికి రష్యా అంగీకరించినందుకు ప్రపంచ మార్కెట్‌లోకి ఆ దేశ ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల కోసం సహకరిస్తామని అమెరికా హామీ ఇచ్చింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య కుదిరిన నల్ల సముద్ర తీరప్రాంత రక్షణ ఒప్పందం వల్ల భారత్ సహా పలు దేశాలకు ప్రయోజనం చేకూరనుంది. ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత, ఆర్థిక సుస్థిరతకు మార్గం ఏర్పడుతుంది. నల్ల సముద్రం గుండా ఆహార ధాన్యాలు, ఎరువులను సురక్షితంగా ఎగుమతి చేయగలుగుతారు.

'హనీట్రాప్' పిల్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపుతున్న హనీట్రాప్ వివాదంపై దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. ఇటీవల శాసనసభ సమావేశాల్లో మంత్రి రాజణ్ణ హనీట్రాప్ గురించి ప్రస్తావించారు. తనతోపాటు ఎమ్మెల్యేలు, నాయకులు, న్యాయమూర్తులతో కలిపి 48 మందిని టార్గెట్ చేసుకుని హనీట్రాప్ జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని జార్ఖండ్‌కు చెందిన వినయ్‌కుమార్ సింగ్ అనే సామాజిక కార్యకర్త దాఖలు చేసిన పిల్‌ను సుప్రీం కోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. 'జార్ఖండ్‌కు చెందిన మీకు కర్ణాటక అంశంతో సంబంధం ఏమిటి?' అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అక్కడి న్యాయమూర్తి ఎందుకు హనీట్రాప్‌కు గురయ్యారు...అలా జరిగితే వారే చూసుకుంటారని స్పష్టం చేసింది. సంబంధం లేని అంశంపై పిల్ దాఖలు చేసినందుకు పిటిషనర్‌ను మందలించింది.

తమిళనాడుకు నిధుల నిలుపుదల సరికాదు

న్యూఢిల్లీ, మార్చి 26 : పీఎం శ్రీ స్కూల్ పథకం అమలు చేయడానికి నిరాకరించిన రాష్ట్రాలకు నిధులను కేంద్రం నిలిపివేయడం సరికాదని పార్లమెంటరీ స్థాయీ సంఘం అభిప్రాయపడింది. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడానికి నిరాకరించిన తమిళనాడుకు రూ. 2,100 కోట్ల నిధులను కేంద్రం ఆపివేయడంపై ప్రస్తుతం వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే విద్య, మహిళలు, యువత, క్రీడల వ్యవహారాల స్థాయీ సంఘం పై అభిప్రాయం వ్యక్తం చేసింది. తన సిఫారసులను అది బుధవారం రాజ్యసభకు సమర్పించింది. ఈ సంఘానికి కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. తమిళనాడుతోపాటు పశ్చిమ బెంగాల్‌కు రూ.వెయ్యి కోట్లు, కేరళకు రూ. 859.63 కోట్లు ఆపివేశారని స్థాయీ సంఘం తెలిపింది. ఈ మూడు రాష్ట్రాలు తప్పిస్తే మిగతా అన్ని రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతోందని పేర్కొంది.

కర్ణాటక ఎమ్మెల్యే యత్నాళ్‌పై బీజేపీ వేటు

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బీజేపీలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరడంతో పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. విజయపుర సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను విమర్శించడం, కొన్నేళ్లుగా యడియూరప్పకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో ఈ ఏడాది ఫిబ్రవరి 10న పార్టీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కానీ యత్నాళ్ తీరులో మార్పు రాకపోవడంతో చర్యలు తీసుకుంది. పార్టీలోని అన్ని పదవుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. కాగా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు మాజీ మంత్రులకు మంగళవారం బీజేపీ అధిష్ఠానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

454 చెట్లను నరికించిన వ్యక్తికి 4.54 కోట్ల ఫైన్

న్యూఢిల్లీ, మార్చి 26: తాజ్‌మహల్ సమీపంలో చట్టవిరుద్ధంగా చెట్లను నరికించిన ఓ వ్యక్తికి సుప్రీంకోర్టు ఒక్కో చెట్టుకు రూ.లక్ష చొప్పున మొత్తం 454 చెట్లకు రూ.4.54 కోట్ల భారీ జరిమానా విధించింది. తాజ్‌మహల్ చుట్టూ రక్షిత ప్రాంతంగా ప్రకటించిన ప్రాంతంలోని ఓ ప్రైవేటు స్థలంలో ఉన్న 422 చెట్లు, వాటి పక్కనే రక్షిత అడవిలో ఉన్న మరో 32 చెట్లను శివ్‌శంకర్ అగర్వాల్ అనే వ్యక్తి అక్రమంగా నరికించాడు. ఈ రక్షిత ప్రాంతంలోని చెట్లను నరికివేయరాదని 2015లోనే సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయినా అతడు దాన్ని ఉల్లంఘించాడు. తాను తప్పును అంగీకరిస్తున్నానని, జరిమానా తగ్గించాలని శివ్‌శంకర్ విన్నవించుకోగా బెంచ్ తిరస్కరించింది. "పెద్దఎత్తున చెట్లను నరికివేయడం ఓ మనిషిని హత్య చేయడంకంటే దారుణం" అని పేర్కొంది.



హమాస్‌కు వ్యతిరేకంగా గాజా పౌరుల నిరసన ప్రదర్శన

గద్దె దిగు హమాస్.. మాకు శాంతి కావాలి

» గాజా వీధుల్లో మిన్నంటిన ఆందోళనలు

గాజా, మార్చి 26: గాజా వీధులు హమాస్ వ్యతిరేక ఆందోళనలతో విన్నంటాయి. వందలాదిమంది పాలస్తీనియన్లు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. 'హమాస్ గద్దె దిగు. యుద్ధం విరమించాలి. మేమంతా ప్రశాంతంగా జీవించాలనుకుంటున్నాం. అవుట్ అవుట్ హమాస్ అవుట్. హమాస్ ఉగ్రవాదులు' అంటూ నినాదాలు హోరెత్తించారు. హమాస్ మిలిటెంట్లు ముఖాలకు మాస్కులు ధరించి లాఠీలతో ఆందోళనకారులపై విరుచుకుపడి, వారందరినీ అక్కడి నుంచి తరిమేశారు. శాంతియుత ప్రదర్శనలో పాల్గొనాలని టెలిగ్రామ్ యాప్‌లో చేసిన అభ్యర్థనల మేరకు తామంతా ప్రదర్శనలో పాల్గొన్నామని ఆందోళనకారులు తెలిపారు. 'ఈ ప్రదర్శనను ఎవరు నిర్వహించారో తెలియదు. యుద్ధంతో విసిగిపోయాం. ప్రజల తరఫున సందేశం ఇచ్చేందుకే ఈ ప్రదర్శనలో పాల్గొన్నా' అని మొహమ్మద్ అనే వ్యక్తి తెలిపారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 50 వేలమందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు.

స్పీకర్ మాట్లాడనివ్వడం లేదు

అవకాశమివ్వాలని కోరితే వాయిదావేసి పారిపోయారు: రాహుల్‌గాంధీ

» విపక్ష నేత హుందాగా మెలగాలి

» సభానియమాలు పాటించాలి: సభాపతి



న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభను అప్రజాస్వామికంగా నడుపుతున్నారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. స్పీకర్ ఓం బిర్లా సభలో తనను మాట్లాడనివ్వడం లేదన్నారు. ఏడెనిమిది రోజులుగా ఇదే జరుగుతోందని తెలిపారు. బుధవారం సభాపతి సభను వాయిదావేసే ముందు.. సభ్యులు సభలో హుందాతనం పాటించాలని చెప్పారు. సభలో కొందరి ప్రవర్తన ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదంటూ పలు దృష్టాంతాలు తన దృష్టికి వచ్చాయన్నారు. తండ్రి-కుమార్తె, తల్లి-కుమార్తె, భర్త-భార్య సభ్యులుగా ఉండడం ఈ సభ చూసిందని.. ఈ నేపథ్యంలో సభలో సభ్యులు 349 నిబంధనకు అనుగుణంగా నడచుకోవాలని, ముఖ్యంగా ప్రతిపక్ష నేత నియమాల ప్రకారం ప్రవర్తించాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. సభాపతి ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి తక్షణ కారణమేంటో తెలియరాలేదు. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ మీడియాతో మాట్లాడారు. 'సభలో నన్ను మాట్లాడనివ్వాలని విజ్ఞప్తిచేశాను. కానీ ఆయన పారిపోయారు. సభ నడిపే పద్ధతి ఇది కాదు. నా గురించి నిరాధారంగా మాట్లాడారు. నా ప్రస్తావన తెచ్చినందున నాకు మాట్లాడే అవకాశమివ్వాలని అడిగాను. అవసరం లేకపోయినా ఆయన సభను వాయిదావేసి వెళ్లిపోయారు. సభలో ప్రసంగించేందుకు ప్రతిపక్ష నేతకు చాన్సివ్వడం సంప్రదాయం. నేను ఎప్పుడు లేచినా మాట్లాడేందుకు అనుమతించడం లేదు. ఏడెనిమిది రోజులుగా ఇది జరుగుతోంది. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ తావులేదు' అని ఆరోపించారు. మరోవైపు.. స్పీకర్ నిష్క్రమించగానే.. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గొగోయ్, విప్ మాణిక్కం ఠాగూర్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా సుమారు 70 మంది కాంగ్రెస్ ఎంపీలు ఆయన చాంబరుకు హడావుడిగా చేరుకున్నారు. రాహుల్‌పై స్పీకర్ వ్యాఖ్యలకు కారణాలేంటో తెలుసుకోగోరారు. కానీ, తమ ప్రయత్నం ఫలించలేదని కొందరు ఎంపీలు తెలిపారు. కాగా.. పార్లమెంటరీ మర్యాదల గురించి ప్రతిపక్ష నేతకు స్పీకర్ గుర్తుచేయాల్సి రావడం అవమానకరమని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి మాలవీయ వ్యాఖ్యానించారు. మాణిక్కం ఠాగూర్ సభలో ప్రసంగిస్తుండగా..రాహుల్ లేచి తన సోదరి ప్రియాంక సీటు వద్దకు వెళ్లి ప్రేమగా ఆమె బుగ్గలు నొక్కుతున్న దృశ్యాన్ని మాలవీయ పోస్టు చేశారు. అన్నాచెల్లెళ్ల ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమైనప్పటికీ..పార్లమెంటు జరుగుతుండగా రాహుల్ అలా చేయడాన్ని సభాపతి తీవ్రంగా పరిగణించినట్లుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

అమెరికా ప్రతీకార సుంకాలతో మన 'ఫార్మా'కు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఔషధాల ధరలు పెరుగుతాయని, ఫలితంగా ఇతర దేశాలతో పోటీని మన కంపెనీలు తట్టుకోలేవని, మరీ ముఖ్యంగా పరస్పర సుంకాల ప్రభావం జనరిక్ మందులపై పడుతుందని.. మన ఫార్మా కంపెనీ లాభాలు తగ్గిపోతాయని, పెట్టిన పెట్టుబడులు వృథా అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాల వల్ల లక్షలాది మంది ఉద్యోగాలు పోవడమే కాక, మన విదేశీ నిల్వలపైన కూడా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని, ఫార్మా రంగ ప్రయోజనాలను కాపాడే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారాన్ని సానుకూలంగా పరిష్కరించుకోవడానికి అమెరికాతో దౌత్యచర్యలు జరపాలని.. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని అన్నారు.

లోకం తీరు



నోట్లకట్టల వీడియోలు డిలీట్ చేయండి!

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే స్టోర్‌రూమ్‌లోకి అనుమతించారని ఢిల్లీ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఆ కానిస్టేబుల్ పేర్కొన్నట్టు సమాచారం. కాగా, ఢిల్లీ పోలీసులు బుధవారం జడ్జి ఇంటికి వెళ్లి, ఘటనాస్థలిని పరిశీలించారు. అక్కడ కొన్ని ఫొటోలు తీసుకుని.. ప్రమాదం జరిగినరోజు అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు సేకరించారు. మరోవైపు.. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు అనుమతివ్వాలంటూ తాను దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించాలంటూ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర చేసిన విజ్ఞప్తిని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. బుధవారం సుప్రీంకోర్టులో ధర్మాసనం ముందు నెడుంపర ఈ అంశం గురించి ప్రస్తావించారు. జడ్జి ఇంటి ప్రాంగణంలో నోట్లకట్టల వ్యవహారంపై 25 పేజీల సమగ్ర డాక్యుమెంట్‌ను ప్రజాబాహుళ్యానికి అందుబాటులోకి తేవడం ద్వారా సుప్రీంకోర్టు అద్భుతమైన పనిచేసిందని.. అయితే, ఈ అంశం విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడి ఉన్నందున తన వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ "బహిరంగ ప్రకటనలు చేయొద్దు" అని వారించారు. ఈ వ్యాజ్యంలో సహ పిటిషనర్‌గా ఉన్న ఒక మహిళ.. "ఇదే ఒక సాధారణ పౌరుడిపై కేసు నమోదై ఉంటే సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు అతడి వెంటపడేవి" అని చెబుతుండగా సీజేఐ మధ్యలో జోక్యం చేసుకుని ఆపేశారు. నిర్ణీత విధానం ప్రకారమే ఆ పిల్ విచారణకు వస్తుందని స్పష్టం చేశారు. ఇక.. జస్టిస్ వర్మ బదిలీని నిరసిస్తూ నిరవధిక సమ్మెకు దిగిన అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కేంద్ర న్యాయమంత్రి కిరెన్ రిజిజును కలిశారు. దాదాపు రెండు గంటలపాటు ఆయనతో సమావేశమయ్యారు.

భారత్‌ను స్ఫూర్తిగా తీసుకుందాం!

» ఇకపై ఓటరు నమోదుకు పౌరసత్వ రుజువు తప్పనిసరి .. ట్రంప్ ఉత్తర్వులు

వాషింగ్టన్, మార్చి 26: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ ఎన్నికల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా మంగళవారం ఆయన కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఎన్నికల నిర్వహణ విషయంలో అమెరికన్లు భారత్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని అందులో ట్రంప్ సూచించారు. భారత్, బ్రెజిల్ దేశాలు ఓటరు గుర్తింపును బయోమెట్రిక్ డేటాబేస్‌తో అనుసంధానం చేశాయని, అమెరికా మాత్రం పౌరసత్వం కోసం స్వీయ ధ్రువీకరణపై ఆధారపడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు అవసరమైన ప్రాథమిక రక్షణలు అమలు చేయడంలో విఫలమైందని ట్రంప్ తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ఓటు వేయడానికి పౌరసత్వానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని రుజువుగా చూపించడాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు ఆ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపులో పేపర్ బ్యాలెట్ల విధానాన్ని పాటిస్తున్న జర్మనీ, కెనడా వంటి దేశాలను ఉదాహరణగా చూపిస్తూ, అమెరికా మాత్రం ఎలాంటి రక్షణలు లేని పద్ధతులపై ఆధారపడుతోందన్నారు. ఎన్నికల తర్వాత రోజు వచ్చిన బ్యాలెట్లను లెక్కించకుండా రాష్ట్రాలను అడ్డుకోవడంలో దేశం విఫలమైందని, అమెరికా పౌరులు కానివారు కూడా ఓటు నమోదు చేసుకోవడానికి అనుమతించిందన్నారు. భారత్‌లో బయోమెట్రిక్ డేటాబేస్ గురించి ట్రంప్ ప్రస్తావించిన నేపథ్యంలో దేశంలో ఆధార్ కార్డును ప్రవేశపెట్టినందుకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞతలు తెలిపింది. ట్రంప్ వ్యాఖ్యలు మన్మోహన్ దార్శనిక నాయకత్వానికి దక్కిన ప్రశంసలుగా అభివర్ణించింది.

యూపీఐ సేవల్లో అంతరాయం

(మొదటి పేజీ తరువాయి)

డబ్బుల కోసం ఏటీఎంల వద్దకు పరుగులు తీశారు. కొవిడ్ సమయంలో పెరగడం మొదలైన యూపీఐ చెల్లింపులు ఆ తర్వాత కాలంలో బాగా ఊపందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రాంతాల్లో ప్రజలు దాదాపు 90 శాతం చెల్లింపులు పేమెంట్ యాప్స్ ద్వారానే చేస్తున్నారు. అంతటి కీలకమైన యూపీఐ సేవలకు అంతరాయం.. అందునా వ్యాపారాలు జోరుగా సాగే సాయంత్రం సమయంలో కలగడంతో.. హోటళ్లు, కిరాణా షాపులు, షాపింగ్ మాల్స్, చిరువ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యపై సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. దీంతో ఎక్స్‌లో 'యూపీఐడౌన్' అనే హ్యాష్ ట్యాగ్ వైరల్ అయ్యింది. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం రాత్రి 7.40 గంటల సమయంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.అయితే.. ఈ సమస్యను పరిష్కరించామని, సేవల్లో అంతరాయానికి చింతిస్తున్నామని ఎన్‌పీసీఐ బుధవారం రాత్రి 8.42 గంటల సమయంలో ఎక్స్ ద్వారా తెలిపింది.

ఇన్‌బిల్ట్ కాలర్ ఐడీతో స్పామ్ కాల్స్‌కు చెక్

న్యూఢిల్లీ, మార్చి 26: స్పామ్ కాల్స్(మోసపూరిత, అవాంఛిత కాల్స్)ను నిరోధించేందుకు రంగం సిద్ధమవుతుంది. ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు ? అనే కాలర్ ఐడీ సమాచారాన్ని టెలికామ్ సర్వీసు ప్రొవైడర్ సంస్థలే మొబైల్ స్ర్కీన్‌పై చూపెట్టబోతున్నాయి. ప్రస్తుతం ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ అప్లికేషన్ల సాయంతో మొబైల్ వినియోగదారులు ఈ కాలర్ ఐడీ సేవలు పొందుతున్నారు. ఇకపై, ఇలాంటి యాప్‌లు అవసరం లేకుండానే కాల్ నేమింగ్ ప్రెజెంటేషన్(సీఎన్‌ఏపీ) సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం జియో, ఎయిర్ టెల్, వోడాఫోన్ ఐడియా కంపెనీలు హెచ్‌పీ, డెల్, ఎరిక్‌సన్, నోకియా తదితర సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దశలవారీగా సీఎన్‌ఏపీ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చే పనిలో ఉన్నాయి. అయితే, ఈ సీఎన్‌ఏపీ సేవలు ప్రస్తుతానికి ఏ నెట్‌వర్క్‌కు ఆ నెట్‌వర్క్ పరిధికే పరిమితం కానున్నాయి. ఎయిర్‌టెల్ వినియోగదారుడు.. మరో ఎయిర్‌టెల్ నెంబర్‌కు ఫోన్ చేస్తే.. కాల్ చేసింది ఎవరు ? అనే సమాచారం కనిపిస్తుంది. ఎయిర్‌టెల్ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం మొబైల్ స్ర్కీన్‌పై పేరు డిస్‌ప్లే అవుతుంది. అదే, ఎయిర్‌టెల్ వినియోగదారుడు జియో లేదా వీఐ నెంబర్‌కు ఫోన్ చేస్తే ఆ వ్యక్తి కాలర్‌ఐడీ జియో లేదా వీఐ వినియోగదారులకు కనిపించదు. టెలికామ్ ప్రొవైడర్లు తమ వద్ద ఉన్న సమాచారాన్ని పరస్పరం పంచుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తేనే సీఎన్‌ఏపీ సదుపాయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

తేజస్‌కు అమెరికా ఇంజన్లు

» డెలివరీ ప్రారంభించిన జీఈ ఏరోస్పేస్



న్యూఢిల్లీ, మార్చి 26: తేలికపాటి యుద్ధవిమానం తేజస్ ఎంకే-1ఏలో ఎంతో కీలకమైన ఎఫ్-404 ఇంజన్లు ఎట్టకేలకు అమెరికా నుంచి రావడం మొదలైంది. ఈ యుద్ధ విమానాల్లో ఉపయోగించే ఎఫ్-404 ఇంజన్లలో మొదటి దాన్ని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు పంపినట్టు అమెరికా రక్షణ రంగ కంపెనీ జీఈ ఏరోస్పేస్ వెల్లడించింది. భారతీయ వాయుసేన (ఐఏఎఫ్) కోసం 88 తేజస్ మార్క్-1ఏ ఎయిర్‌క్రాఫ్టులు కొనుగోలుకు 2021 ఫిబ్రవరిలో రక్షణ మంత్రిత్వ శాఖ హాల్‌తో రూ.48వేల కోట్లతో ఒప్పందం చేసుకుంది. గతేడాది మార్చిలోనే హాల్ వాటిని ఐఏఎఫ్‌కు అందించాల్సి ఉంది. కానీ.. ఇంతవరకు ఒక్క విమానాన్ని కూడా డెలివరీ చేయలేదు. ఈ యుద్ధవిమానాల కోసం 99 ఇంజన్లు కావాలని జీఈ ఏరోస్పేస్‌కు హాల్ 2021లోనే ఆర్డర్ ఇచ్చింది. ఏటా కొన్ని చొప్పున అందించేలా ఒప్పందం కుదిరింది. కానీ, జీఈ ఏరోస్పేస్ ఇప్పటి వరకూ ఒక్క ఇంజన్‌ను కూడా అందించలేదు. దీంతో హాల్ కూడా ఐఏఎఫ్‌కు తేజస్‌లు డెలివరీ చేయలేకపోయింది. ఇటీవలే ఈ ఇంజన్ల తయారీని ప్రారంభించిన జీఈ ఏరోస్పేస్.. మసాచుసెట్స్ సమీపంలోని లిన్‌లో ఉన్న తయారీ కేంద్రం నుంచి తొలి ఇంజన్‌ను హాల్‌కు పంపినట్టు తెలిపింది. అది వచ్చే నెల ప్రారంభంలో అది భారత్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఐఏఎఫ్ అవసరాలకు అనుగుణంగా యుద్ధ విమానాలు అందించడానికి జీఈ ఏరోస్పేస్, హాల్ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఎఫ్-404 ఇంజన్ల సరఫరా ప్రారంభం కావడంతో హాల్ కూడా ఐఏఎఫ్‌కు తేజస్ ఎంకే-1ఏ యుద్ధవిమానాలు అందించేందుకు మార్గం సుగమమైందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ టోవ్‌డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ (ఏటీఏజీఎస్), హై మొబిలిటీ గన్ టోయింగ్ వాహనాల కొనుగోలు నిమిత్తం భారత్ ఫోర్జ్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌లతో రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం రూ.6,900 కోట్లకు కీలక ఒప్పందం కుదుర్చుకుంది.

'రా'పై ఆంక్షలు విధించండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న స్నేహ సంబంధాల నేపథ్యంలో రాపై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలు విధించే పరిస్థితి ఉండబోదని రాయిటర్ విశ్లేషించింది. యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదికపై భారత ప్రభుత్వం మండిపడింది. భారత్‌లోని వైవిధ్యమైన సమాజానికి కళంకం తెచ్చేందుకు నిరంతరాయంగా చేస్తున్న ప్రయత్నం ఇది అంటూ ధ్వజమెత్తింది. మత స్వేచ్ఛపై నిజాయితీ లేకుండా ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేసేందుకే ఆ నివేదిక ఇచ్చారంటూ తప్పుబట్టింది. యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదికపై విదేశీ వ్యవహారాల ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ బుధవారం మీడియాతో మాట్లాడారు. అదో పక్షపాతధోరణితో రూపొందించిన నివేదిక అంటూ విమర్శించారు. అన్ని మతాలను అనుసరించే 140 కోట్ల మందికి పైగా భారత్‌లో నివసిస్తున్నారని, ఇంత వైవిధ్యంలోనూ సామరస్య జీవనాన్ని సీఐఆర్ఎఫ్ అర్థం చేసుకోలేదన్నారు. ఆ సంస్థపై తమకు ఎలాంటి అంచనాలు కూడా లేవన్నారు.

ఉపాధి కూలీల జాబితాలో షమి సోదరి

న్యూఢిల్లీ, మార్చి 26: భారత క్రికెటర్ షమి సోదరి షబీనా, ఆమె భర్త పేర్లు ఉపాధి హామీ కూలీల జాబితాలో నమోదై ఉన్నాయి. అంతేకాదు, వీరు 2021-24 మధ్య కాలంలో ప్రతీ ఏడాది ఈ పథకం కింద కూలీ పని చేసి, వేతనాలు పొందినట్లు రికార్డులున్నాయి. ఏబీపీ వార్తా సంస్థ ఆ రికార్డులతో కథనాన్ని ప్రచురించింది. ఉత్తరప్రదేశ్‌లోని అమరోహాలో వీరిద్దరి పేర్లు ఉపాధి కూలీలుగా నమోదై ఉన్నట్లు తెలిపింది. ఇటీవల భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పుడు షమి తల్లి, సోదరి మైదానంలో టీమిండియాతో సంబరాల్లో పాలుపంచుకొన్నారు.

ఇరాన్‌లో భూగర్భ క్షిపణి నగరం

(మొదటి పేజీ తరువాయి)



ఐఆర్‌జీసీ విడుదల చేసిన వీడియోలోని దృశ్యం

నిర్మించినట్లు పేర్కొంటూ.. 85 సెకన్ల నిడివి గల ఓ వీడియో క్లిప్‌ను విడుదల చేసింది. ఆ వీడియోలో ఇరాన్ సాయుధ బలగాల అధిపతి హుస్సేనీ బఘేరీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ కమాండర్ ఆమిర్‌అలీ హాజీజాద్ ఓ వాహనంపై సొరంగ మార్గంలో ప్రయాణిస్తూ.. ఆయుధాలను వీక్షిస్తున్న దృశ్యాలున్నాయి. అక్కడ ఖైబర్ షేకాన్, ఖద్రహస్, సెజ్జిల్, హజ్ ఖాసీమ్స్, పవేహ్, ఖద్ర్ క్షిపణులు ఉన్నట్లు ఆ వీడియో స్పష్టం చేస్తోంది. ఇరాన్ చెబుతున్న క్షిపణి నిల్వల భూగర్భ నగరం ఆ దేశ నైరుతి ప్రాంతమైన ఖరీద్ ప్రావిన్స్‌లోని పర్వత ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రావిన్స్‌కు ఉత్తరాన కొండలు, పర్వతాలు ఉండగా.. దక్షిణాన మైదాన ప్రాంతం మాదిరి ప్రాంతాలున్నాయి. ఖరూన్, కర్ఖేహ్, జరాహీ, మారూన్ నదులు ఈ ప్రావిన్స్ మీదుగా ప్రవహిస్తాయి. అయితే.. ఖరీద్ ప్రావిన్స్ ఉత్తర భాగంలో ఇరాక్, సౌదీ అరేబియాలోని ఎడారుల నుంచి దుమ్ము తుఫాన్లు వస్తాయి. ఫలితంగా అక్కడ భూగర్భంలో చెలమలకు అవకాశం లేదని భౌగోళిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీడియోలో దృశ్యాలను బట్టి చూస్తే.. భూగర్భ నగరం, సొరంగ మార్గాలను భారీ బంకర్ల మాదిరిగా నిర్మించారు. అంటే.. అణుయుద్ధాలు వచ్చినా.. వేల మంది పౌరులకు భూగర్భ నగరాల్లో ఆశ్రయం కల్పించే అవకాశాలుంటాయి. 2018లో కూడా ఇరాన్ తన సముద్ర తీరప్రాంతాల్లో భూగర్భ నగరాలను నిర్మించిందనే వార్తలు వచ్చాయి. పర్షియన్ గల్ఫ్ ఒడ్డున రహస్య క్షిపణి డిపోలు ఉన్నట్లు అమెరికా నిఘా సంస్థలు అనుమానిస్తున్నాయి.

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో..

అణు ఒప్పందానికి ఇరాన్ అంగీకరించాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల డిమాండ్ చేసిన విషయం తెలిసిందే..! ఇటీవల యెమన్ కేంద్రంగా దాడులు చేస్తున్న హౌతీలపై అమెరికా విరుచుకుపడింది. ఆ సందర్భంలోనూ ఇరాన్‌ను ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అణు ఒప్పందానికి రెండు నెలల గడువు విధించారు. ట్రంప్ హెచ్చరికలతో.. తాము అణు ఒప్పందానికి సిద్ధమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇటీవల ప్రకటించారు. అయితే.. ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మాత్రం హౌతీల సొంత కారణాలతో దాడులకు జరిగుతున్నాయని, తమ జోలికి వస్తే ఊరుకునేది లేదని, అమెరికాకు గట్టి దెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే.. తమ శక్తిని అంచనా వేయొద్దంటూ సందేశం ఇచ్చేలా ఇరాన్ తమ భూగర్భ నగరం వీడియోను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

ఈ దేశాలకు ముప్పు?

ఇరాన్ తాజా వీడియోపై ఇజ్రాయెల్ స్పందించింది. ఇది భయాందోళన కలిగించే విషయమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. అమెరికా రక్షణ శాఖ కూడా దీనిపై అత్యవసర సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. ఇరాన్ మిసైల్ సిటీ కారణంగా ఇజ్రాయెల్, అమెరికా, గల్ఫ్, ఐరోపా దేశాలకు ముప్పు పొంచి ఉందని రక్షణ రంగ నిపుణులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తాజా వీడియో మరింత ఆజ్యం పోసినట్లవుతుందని అభిప్రాయపడుతున్నారు.

రేవంత్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది

» సీఎం కార్యాలయం నాపై మీడియాకు తప్పుడు సమాచారమిచ్చింది: కొణతం దిలీప్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అవినీతి, అరాచకపాలనను ప్రశ్నిస్తున్న తనపై రేవంత్ ప్రభుత్వం కత్తిగట్టి వేధింపులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత కొణతం దిలీప్ ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే 11 అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని, తాజాగా వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారన్నారు. కొత్త డైవర్షన్‌కు తెరలేపిన సీఎం కార్యాలయం తనపై మీడియాకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చిందని విమర్శించారు. వ్యక్తిగత విదేశీ పర్యటనలకు రూ.18 కోట్ల ప్రభుత్వ సొమ్ము ఖర్చుచేశానంటూ చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బృందంలో భాగంగా పదేళ్లలో (2014-2023) తొమ్మిదిసార్లు విదేశాలకు వెళ్లినట్లు తెలిపారు. ఇవన్నీ పెట్టుబడుల ఆకర్షణ కోసం కేటీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ బృందం చేసిన అధికారిక పర్యటనలేనన్నారు. ఈ పర్యటనలక్కైన ఖర్చంతా ఐటీ శాఖ అధికారికంగా చెల్లించిందని, ఇందులో డిజిటల్ మీడియా నిధులు ఒక్క పైసా కూడా వినియోగించలేదని దిలీప్ వివరించారు. ఆర్టీఐ కింద వచ్చిన సమాధానాలను సీఎం పీఆర్వో కార్యాలయం ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి కొన్ని పత్రికలకు పంపిందని తెలిపారు. మరోవైపు 2023లో డిజిటల్ మీడియా విభాగం ప్రత్యేక వీడియోల రూపకల్పన, వెబ్‌సైట్, మొబైల్ యాప్, డిజిటల్ మీడియాలో ప్రకటనలు ఇవ్వడంవల్ల అంతకుముందుతో పోల్చితే ఖర్చు ఎక్కువైందన్నారు. ఈ ఖర్చు మొత్తం ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో జరిగిందని, దీనిపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని కొణతం దిలీప్ తెలిపారు.

తెలంగాణలో 210 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణ: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 110 పత్తి సేకరణ కేంద్రాల ద్వారా 210.19 లక్షల క్వింటాళ్ల పత్తిని సేకరించిందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. దీని విలువ రూ. 15,556 కోట్లు ఉంటుందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తికి సరైన ధరలు లభించకపోవడంతో 2024-25లో కనీస మద్దతుధరకే పత్తిని కొనుగోలు చేయడంతో తొమ్మిది లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. దేశీయంగా పత్తి దిగుబడిలో మూడో స్థానంలో ఉన్న తెలంగాణలో 2014-15 నుంచి 2024-25 వరకూ సీసీఐ ద్వారా రూ.58 వేల కోట్లపై చిలుకు విలువ గల పత్తి సేకరించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. 2014-15లో క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.3,750 కాగా, 2024-25లో దాదాపు రెండు రెట్లు పెరిగి రూ.7,121కి చేరిందన్నారు.

తెలంగాణ నుంచి రూ.1.21 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు

» కేంద్ర ఐటీశాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తెలంగాణ నుంచి రూ.1.21 లక్షల కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి జితిన్ ప్రసాద లిఖిత పూర్వక సమాధానమిస్తూ 2014-15లో తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు రూ.39, 185.84 కోట్లు ఉంటే, 2023-24లో రూ.1,21,116.62 కోట్లకు పెరిగాయని చెప్పారు. ఏపీలో 2014-15లో ఐటీ ఎగుమతులు రూ.379.54 కోట్లు కాగా, 2023-24 నాటికి రూ.2,850.23 కోట్లకు వృద్ధి చెందాయన్నారు. దేశవ్యాప్తంగా ఐటీ ఎగుమతుల్లో రూ.4,09,095 కోట్లతో ప్రథమ స్థానంలో కర్ణాటక, రూ.1,83,847 కోట్లతో రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో రూ.1.21 లక్షల కోట్లతో తెలంగాణ నిలిచాయన్నారు.

కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

నకిరేకల్‌లో మర్రూరు మాజీ సర్పంచ్ నరేందర్ ఫిర్యాదుతో నమోదు

» పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో తనపై కావాలనే దుష్ప్రచారం చేసి అవమానించారని ఆరోపణ

» నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కాంగ్రెస్ నేత ఉగ్గిడి శ్రీనివాస్‌ల ఫిర్యాదులతో మరో 2 కేసులు

» మొత్తం 3 కేసుల్లో కేటీఆర్, కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్, తెలుగు స్క్రైబ్, టీ న్యూస్, తెలుగు మిర్రర్‌పై ఫిర్యాదులు



నల్లగొండ/కామారెడ్డి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మర్రూరు మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్ ఫిర్యాదుతో ఈ కేసు నమోదు చేశారు. ఈ నెల 21న పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం లీక్ ఘటనలో బాధ్యులుగా ఇటీవల 12మందిని రిమాండ్ చేయగా, ఒకరు పరారీలో ఉన్నారు. అయితే, నిందితుల్లో ముగ్గురు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులకు సన్నిహితులుగా పేర్కొంటూ తెలుగు స్క్రైబ్ యూట్యూబ్ (వెబ్), టీ న్యూస్, తెలుగు మిర్రర్ ఛానల్స్‌లో అసత్యాలు ప్రచారం చేశారని, వాటిని కేటీఆర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం కన్వీనర్ కొణతం దిలీప్, ఆ పార్టీ నేత మన్నె క్రిశాంక్ తమ సోషల్ మీడియా అకౌంట్లలో ఫార్వర్డ్ చేశారని, నిందలు వేసి అవమానించారని నరేందర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు కేటీఆర్‌పై ఇదే పోలీస్ స్టేషన్‌లో మరో రెండు కేసులు నమోదయ్యాయి. మొత్తం మూడు కేసుల్లో కేటీఆర్‌తో పాటు దిలీప్, క్రిశాంక్, తెలుగు స్క్రైబ్, టీ న్యూస్ ఛానల్, తెలుగు మిర్రర్ ఛానల్స్, వాటి ఎండీలపైనా కేసులు నమోదు చేశారు. బాధ్యత గల పదవిలో ఉన్న తనకు కళంకం తెచ్చేలా దుష్ప్రచారం చేశారని నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగాని రజిత ఒక కేసు పెట్టగా, కాంగ్రెస్ నాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్ మరో కేసు పెట్టారు. దీంతో కేసులు నమోదు చేసినట్లు నకిరేకల్ సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. కాగా, ప్రశ్నపత్రం లీక్ కేసులో నిందితుడిగా ఉన్న బండి శ్రీను తనకు ఏ సమయంలోనూ డ్రైవర్‌గా పనిచేయలేదని నరేందర్ తన ఫిర్యాదులో తెలిపారు. కేవలం తనని అవమానపరచడానికే బీఆర్ఎస్ నాయకులు, వారి అనుకూల ఛానళ్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని ఆరోపించారు. "పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ కేసులో పోలీసులు రిమాండ్ చేసిన బండి శ్రీను మర్రూరు మాజీ సర్పంచ్ నరేందర్ డ్రైవర్. బండి శ్రీనును నరేందరే ఉసిగొల్పి ప్రశ్నపత్రాన్ని లీక్ చేయించారని తెలుగు స్క్రైబ్, టీన్యూస్‌లో అసత్యాన్ని ప్రసారం చేశాయి. వాటిని నిర్ధారించుకోకుండా కేటీఆర్, దిలీప్ ఫార్వర్డ్ చేశారు" అని నరేందర్ తెలిపారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. దీంతో, పోలీసులు కేటీఆర్‌ను ఏ-1గా, దిలీప్‌ను ఏ-2గా, టీ న్యూస్ ఛానల్ మేనేజ్‌మెంట్, తెలుగు స్క్రైబ్ యూట్యూబ్ ఛానల్ (వెబ్)ని ఏ-3గా కేసు నమోదు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో రిమాండ్ చేసిన చిట్ల ఆకాశ్‌ను తన డ్రైవర్‌గా పేర్కొన్నారని, ప్రశ్నపత్రాల లీకేజీలో తన ప్రమేయం ఉన్నట్లు అసత్య ప్రచారం చేశారని చౌగాని రజిత చేసిన ఫిర్యాదుతో రెండో కేసు నమోదైంది. ఆకాశ్ తమకు ఏనాడూ డ్రైవర్‌గా పనిచేయలేదని రజిత తెలిపారు. ఈ ఫిర్యాదులో ఏ-1గా క్రిశాంక్, ఏ-2గా కేటీఆర్, ఏ-3గా దిలీప్, టీన్యూస్, తెలుగు స్క్రైబ్ వెబ్ పైన కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్ నాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్ ఫిర్యాదులో ఏ-1గా దిలీప్, ఏ-2గా క్రిశాంక్, ఏ-3గా కేటీఆర్‌తోపాటు తప్పుడు ప్రసారాలు చేసినందుకు ఏ-4గా తెలుగు స్క్రైబ్ ఎండీ, ఏ-5గా మిర్రర్ టీవీ యూట్యూబ్ ఛానెల్ ఎండీతో పాటు ఇతర ఛానెల్స్ నిర్వాహకులపై కేసు పెట్టారు. తాను నకిరేకల్‌లోని గౌతమి స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కై, శంకర్ ద్వారా పేపర్ లీక్ చేయించానని అసత్య ప్రచారం చేసినట్లు శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కామారెడ్డి జుక్కల్‌లో గణితం ప్రశ్నలు లీక్?

కామారెడ్డి జిల్లా జుక్కల్‌లోని టెన్త్ పరీక్ష కేంద్రం నుంచి బుధవారం గణితం ప్రశ్నాపత్రంలోని 5ప్రశ్నలు లీకైనట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తెల్లకాగితంపై ఈ ప్రశ్నలు రాసి ఉన్న ఫొటోలు బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు సిబ్బందిని డీఈవో రాజు వేటు వేశారు. సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ సునీల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ భీమ్, ఇన్విజిలేటర్ దీపికలను సస్పెండ్ చేశారు.

గత ఏడేళ్లలో నియమితులైన హైకోర్టు జడ్జిల్లో 78% ఉన్నత కులాల వారే!

న్యూఢిల్లీ, మార్చి 26: గత ఏడేళ్లలో నియమితులైన వివిధ హైకోర్టుల జడ్జిల్లో 78 శాతం మంది ఉన్నత కులాలకు చెందిన వారేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు 5 శాతం చొప్పున, ఓబీసీల నుంచి 12 శాతం మంది ఉన్నారని పేర్కొంది. ఆర్జేడీ లోక్‌సభ సభ్యుడు మనోజ్ ఝా అడిగిన ప్రశ్నకు న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బదులిస్తూ ఈ వివరాలు తెలిపారు. 2018 నుంచి 715 మంది హైకోర్టు జడ్జిలు నియమితులయ్యారని చెప్పారు. వీరిలో 22 మంది ఎస్సీ, 16 మంది ఎస్టీ, 89 మంది ఓబీసీ, 37 మంది మైనారిటీలకు చెందినవారు ఉన్నారని తెలిపారు. ఉన్నత న్యాయ స్థానాల్లో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, మహిళలు, మైనారిటీలకు చెందిన జడ్జిల నియామకం ఆశించినదాని కంటే చాలా తక్కువగా ఉందని మనోజ్ ఝా అన్నారు. జ్యుడీషియరీ నియామకాల్లో సామాజిక వైవిధ్యం అంశంపై కేంద్రం సుప్రీంకోర్టును సంప్రదించిందా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు, హైకోర్టుల జడ్జిల నియామకం 124, 217, 224 ఆర్టికల్స్ పరిధిలో ఉందని, అందువల్ల ఏ కులానికి, ఏ వర్గానికి చెందిన వ్యక్తులకైనా రిజర్వేషన్ ఉండదని మేఘ్వాల్ తెలిపారు. అయితే 2018 నుంచి సామాజిక వైవిధ్యం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

టూరిజం గురించి 30 ఏళ్ల క్రితమే చెప్పాను

» అప్పట్లో కమ్యూనిస్టులు తిట్టారు.. ఇప్పుడు అంగీకరించారు

» కూనంనేని వ్యాఖ్యలపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను ఏపీ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తావించారు. 'గతంలో చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు.. ఏ ఇజం లేదు.. ఇక టూరిజమే ప్రధానం అనేవారు. ఏ ఇజం లేదంటే అప్పట్లో మాకు కోపం వచ్చేది. కానీ, నిజంగా ఖర్చులేని ఇజం ఏదైనా ఉందంటే అది టూరిజమే' అని కూనంనేని అన్నారు. నాడు చంద్రబాబు చెప్పినమాటే నిజమని చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు నవ్వుతూ స్పందించారు. 'గతంలో నేను కమ్యూనిజం లేదు క్యాపిటలిజం లేదు.. ఉన్నదల్లా టూరిజమేనని అన్నాను. కమ్యూనిజం లేదంటారా.. అని అప్పుడు నన్ను కమ్యూనిస్టులు తిట్టారు. నా ఉద్దేశం ఏమిటంటే టూరిజం వల్ల అభివృద్ధి జరుగుతుందని. నిన్న తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఖర్చులేని ఇజం టూరిజమని చెప్పారు. నా మాటలు అర్థం చేసుకోవడానికి వారికి 30 ఏళ్లు పట్టింది' అని చంద్రబాబు అన్నారు. 'కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి' అని అన్నారు.

ఇతర బేసిన్‌లకు ఏపీ తరలించే నీరెంత?

» కృష్ణా ట్రైబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ప్రశ్న

» 312 టీఎంసీలను తరలిస్తోందన్న తెలంగాణ

» తదుపరి విచారణ ఏప్రిల్ 15కు వాయిదా

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇతర బేసిన్‌లకు ఏపీ ఎంత నీరు తరలిస్తోందని కృష్ణా ట్రైబ్యునల్-2 చైర్మన్ జస్టిస్ బ్రిజేష్ కుమార్ ప్రశ్నించారు. బుధవారం న్యూఢిల్లీలోని ట్రైబ్యునల్‌లో కృష్ణా జలాల పంపిణీపై స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) ప్రకారం తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తుండగా...చైర్మన్ ఈమేరకు ఆరా తీశారు. ఏపీ 312 టీఎంసీల నీటిని ఇతర బేసిన్‌లకు తరలిస్తుండగా... 189 టీఎంసీలు మాత్రమే కృష్ణా బేసిన్‌లో వినియోగిస్తున్నట్టు వైద్యనాథన్ వివరించారు. కృష్ణా డెల్టాకు పోలవరం ప్రాజెక్టు నుంచి నీటిని తరలిస్తున్నారని, దాంతో మిగిలే కృష్ణా జలాలను తెలంగాణకు కేటాయించాలని కోరారు. కృష్ణా డెల్టాకు ఇప్పటికే 43.2 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా... పోలవరం ద్వారా 80 టీఎంసీలను కృష్ణాడెల్టాకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని, 2015లో పట్టి సీమ ఎత్తిపోతల పథకం ద్వారా 100 టీఎంసీలను తరలించారని గుర్తు చేశారు. కృష్ణా బేసిన్‌లో 2023-24లో తీవ్ర లోటు ఉండగా 125 టీఎంసీలను కృష్ణా డెల్టాకు తరలించారని తెలిపారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు వీలుగా 150 టీఎంసీలతో శ్రీశైలం లెఫ్ట్‌బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) చేపట్టి, నీటి కేటాయింపులు చేయాలని బచావత్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-1)ను తెలంగాణ కోరిందని వివరించారు. బేసిన్ లోపలి ప్రాజెక్టులకుకాకుండా బేసిన్ వెలుపలి ప్రాజెక్టులకే నీటి కేటాయింపులను ఏపీ కోరుతోందన్నారు. బేసిన్ లోపలి ప్రాంతాలకు నీటిని అందించడానికి ఎస్ఎల్‌బీసీని ప్రతిపాదించగా...ఇతర బేసిన్‌లకు నీటిని తరలించేందుకు శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఆర్‌బీసీ)ను ఏపీ చేపట్టిందన్నారు. నికర జలాలను ఎస్ఆర్‌బీసీకి కేటాయించి, వరద జలాలను మాత్రం ఎస్ఎల్‌బీసీకి కేటాయించారని తెలిపారు. కృష్ణా ట్రైబ్యునల్-2 ముందు కూడా ఎస్ఆర్‌బీసీకి నికర జలాలను కోరకుండా... ఇతర బేసిన్‌లోని తెలుగుగంగ ప్రాజెక్టుకు నీటిని కేటాయించాలని ఏపీ కోరిందని చెప్పారు. మరోవైపు ట్రైబ్యునల్‌లో తెలంగాణ తదుపరి వాదనలు ఏప్రిల్ 15 నుంచి 17వ తేదీ వరకు వినిపించనున్నారు.

రాష్ట్రంలో 1.90 కోట్ల గొర్రెలు.. 49.35లక్షల మేకలు

» దేశంలో 26.75% గొర్రెలు తెలంగాణలోనే

» తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.90కోట్ల(1,90,63,000) గొర్రెలు ఉన్నట్లు తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే నివేదిక-2025 వెల్లడించింది. ఈ సంఖ్య దేశంలో ఉన్న మొత్తం గొర్రెల్లో 26.57శాతం అని తెలిపింది. దేశవ్యాప్తంగా 7.42కోట్ల గొర్రెలు ఉన్నట్లు వివరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 20వ పశుగణన లెక్కలను సామాజిక ఆర్థిక సర్వేలో పొందుపర్చింది. ఈ పశుగణన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 49.35 లక్షల మేకలు, 42.31 లక్షల పశువులు(ఆవులు, ఎద్దులు), 42.26 లక్షల గేదెలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కోళ్ల సంఖ్య 8 కోట్లుగా ఉంది. ఇందులో పెరటి కోళ్లు 1.75కోట్లు. వాణిజ్య కోళ్ల పరిశ్రమ(పౌల్ట్రీ)లో 6.25కోట్ల కోళ్లు ఉన్నాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 70శాతం కుటుంబాలు పశువులను కలిగి ఉన్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విద్వేషాలు, అసహనాలు

మైనారిటీలకు వ్యతిరేకంగా రాజకీయ నాయకులు చేస్తున్న విద్వేష పూరిత ప్రసంగాలమీద బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్న ఎదురైనప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒక తెలివైన సమాధానం చెప్పింది. పెరుగుతున్న విద్వేష వ్యాఖ్యలు, ప్రసంగాలు, వాటి ప్రభావంతో రేగిన కల్లోలాలు, ఘర్షణలకు సంబంధించి మీ దగ్గర ఉన్న సమాచారం ఏమిటి, వాటిని నిలువరించడానికి ఒక విధానాన్ని తెచ్చే ఆలోచన కేంద్రానికి ఏమైనా ఉన్నదా అని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు సమాధానం చెబుతూ, పోలీసులు, శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలో అంశాలు కనుక తమవద్ద సంబంధిత సమాచారం ఉండదన్నారు. సమాజ్‌వాదీపార్టీ ఎంపీ ప్రశ్న వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉండవచ్చును కానీ, సందర్భం లేకపోలేదు. నెలక్రితం ఇండియా హేట్ ల్యాబ్ ప్రచురించిన నివేదిక, గత ఏడాది దేశంలో వెయ్యికి పైగా విద్వేషప్రసంగాలు జరిగాయని, 2023తో పోల్చితే 74శాతం హెచ్చాయని ఒక విశ్లేషణ చేసింది. రాజకీయ నాయకుల ప్రసంగాల్లో అత్యధికం బీజేపీవారివేనన్నది సారాంశం. ఎన్నికల ప్రచారంలో, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి నాయకులు ఓట్లు రాబట్టుకున్న విషయాన్ని ఈ రిపోర్టు విశ్లేషించింది. రాజస్థాన్‌లోని బన్స్వరాలో ప్రధాని స్వయంగా 'చొరబాటుదారులు' అని చేసిన వ్యాఖ్యను కూడా ఇది ప్రస్తావించింది. ఈ తరహా ప్రసంగాలకు సంబంధించి మా దగ్గర ఏ లెక్కలూ లేవు, మార్చే విధానమూ లేదు అని కేంద్రం ఇచ్చిన సమాధానం ఆశ్చర్యం కలిగించదు కానీ, విద్వేష వ్యాఖ్యలతో మత రాజకీయాలు చేస్తున్న ఈ నాయకులు, వేరొకరు తమ మీద ఒక చిన్న జోక్ వేసినా సహించలేకపోతూండటం విచిత్రం.

రాజకీయ నాయకులు పరస్పరం ఎంత తీవ్రంగానైనా విమర్శించుకోవచ్చును, ఎక్కడలేని బురదా చెత్తా తెచ్చి పోసుకోవచ్చు, అందులో భాగంగా అసభ్యకరపదజాలమూ వాడవచ్చు. ఆ దుర్భాషలన్నీ సమాజం సహించాల్సిందే తప్ప, తమను మాత్రం ఎవరూ పల్లెత్తు విమర్శచేయకూడదు, అసమ్మతి ప్రదర్శించకూడదు, హాస్యానికి కూడా అనకూడదు. కునాల్ కమ్రా అనే ఒక స్టాండప్ కమేడియన్ మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌శిందేను దృష్టిలో పెట్టుకొని ఒక పారడీపాటలో కుట్రదారుగా అభివర్ణించినందుకు శిందే అభిమానులకు ఆగ్రహం కలిగింది. వారు సృష్టించిన విధ్వంసం, చేసిన అవమానకర వ్యాఖ్యలు దేశం యావత్తూ చూసింది. ముంబైలో దశాబ్దాల క్రితం ఆవిర్భవించి, పేరు ప్రఖ్యాతులున్న హాబిటేట్ స్టూడియో నాశనం అయింది. ఇదే సందర్భంలో ముంబై మునిసిపల్ కార్పొరేషన్‌కు ఈ స్టూడియో పలు అతిక్రమణలు, ఉల్లంఘనలు పాల్పడినట్టు గుర్తొచ్చి కూల్చివేతలు జరిపింది. కమ్రాకు షూట్ చేసుకొనే అవకాశమిచ్చినందుకు ఆ స్టూడియో తీవ్రంగా నష్టపోయి మూతబడింది. కమేడియన్లతో పాటు, వారికి అండగా ఉన్న, ఆశ్రయం ఇస్తున్న వ్యక్తులూ సంస్థలూ కూడా తమ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఈ ఉదంతం అర్థం. ఇదంతా శిందే అభిమానులకు అప్పటికప్పుడు పుట్టిన ఆగ్రహమని మొదట్లో అంతా భ్రమపడ్డారు. కానీ, ఇప్పుడు శిందే చేస్తున్న వ్యాఖ్యలను బట్టి, ఆయన ఆదేశాలతోనే ఈ దాడి జరిగిందని కూడా అనుకోవచ్చు. కమ్రాని వెంటాడి వేటాడి దేశంనుంచి తరిమివేసే వరకూ నిద్రపోబోమని మహాయుతి నాయకులు అంటున్నారు. విమర్శనీ, అసమ్మతినీ సహించలేనితనం ప్రమాదకరం.

పోలీసులు కేసులు పెట్టినా, సారీ చెప్పమని ముఖ్యమంత్రి నిలదీస్తున్నా, కమ్రా గట్టిగానే నిలబడ్డాడు. ఉద్ధవ్ సేన సహజంగానే ఈ వివాదాన్ని తనకు అనుకూలంగా వాడుకుంటోంది, కమ్రా పక్షాన నిలబడింది. కమ్రా కామెడీ వెనుక ఏవో కుట్రలున్నాయని, కాసులు ఎక్కడనుంచి వస్తున్నాయో తేలుస్తానని అధికారపక్షం అంటోంది. ఇక, శిందే విషయంలో ద్రోహి, వెన్నుపోటుదారుడు, తిన్నింటివాసాలు లెక్కబెట్టడం ఇత్యాది మాటలు అనేకం దేశం నిన్నమొన్నటివరకూ శివసేన చీలికవర్గాలనుంచే విన్నది. విపక్షపాలిత రాష్ట్రాల్లో ఏక్‌నాథ్‌శిందేలను సృష్టిస్తామని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించిన సందర్భాలూ ఉన్నాయి. కమ్రా హద్దులు దాటాడా లేదా అన్నది అటుంచితే, ఈ దాడితో శిందేమీద ఆయన చేసిన వెటకారపు వ్యాఖ్యలకు మరింత ప్రచారం వచ్చింది. ససేమిరా సారీ చెప్పనంటూ ఆయన ఇంకొంతమంది నాయకులమీద వ్యంగ్యాస్త్రాలు సంధించే అవకాశమూ దక్కింది. ఈ వ్యవహారం ఎలా ముగుస్తుందన్నది అటుంచితే, ప్రజాస్వామ్యం, భావవ్యక్తీకరణస్వేచ్ఛ, రాజ్యాంగం, హక్కులు ఇత్యాదివి కాస్తంత గుర్తెరిగి, నాయకులు కాస్తంత బాధ్యతగా వ్యవహరించడం అవసరం.

ఇప్పుడు కావాల్సిన లోహియా మార్గదర్శకత్వం

'దార్శనిక నేత, స్వాతంత్ర్య సమర సైనికుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు' అని రామ్ మనోహర్ లోహియాను ఆయన 115వ జయంత్యుత్సవం (మార్చి 23)లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తుచేసుకున్నారు. లోహియా రాజకీయ, సైద్ధాంతిక వారసత్వం నుంచి ఆచరణాత్మక స్ఫూర్తి పొందడానికి ప్రతిపక్షం చేస్తున్న ప్రయత్నాలు, దురదృష్టవశాత్తు, శూన్యం. యూరోప్ నుంచి గ్రహించిన సోషలిస్టు భావజాలాన్ని భారతీయ సమాజానికి అనుగుణంగా రూపొందించి, అమలుపరిచేందుకు ఆయన చేసిన విశేష కృషి విస్తృత స్థాయిలో రాజకీయ శ్రేణులను ప్రభావితం చేయలేకపోవడం ఒక విషాదం.

నరేంద్ర మోదీ గానీ, బీజేపీ సిద్ధాంతకర్తలు గానీ లోహియాను ప్రస్తుతించడం ఇదే మొదటిసారి కాదు. లోహియా భావాలు, అభిప్రాయాలను తమ రాజకీయ ప్రయోజనాలకు వారు తరచు ఉపయోగించుకుంటున్నారు. నెహ్రూను లోహియా ఎంత తీవ్రంగా విమర్శించినా ఒకనాటి జనసంఘ్ అజెండాల విషయంలో ఆయన నెహ్రూతో పూర్తిగా ఏకీభవించేవారు. లోహియా అనుసరించిన కాంగ్రెస్ వ్యతిరేక వాదాన్ని నేటి బీజేపీ, కాంగ్రెస్‌ను విమర్శించేందుకు వినియోగించుకుంటుంది. లోహియా 'ఇంగ్లీష్ బహిష్కరణ' నినాదాన్ని దేశ వ్యాప్తంగా హిందీ విధింపునకు ఉపయోగిస్తున్నారు. బలహీన వర్గాల రాజకీయ అభ్యున్నతికి లోహియా ఇచ్చిన మద్దతు, అందించిన తోడ్పాటును ఇప్పుడు ప్రాబల్య ఓ బీసీలు అధికారాన్ని కైవసం చేసుకునేందుకు వాడుకుంటున్నారు.



■ యోగేంద్ర యాదవ్

లోహియా వారసత్వాన్ని కాపాడుకోవడమనేది ఆయన ఆలోచనల, విధానాల వక్రీకరణలను సరిదిద్దడంతో ప్రారంభమవ్వాలి. కాంగ్రెస్ వ్యతిరేక వాదం అనేది ఒక రాజకీయ తాత్వికత కాదు, పాలక వర్గాల రాజకీయాలను జయించేందుకు అదొక స్వల్పకాలిక ఎత్తుగడ మాత్రమే. భారత జాతీయ కాంగ్రెస్‌లో లోహియా రాజకీయ ప్రస్థానం ప్రారంభమయింది. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ నుంచి నిష్క్రమించాలన్న పలువురు సోషలిస్టు ప్రముఖుల ప్రతిపాదనను ఆయన తొలుత తీవ్రంగా వ్యతిరేకించారు. 1960ల్లో దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రాబల్యం పూర్తి స్థాయిలో ప్రబలిపోయినప్పుడు మాత్రమే ఆయన కాంగ్రెస్ వ్యతిరేక వాదాన్ని ప్రతిపాదించారు.

లోహియా ఆంగ్ల భాషా వ్యతిరేకి కానేకాదు. ఆ భాషను ఆయన అమితంగా ఇష్టపడేవారు. అయితే ఇంగ్లీష్ ఆధిపత్యాన్ని వ్యతిరేకించేవారు. అది ఒక విదేశీ భాష అయినందు వల్ల కాక. భూస్వామ్య జీవన శైలి, వర్గ అసమానతలకు ప్రతినిధిగా ఉన్నందునే ఆంగ్ల భాషను ఆయన వ్యతిరేకించారు. అలాగే ఆయన హిందీ భాషా దురహంకారి కూడా కాదు. అన్ని భారతీయ భాషలను సమరీతిలో అభివృద్ధి పరచాలని ఆయన ఆకాంక్షించేవారు వివిధ భారతీయ భాషలలోని ప్రముఖ రచయితలను లోహియా ఆలోచనలు ప్రభావితం చేయడంలో ఆశ్చర్యమేముంది? ఫణీశ్వర్‌నాథ్ రేణు, రఘువీర్ సహాయ్, సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా, విజయ్‌దేవ్ నారాయన్ సాహి (హిందీ), బీరేంద్ర కుమార్ భట్టాచార్య (అస్సామీ), యుఆర్ అనంతమూర్తి, పూర్ణచంద్ర తేజస్వి, పి. లంకేష్, సిద్దలింగయ్య (కన్నడ) మొదలైన రచయితలు తమ సాహితీ సృజనలో లోహియా భావాల నుంచి స్ఫూర్తి పొందినవారే.



భారతదేశ సొంత ఆధునికతకు తాత్విక పునాదులను నిర్మించడమే లోహియా వారసత్వం. సామాజిక, ఆర్థిక సమత సాధనకు నిబద్ధమైన లోహియా కొత్త ప్రగతి-శీల రాజకీయాలకు నమూనాను రూపొందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని కాపాడుకునేందుకు దోహదం చేసే సైద్ధాంతిక ప్రాతిపదికలను లోహియా రాజకీయ చింతన సమకూరుస్తుందనడంలో సందేహం లేదు.

సామాజిక న్యాయానికి సంబంధించిన లోహియా విధానాలు కేవలం ఓబీసీలకు మాత్రమే ప్రాధాన్యమివ్వలేదు. వెనుకబడిన కులాల వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించాలన్నది ఆయన వాదన. ఆయన దృష్టిలో వెనుకబడిన లేదా అణగారిన వర్గాలు అంటే ఓబీసీలు, దళితులు, ఆదివాసులతో పాటు మహిళలు కూడా. వీరందరి పురోగతికి ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సి ఉన్నదని ఆయన నొక్కి చెప్పేవారు. ఆయన గర్హించిన ఆరు అన్యాయాలలో జెండర్ అసమానత్వం కూడా ఒకటి. ఈ అన్యాయాలను రూపుమాపేందుకు ఏడు విప్లవాల (సప్త క్రాంతి)ను సాధించాలని ఆయన సంకల్పించారు.

వర్తమాన భారతదేశ లౌకికవాద రాజకీయాలకు ఎదురవుతున్న ప్రధాన సవాళ్లలో ఒకటి వాటికి మన సమున్నత నాగరికతా వారసత్వం, జాతీయోద్యమ భావస్రవంతిలో మూలాలు ఉన్న సాంస్కృతిక ప్రాతిపదికలు కొరవడటమే. ప్రగతిశీల సోషలిస్టు రాజకీయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు లోహియా మన సాంస్కృతిక సంప్రదాయాలు, విలువలను ఉపయోగించుకున్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య సమైక్యతకు శ్రీరామచంద్రుడు, తూర్పు, పశ్చిమ భారతదేశాల మధ్య ఐక్యతకు శ్రీకృష్ణుడు ప్రతీకలు అని లోహియా భావించారు. పర్యావరణ పరిరక్షణ చైతన్యం ఉద్భవించడానికి చాలా కాలం ముందే మన నదులు కృశించిపోతున్న పరిస్థితుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.. సోషలిస్టు భావాలను వివరించేందుకు ఈశోపనిషత్తులోని నచికేతుడి కథను ఆధారంగా చేసుకునేవారు. భారతీయ దర్శనాలు, ఇతిహాసాలు, కావ్యాలపై లోహియా విలక్షణ భావాలు ఎమ్‌ఎఫ్ హుస్సేన్‌తో సహా ఎంతో మంది కళాకారులను ఉత్తేజపరిచాయి.

హిందూ మత సంకుచితత్వంపై తన విమర్శను వశిష్ఠుడు, వాల్మీకిల ద్వారా లోహియా వ్యక్తపరిచారు. అగ్రవర్ణ హిందువుల సంకుచిత వైఖరులకు వశిష్ఠుడు ప్రతినిధి అని ఆయన భావించారు. హిందూ ధర్మంలోని ఉదారవాద సంప్రదాయానికి వాల్మీకి ప్రతినిధి అని ఆయన పేర్కొన్నారు. అంతర్గత సంస్కరణలకు, న్యాయసాధనకు, బాహ్య ప్రభావాలను సాదరంగా ఆహ్వానించేందుకు ఈ సంప్రదాయం దోహదం చేస్తుందని లోహియా అన్నారు. హిందూ వెర్సెస్ ముస్లిమ్ లేదా క్రిస్టియన్ అనే సంవాదంలోని కీలక అంశం హిందూ ధర్మంలోని రెండు భావస్రవంతుల మధ్య ఘర్షణే అని లోహియా అన్నారు. హిందూ ధర్మ చింతన, జీవన వ్యవహారాలలో ఉదారవాద సంప్రదాయం ప్రబలంగా ఉన్నప్పుడు భారత్ సమున్నత నాగరికతా శిఖరాలను అధిరోహిస్తుంది. ఔదార్య రహితమైన హిందూ ధర్మం ఒక జాతిగా, ఒక నాగరికతగా భారతదేశ క్షీణతను సూచిస్తుందని లోహియా అభిప్రాయపడ్డారు.

లోహియా వారసత్వం భారతదేశ సొంత ఆధునికతకు తాత్విక పునాదులను నిర్మించడమే. మార్క్సిజంతో సహా యూరోప్ కేంద్రిత పాశ్చాత్య సిద్ధాంతాలను ఆయన నిశితంగా, నిష్కర్షగా విమర్శించారు. అదే సమయంలో మన మహోన్నత గతం గురించిన భ్రమల్లో ఆయన ఏ మాత్రం చిక్కుకోలేదు. సామాజిక, ఆర్థిక సమత సాధనకు నిబద్ధమైన లోహియా కొత్త ప్రగతిశీల రాజకీయాలకు నమూనాను రూపొందించారు. ఆయన సూత్రీకరణలు అన్నీ కాల పరీక్షకు నిలిచేవి కానప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని కాపాడుకునేందుకు దోహదం చేసే సైద్ధాంతిక ప్రాతిపదికలను లోహియా రాజకీయ చింతన సమకూరుస్తుందనడంలో సందేహం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

సాంస్కృతిక విధానం దిశగా తొలి అడుగు

చారిత్రక సంస్కృతి, నాగరికతా వికాసంలోనూ తెలంగాణ ఘనమైన వారసత్వం కలిగి ఉంది. దేశంలో ఏ ప్రాంతానికీ ఈ నేల భౌగోళికత తీసిపోదు. క్రీస్తుకు పూర్వం 221 నుంచి 218 వరకు కోటిలింగాల రాజధానిగా శాతవాహనులు దేశమంతా విస్తరింపచేసిన తొలి తెలుగు రాజ్యం ఇది. ఆ కాలంలోనే హాలుడు 700 గాథలతో 'గాథా సప్తశతి' సంకలనం చేశాడు. ఇది చారిత్రాత్మకమైన కవిత్వం. ప్రపంచ జాతక కథల్లో మొట్టమొదటి 'బృహత్కథ' ఈ గడ్డ నుంచే వచ్చింది. ఆ తర్వాత క్రీస్తు శకం 945లోనే జినవల్లభుడు తొలి తెలుగు కందపద్యంతో కురిక్యాల శాసనం ప్రకటించారు. ఈ శాసనమే తెలుగుకు ప్రాచీన హోదా రావడానికి తోడ్పడింది. అటు తర్వాత పాలకురికి సోమనాథుని 'బసవ పురాణం', గోన బుద్ధారెడ్డి కాకతీయుల కాలం, కులీ కుతుబ్ షా హయాం... అక్కడి నుంచే మొదలైంది తెలంగాణ సాంస్కృతిక సారస్వత కళల వైభవ చరిత్ర.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం పదేళ్లలోనూ ఒక సమగ్ర సాంస్కృతిక విధానాన్ని నాటి ప్రభుత్వం రూపొందించలేకపోయింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధాన రూపకల్పనకు శ్రీకారం చుడుతుందని ఆశిస్తున్నాం. ఎందుకంటే ఇటీవల ప్రఖ్యాత ప్రత్యామ్నాయ సినిమా దర్శకుడు, కవి, రచయిత, చిత్రకారుడు బి. నరసింగరావుతో ప్రభుత్వం చర్చించి ఒక సాంస్కృతిక పాలసీ డాక్యుమెంట్‌ను తయారు చేయించింది. ఆయన తెలంగాణ హెరిటేజ్‌కు సంబంధించి ఒక విలువైన డాక్యుమెంట్‌ను రూపొందించారు. సాహిత్యం, సాంస్కృతికం, లలిత కళలు, శిల్పకళ, గ్రంథాలయాలు, ప్రదర్శనశాలలు, చలనచిత్రం, నాట్యం, ఫోటోగ్రఫీ మొదలుకొని సమస్త రంగాలను మేళవించి తెలంగాణ రాష్ట్రం కోసం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనటువంటి కల్చరల్ పాలసీ డాక్యుమెంట్‌ను ఆయన రూపొందించారు.

ఏ ప్రభుత్వాలకైనా అభివృద్ధి, సంక్షేమం, ప్రజా పరిపాలనకు సంబంధించి ప్రాధాన్యతలు ముందు వరుసలో ఉంటాయి. అనంతరం శాంతిభద్రతలు, ఆర్థిక వ్యవహారాలు. ఆ తర్వాతే సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, ఇతర కళావారసత్వానికి సంబంధించినవి ఉంటాయి. కానీ కాలయాపన చేయకుండా ఒక సమగ్ర సంస్కృతిక పాలసీని చర్చించి, ఆమోదిస్తే తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వం కాట కలువకుండా నిలిచిపోతుంది.

బి. నరసింగరావు రూపొందించిన సమగ్ర సాంస్కృతిక విధానపత్రం మహా అద్భుతంగా ఉంది. ఒక ఆర్కిటెక్ట్ బహుళ అంతస్తుల భవనాన్ని కళాత్మకంగా ఎలా గీస్తారో నర్సింగరావు అలాగే ఒక విజనరీ ప్రణాళికను రూపొందించారు. అందులో ఇప్పుడు ఉన్న సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, ఫోటోగ్రఫీ అకాడమీ, జానపద అకాడమీలను ప్రతిపాదించారు. వీటితోపాటు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గ్రంథాలయాలు, మ్యూజియాలు, ఇవన్నీ వివిధ శాఖల కింద పనిచేస్తున్నాయి. అన్నిటి అనుసంధానం జాప్యం కాకుండా సీఎంఓ స్థాయిలో కార్యదర్శి నేతృత్వంలో సాంస్కృతిక సచివాలయం ఒకటి ఉండాలి. సంబంధిత పర్యవేక్షణ ద్వారా ఇది కొనసాగుతుండాలి. ఇందులో సాహిత్యం, కళలు, చలనచిత్రం, సాంస్కృతిక వారసత్వం, జాతీయ అంతర్జాతీయ లావాదేవీలు విభాగాలుగా ఉండాలి. వీటికి గురుత్వ అధికారి నేతృత్వం వహించాలి. ఆ అధికారి కూడా ఆయా విషయ పరిజ్ఞానంలో నిష్ణాతులై, నిపుణులై ఉన్నవాళ్లను ఎంపిక చేయాలి.



srini

దర్శకుడు, రచయిత బి. నర్సింగరావు 22 పుటల్లో రూపొందించిన తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానపత్రం భావి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కాలయాపన చేయకుండా ఒక సమగ్ర సాంస్కృతిక పాలసీని చర్చించి, ఆమోదిస్తే తరతరాల తెలంగాణ వారసత్వం కాటకలువకుండా నిలిచిపోతుంది.

ఇకపోతే సాహిత్యం, కళల కోసం పూర్వ తెలంగాణలోని పది జిల్లా కేంద్రాల్లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిలో భవన సదుపాయాలు నిర్మించాలి. ఇందులో ఆ పూర్వ జిల్లా పరిధిలో చిత్రకళ, శిల్పకళ, సంగీతం, నృత్యం, నాటకం, ఫోటోగ్రఫీ, సినిమా అధ్యయనం, వారసత్వ అధ్యయనానికి కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. ఒక కళాశాల నిర్మించాలి. అదే స్థలంలో 800, 250, 150 సీట్ల కెపాసిటీతో, వేర్వేరు వైశాల్యాలతో మూడు ఆడిటోరియాలు నిర్మించాలి. మరొక భవనంలో మ్యూజియం, గ్రంథాలయం, ఫోటోగ్రఫీ, పెయింటింగ్ ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయాలి. మరొక భవన సదుపాయంలో శిక్షణా శిబిరాల రిహార్సల్స్ కోసం విశాలమైన షెడ్లు, సిబ్బంది వసతిగృహాలు నిర్మించాలి. ఇలా పది జిల్లాల్లో నిర్మిస్తూ సమాంతరంగా పది ఎకరాలలో హైదరాబాదులో మరొక భవన సదుపాయాన్ని నిర్మించాలి. కెఫటేరియా, రెస్టారెంట్ గెస్ట్‌హౌస్‌లు డబుల్ బెడ్ రూమ్‌లు ఉండాలి. వీటితో పాటు తెలంగాణలో అన్ని నగరాల్లో ఉన్న ఆడిటోరియాలను పునరుద్ధరించాలి. తెలంగాణలో నడుస్తున్న బాల భవన్‌లు, శిల్పారామాలను పునర్ నిర్మించి తెలంగాణ సాంస్కృతిక కేంద్రంగా కార్యకలాపాలను నడిపించాలి.

ప్రపంచంలో సినిమా రంగానికి సంబంధించిన అధ్యయనం గొప్పగా సాగుతున్నది. మన తెలుగు రాష్ట్రంలో అది లేదు. ఇందుకోసం ఫిలిం సొసైటీలు నటీనటుల సంఘాల సమన్వయంతో సంప్రదింపులు జరపాలి. సినిమాలకు సంబంధించి నిర్మాణం, ప్రచారం, ప్రదర్శన ఇలా మూడు పాయలుగా అభివృద్ధి చేయాలి. అందుకుగాను 10 ఎకరాల స్థలంలో ఒక సినిమా కాంప్లెక్స్ తీర్మానం చేపట్టి దానికి పైడి జయరాజు సినిమా ఘర్ పేరు పెట్టాలి పైడి జయరాజ్ తెలంగాణ సినిమా వైతాళికుడు. 1928లోనే తెలుగు సినిమాను జాతీయ స్థాయిలోకి తీసుకువెళ్లిన ఘనుడు.

'సినిమా నిర్మాణ' కేంద్రం ఒకటి ఏర్పాటు చేయాలి అందులో నిర్మాతల సంఘం, దర్శకుల సంఘం, సినిమా కళాకారుల సంఘం, సినిమా జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేయించాలి. ఈ సినిమా ఘర్‌లోనే 24 కళలకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతాయి. సినిమా అధ్యయనం శిక్షణ పరిశోధన కోసం 'శ్యాం బెనగల్ సినిమా అకాడమీ' ఏర్పాటు చేయాలి. ఈ అకాడమీ ఆవరణలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఫిలిం ఫెస్టివల్ డైరెక్టరేట్, బాలల చలనచిత్రాల క్లబ్, ఫిలిం సొసైటీ కార్యాలయాల వేదిక, ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లు ఉండాలి. ఈ ఆవరణలో కూడా మూడు థియేటర్లు ఉండాలి. మరొకటి 'బిఎస్ఎన్ సినిమా రిక్రియేషన్ సెంటర్'. బిఎస్ఎన్ అంటే బిఎస్ నారాయణ తెలంగాణ సినిమా వైతాళికుడు. అలాగే 'కాంతారావు సెంటర్ ఫర్ సినిమా హ్యాబిటేషన్' ఏర్పాటు చేయాలి. ఇందులో చిత్ర పరిశ్రమ కార్మికులు, కుటుంబాల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలి. మరొకటి 'పిఆర్ చలనచిత్ర స్టూడియోస్' నిర్మిస్తే ఇది అత్యంత ఆధునిక స్టూడియో అవుతుంది. అప్పుడే తెలంగాణ సినిమాకు దేశవ్యాప్తంగా ఖండాంతరంగా గుర్తింపు గౌరవం లభిస్తాయి. పిఆర్ అంటే ప్రభాకర్ రెడ్డి. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి.

పురానిక్షిప్తశాఖ, గ్రంథాలయాలు, ప్రచురణలు, రాష్ట్రీయ బుక్ ట్రస్ట్, రాష్ట్ర ప్రచురణల విభాగం విడివిడిగా ఏర్పాటు చేయాలి. తెలంగాణ వైతాళిక చరిత్రను ప్రపంచానికి తెలియజేసేందుకు నాగోబా జాతర, బతుకమ్మ, హైదరాబాద్, రాజా దీనదయాల్, వట్టికోట ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, మఖ్దూం, గణేష్ నిమజ్జనం, కోటిలింగాల, ఫణిగిరి, నందికొండ... తదితర వారసత్వాలపై కాఫీ టేబుల్ బుక్ ప్రచురించాలి.

ఇందుకు సంబంధించిన బడ్జెట్, ఐదేళ్ల ప్రణాళికలు రూపొందించి దశలవారీగా కార్యకలాపాలను కొనసాగించవచ్చు. ఇందులో రాష్ట్ర బడ్జెట్‌లో ఒక శాతం మాత్రమే ఖర్చు అవుతుందని బి. నర్సింగరావు తన డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక విధానానికి సంబంధించి 22 పుటల్లో రూపొందించిన ఈ పత్రం భావి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



• అన్నవరం దేవేందర్
కవి, రచయిత

హిందూత్వకు 'ఫాసిజం' నప్పుతుందా?

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) 24వ మహాసభల తీర్మానం ముసాయిదాలో "కేంద్ర ప్రభుత్వం నయా ఫాసిస్టు స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నది" అని పేర్కొనడంతో, ఫాసిజం, నయా ఫాసిజం, నాజిజంల మీద మేధోరంగంలో కొత్త చర్చ మొదలైంది. నేరుగా 'ఫాసిస్టు' అనకుండా 'కొత్త ఫాసిస్టు స్వభావం' అనడంపై కాంగ్రెస్‌తో పాటు సీపీఐ సైతం సీపీఎంను తప్పుపడుతున్నాయి.

ఇతరులు ఛాందసం అనుకున్నా సరే భూస్వామ్య సమాజానికి తనకంటూ కొన్ని విలువలు వుంటాయి. పెట్టుబడీదారీ వ్యవస్థకు మాత్రం లాభాలే ముఖ్యం. అదే దాని సంస్కృతి, అదే దాని విలువ. లాభం వస్తుంది అనుకుంటే తమను ఉరివేసే తాళ్లను సైతం పెట్టుబడిదారులు అమ్మకానికి పెట్టగలరు. నిరంతరం ఉత్పత్తి పెరుగుతుండాలి, పెరిగిన ఉత్పత్తిని అమ్మడానికి నిరంతరం మార్కెట్ విస్తరిస్తుండాలి. విస్తరించిన మార్కెట్ డిమాండ్‌ను అందుకోవడానికి మళ్ళీ ఉత్పత్తిని పెంచుకుంటూ పోవాలి. ఎక్కడా ఆగడానికి వీల్లేదు. ఆగితే ఖేల్ ఖతం! గతంలో సెల్‌ఫోన్ల మార్కెట్‌ను ఏలిన నోకియా, బ్లాక్‌బెరీ, మోటరోలా బ్రాండ్లు ఇప్పుడు ఎక్కడా? పోంటియాక్ కార్లు ఎక్కడా? యాహూ సెర్చ్ ఇంజిన్ ఎక్కడా? కింగ్ ఫిషర్ ఏర్‌లైన్స్, కొడాక్ కెమెరాలు, సోనీ వాక్‌మెన్లు ఇప్పుడు వెతికినా కనిపించవు. పరుగు ఆపేస్తే మహామహ బ్రాండ్లు కూడా అలా అంతమైపోతాయి.

తమ ప్రాచుర్యం, బ్రాండ్ ఇమేజ్ పెరిగి మార్కెట్ విస్తరిస్తుందనుకుంటే పెట్టుబడిదారులు ఏ వేషమైనా వేయగలరు. ఒక దశలో అత్యంత ఆధునికులుగా, హేతువాదులుగా, మతరహితులుగా దర్శనమివ్వగలరు. జనాన్ని పెద్ద సంఖ్యలో కదిలించడానికి మతం పనికివస్తుంది అనుకుంటే ఇంకో దశలో వాళ్ళే సమాజంలో ఛాందసాన్ని, మూఢనమ్మకాలను పెంచిపోషించగలరు. ఇప్పుడు భారీ పెట్టుబడిదారులు (వీరినే మనం మెగా కార్పొరేట్లు అంటున్నాం) ఇదే చేస్తున్నారు. తమ లాభాల కోసం ప్రజల్లో మతతత్వాన్ని రెచ్చగొడుతున్నారు. వాళ్ళ ఓట్లను ఆకర్షించి తమ అనుకూలుర్ని ఎన్నికల్లో గెలిపించుకుని వారి ద్వారా తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. మన వర్తమాన వ్యవస్థను సాంకేతికంగా 'కార్పొరేట్ మతతత్వ నియంతృత్వం' అంటే గానీ తత్త్వం బోధపడదు (Corporate Communal Dictatorship – CCD).

ఇప్పటి కేంద్ర ప్రభుత్వం, దాని పాలనా తీరుని మెచ్చుకునేవారు ఉన్నట్లే నచ్చని వారూ వుంటారు. నచ్చనివారు దీన్ని ఫాసిస్ట్ అంటున్నారు. ఆ మాటను కాంగ్రెస్సూ అంటున్నది, కమ్యూనిస్టులూ అంటున్నారు. ఫాసిజం ఇటాలియన్ పదం. అది ముస్సోలినీ నియంతృత్వాన్ని విమర్శించడానికి ఇటలీ కమ్యూనిస్టులు పెట్టిన పేరు అని చాలామంది అనుకుంటారు. నిజం అదికాదు. ముస్సోలిని సగర్వంగా తనకుతానుగా పెట్టుకున్న పేరు అది. 'ఫాసియో' అంటే ఇటలీ భాషలో కట్టెల మోపు అని అర్థం. ఆ తరువాత జర్మనీలో హిట్లర్ నియంతగా మారాడు. తన పాలనకు నాజీ అని పేరు పెట్టాడు. నాజీ అంటే జర్మనీ భాషలో 'జాతీయ సోషలిజం' అని అర్థం. బీజేపీ కూడా తొలి రోజుల్లో జాతిపిత గాంధేయ సోషలిజం అనేది.

ఫాసిజం, నాజిజం రెండూ నియతృత్వ పాలనలే. అయినప్పటికీ రెండింటి మధ్య చాలా తేడాలున్నాయి. ఆరెస్సెస్ వ్యవస్థాపకులైన హెడ్గేవార్ మీద ముస్సోలినీ ప్రభావం ఉండింది. రెండవ సర్ సంఘ్ చాలక్ అయిన ఎంఎస్ గోల్వార్కర్ హిట్లర్‌ను ఎక్కువగా అభిమానించేవారు. స్వచ్ఛ జాతీయవాదాన్ని ప్రతిపాదిస్తూ 1939లో గోల్వార్కర్ రాసిన 'We, or Our Nationhood Defined' పుస్తకం 1935లో జర్మనీలో హిట్లర్ తెచ్చిన నూరెంబర్గ్ చట్టాల నుండి ప్రత్యక్షంగా ఉత్తేజాన్ని పొందినదే. ఇటలీ ఫాసిజంలో మైనారిటీ మత సమూహాలను అణచివేయాలనే అంశం లేదు; కనీసం మొదట్లో లేదు. హిట్లర్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులు పెట్టాడు, మన దేశంలో డిటెన్షన్ సెంటర్స్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటి ఇండియా ప్రభుత్వ స్వభావాన్ని అభివర్ణించడానికి ఫాసిజం కన్నా నాజిజమే దగ్గరగా ఉంటుంది.

ఫాసిజం, నాజిజం రెండూ నియతృత్వ పాలనలే. అయినప్పటికీ రెండింటి మధ్య చాలా తేడాలున్నాయి. ఆరెస్సెస్ వ్యవస్థాపకులైన హెడ్గేవార్ మీద ముస్సోలినీ ప్రభావం ఉండింది. రెండవ సర్ సంఘ్ చాలక్ అయిన గోల్వార్కర్ హిట్లర్‌ను ఎక్కువగా అభిమానించేవారు. స్వచ్ఛ జాతీయవాదాన్ని ప్రతిపాదిస్తూ 1939లో గోల్వార్కర్ రాసిన పుస్తకం 1935లో జర్మనీలో హిట్లర్ తెచ్చిన నూరెంబర్గ్ చట్టాల నుండి ఉత్తేజాన్ని పొందినదే. ఇటలీ ఫాసిజంలో మైనారిటీ మత సమూహాలను అణచివేయాలనే అంశం లేదు; కనీసం మొదట్లో లేదు.



ఇటలీలో ముస్సోలిని ఫాసిజం అన్నట్టు, జర్మనీలో హిట్లర్ నాజిజం అన్నట్టు, మన దేశంలో సంఘపరివారం 'హిందూత్వ' అనే పేరును ఇష్టంగా పెట్టుకుంది. చాలామందికి మతానికీ, మతతత్వానికీ తేడా తెలియనట్లే హిందుకూ హిందూత్వకూ తేడా తెలీదు. మతం అంటే దేవుని మీద విశ్వాసం. మతతత్వం అంటే ఇతర మతస్తుల మీద అసహనం. మతం వ్యక్తిగతం, మతతత్వం రాజకీయార్థిక వ్యవహారం.

అతివాద హిందూ ప్రతినిధి అయిన దామోదర్ సావర్కర్ ఇటలీ ఫాసిజం నుండి ఉత్తేజాన్ని పొంది 1922లో 'హిందూత్వ' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. హిందూత్వ అనగానే తమని నిందిస్తున్నారని సాధారణ హిందువులు అపోహపడితే తమ ఉనికికి ముప్పు వస్తుందని రాజకీయ పార్టీలు జంకుతుంటాయి. మెజారిటీ మతతత్వ నియంతృత్వాన్ని సంబోధించడానికి కొందరు 'కాషాయ', 'బ్రాహ్మణీయ' అనే పదాలను వాడుతున్నారు. బ్రాహ్మణులు, కాషాయాంబరధారులు అందర్నీ నియంతల జాబితాలో వేసేస్తే మేలుకన్నా కీడే ఎక్కువగా జరుగుతుంది.

ఇండియా కమ్యూనిస్టు పార్టీల్లో మొదటినుండీ ఒక ఇబ్బంది వుంది. మత వ్యవస్థలోనూ పీడితులు పీడకులు వుంటారని అవి గుర్తించలేదు. గుర్తిస్తే పీడితుల పక్షాన ఉంటామని ప్రకటించాల్సి ఉంటుంది. అలా ప్రకటిస్తే పీడక సమూహం తమను వదిలి వెళ్ళిపోతుందని వాళ్ళ భయం. మతవ్యవస్థలో పీడితుల పక్షం వహించలేవు; పీడకుల పక్షం వహిస్తామని చెప్పుకోలేవు. ఇలాంటి ఇరకాటం నుండి బయటపడడానికి మతంలో వర్గం లేదని చాలాకాలం బుకాయించాయి. మతం ఒక్కటే కాదు, కులం, తెగ, భాష, ప్రాంతం, వర్ణం, లింగం అన్నింటిలోనూ వర్గం వుంటుంది. వర్గం సర్వాంతర్యామి. ప్రతిదేశంలోనూ పాలక మతం ఉన్నట్టే పాలిత మతం కూడా ఉంటుంది.

నిజ జీవిత ఉత్పత్తి, పునరుత్పత్తులే చరిత్ర గమనాన్ని నిర్ణయించే అంశం అనేది మార్క్సిస్టుల అవగాహన. దీనినే పునాది అంటారు. దీనితో పాటు ఉపరితలం కూడ వుంటుంది. రెండూ విడిగా ఉండవు. పునాది ఉపరితలాల్లో ప్రధానమైంది నిస్సందేహంగా పునాదే. దాని అర్థం ఉపరితలానికి తావులేదని కాదు. రెండూ ఒక అన్యోన్య సంబంధంలో ఉంటూ, ఒకదాన్ని మరొకటి నిరంతరం ప్రభావితం చేస్తుంటాయి. సాంకేతిక భాషలో చెప్పాలంటే, పునాదీ ఉపరితలం నిరంతరం గతితార్కిక సంబంధంలో ఉంటాయి.

గడిచిన ఏడేళ్ళలో కేంద్ర ప్రభుత్వం మీద సీపీఎం అంచనా మారుతూ వచ్చింది. 2018 ఏప్రిల్ 18–22 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన సీపీఎం 22వ మహాసభల్లో "నిరంకుశ హిందూత్వ సాగిస్తున్న మతతత్వ దాడులు ముందుకు వస్తున్న ఫాసిస్టు ధోరణులను ప్రదర్శిస్తున్నాయి" అని తీర్మానించారు. 2022 ఏప్రిల్ 6–10 తేదీల్లో కన్నూర్‌లో జరిగిన 23వ మహాసభల్లో "మోదీ ప్రభుత్వం ఆరెస్సెస్ ఫాసిస్టిక్ ఎజెండాను అమలు చేస్తున్నది" అని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 26న మధురైలో జరుగనున్న 24వ మహాసభల ముసాయిదా తీర్మానంలో కేంద్ర ప్రభుత్వం మీద విమర్శ తీవ్రతను పెంచారు. "మితవాద హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకునిపోవడానికీ, ప్రతిపక్షాలనూ, ప్రజాస్వామ్యాన్నీ అణగదొక్కడానికీ అనుసరిస్తున్న నియంతృత్వ పద్ధతులు నయా ఫాసిస్టు స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. డొంకతిరుగుడు లేకుండా స్పష్టంగా 'ఫాసిస్టు' అనవచ్చుగా అని కాంగ్రెస్, సీపీఐ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

1970ల నాటి ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి ప్రతిపక్ష నాయకులందరూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని 'హిట్లర్' అని నేరుగా విమర్శించేవారు. జయప్రకాశ్ నారాయణ, అటల్‌బిహారీ వాజ్‌పాయి, జార్జ్ ఫెర్నాండెజ్, మురార్జీ దేశాయి, ఎల్‌కే అద్వానీ, నానీ పాల్కీవాల తదితరులు ఆమెను అలా విమర్శించినవారి జాబితాలో ఉన్నారు. ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నాటికన్నా మెరుగ్గా వుందా? ఘోరంగా వుందా? అనేది కీలక ప్రశ్న. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం. రాబోయే మహాసభల్లో సీపీఎం నాయకత్వం దానికి వివరంగా సమాధానం చెప్పవచ్చు.

■ డానీ
సామాజిక విశ్లేషకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





ముమ్మర సాధన

ఫుట్‌బాల్ ఆడుతున్న ఎస్‌ఆర్‌హెచ్ క్రికెటర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) క్రికెటర్లు బుధవారం చెమటోడ్చారు. గురువారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగే తమ రెండో మ్యాచ్‌కు కెప్టెన్ కమిన్స్ సహా జట్టంతా ముమ్మర సాధన చేసింది. తొలుత నెట్స్‌లో సాధన చేసిన ఎస్‌ఆర్‌హెచ్ క్రికెటర్లు ఆ తర్వాత ప్రధాన మైదానంలో ప్రాక్టీసు చేశారు. కొద్దిసేపు సరదాగా ఫుట్‌బాల్ కూడా ఆడారు.



మెట్రో రెండో దశలో
ముందడుగు
ఢిల్లీలో అధికారుల సమావేశం

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండోదశ ప్రాజెక్టులో ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వానికి పంపిన డీపీఆర్‌పై హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు అధికారులు ఢిల్లీలో సంబంధిత మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో బుధవారం తొలిసారిగా సమావేశయ్యారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 మెట్రో మార్గాల డీపీఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రెండో దశ డీపీఆర్ కేంద్ర ప్రభుత్వం వద్ద కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉంది. తాజాగా దానిపై చర్చించేందుకు రమ్మని పిలుపు రావడంతో అనుమతుల విషయంలో ముందడుగు పడిందనే అభిప్రాయాన్ని మెట్రో అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య అంచనాతో పాటు నిర్మాణానికి అయ్యే వ్యయంపై చర్చించినట్లు సమాచారం. మరిన్ని చర్చల అనంతరం రెండోదశ మెట్రోకు కేంద్రం పచ్చజెండా ఊపే అవకాశం ఉందని తెలిసింది.



సాయం సంధ్యా సమయం.. సూర్యుడు అస్తమిస్తున్న వేళ.. ఆకాశం రంగు మారిన వేళ.. ఆ ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూ పక్షులు కిలకిలా రావాలు చేసుకుంటూ ఆకాశంలో ఎగురుకుంటూ వచ్చాయి. ఆ సుందర మనోహర దృశ్యం ఫిల్మ్‌నగర్‌లో బుధవారం కనిపించి అందరినీ అలరించింది.

ఫొటో: ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఐటీ 'కార్'డార్!



- రోడ్లపై గణనీయంగా పెరుగుతున్న కార్లు
- తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- కార్ పూలింగ్‌తో కొంత ఉపశమనం
- రైడ్ షేరింగ్ సంస్థలతో చర్చలు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో కార్ల వినియోగం విపరీతంగా పెరుగుతోంది. కొత్తగా రోజుకు 1600 కార్లు రోడ్డెక్కుతుంటే, అందులో సగానికిపైగా ఈ ప్రాంతంలోనే ఉంటున్నాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రస్తుతం మహానగరంలో అత్యధికంగా వాహనాల రాకపోకలన్నీ ఐటీ కారిడార్ వైపే ఉన్నాయి. ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలతో పాటు పలు కార్పొరేట్ కంపెనీలు, రియల్ ఎస్టేట్, ఫార్మా, కార్పొరేట్ ఆస్పత్రులు, మాల్స్, మల్టీప్లెక్సులు, స్టార్ హోటళ్ల కార్యకలాపాలు సైబరాబాద్ పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయి. అత్యధిక మంది కార్లతో ఈ ప్రాంతానికి వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్‌ను కొన్ని నెలలుగా పర్యవేక్షించిన సైబరాబాద్ పోలీసులు కార్ పూలింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తే వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈమేరకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్)తో కలిసి

మిగతా 6వ పేజీలో..

ప్రత్యేక యాప్

ప్రస్తుతం ఐటీ కారిడార్ నుంచి సేవలను అందిస్తున్న రెండు ప్రముఖ కార్‌పూలింగ్ యాప్‌ల నిర్వాహకులతో సైబరాబాద్ పోలీసులు చర్చిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగా యాప్‌ను ప్రారంభించి, దాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సర్వర్‌కు అనుసంధానం చేయడంపై మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. కార్ పూలింగ్ యాప్ నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర రవాణా శాఖతో కలిసి చట్టపరమైన అంశాలను చర్చిస్తున్నారు. ఇతర దేశాల్లో అమలు చేస్తున్న కార్ పూలింగ్ విధానాలను సైతం అధ్యయనం చేసి, అక్కడ అమలు చేస్తున్న విధానాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది. త్వరలోనే కార్ పూలింగ్ యాప్‌ను తీసుకురావాలని సైబరాబాద్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



సంగీత సాహూ

గంజాయి లేడీ డాన్ సంగీత సాహూ అరెస్ట్

- కొంతకాలంగా అజ్ఞాతంలో
- ఒడిశాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గంజాయి స్మగ్లర్లతో లింకులు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న లేడీ గంజాయి డాన్ సంగీతా సాహూ ఆటకట్టించారు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు. ఒడిశాలో అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం కుర్ధా జిల్లా, కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీతా సాహూ నాలుగేళ్లుగా గంజాయి హోల్‌సేల్ వ్యాపారం చేస్తోంది. గంజాయి వినియోగం

మిగతా 6వ పేజీలో..

మహిళల బోగీల్లో
పోలీసు పహారా
ఎంఎంటీఎస్ రైళ్లలో భద్రతా చర్యలు

హైదరాబాద్ సిటీ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణికుల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే దృష్టి సారించింది. ఇటీవల మేడ్చల్ వెళుతున్న రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటనతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశాల మేరకు ఉదయం, రాత్రి వేళల్లో ఎంఎంటీఎస్ రైళ్లలోని ప్రతీ మహిళా బోగికి ఒకరిద్దరు ఆర్పీఎఫ్ లేదా జీఆర్‌పీఎఫ్ మహిళా పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 6.10గంటలకు లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు బయల్దేరిన ఎంఎంటీఎస్‌లో పోలీసు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.



బోగీలో పహారా కాస్తున్న మహిళా పోలీసు

ఇలా చేస్తే మేలంటున్న ప్రయాణికులు

కొవిడ్‌కు ముందు ఉన్న షెడ్యూల్ ప్రకారం సమయాలను పాటిస్తూ 121 సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో (ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9వరకు) గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే ఎంఎంటీఎస్ రైళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఆదాయం తగ్గుతోందని భావిస్తే, సహేతుకంగా చార్జీల పెంపుపై ఆలోచించవచ్చునని ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు సూచిస్తున్నారు. చాలా మంది ఉద్యోగులు, విద్యార్థులు వారాంతాల్లో కూడా ప్రయాణిస్తారు కనుక శని, ఆదివారాల్లోనూ రైళ్ల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు. సర్వీసుల పెంపు, సమయపాలన, భద్రత వంటి అంశాల్లో లోకల్ రైళ్లకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరుతున్నారు.

తనిఖీ అధికారులు ఏరి?

టికెట్లు లేకుండా ప్రయాణించే, ఆకతాయిలు, నిబంధనలకు విరుద్ధంగా మహిళల కోచ్‌లలోకి ప్రవేశించే వారిని అడ్డుకునేందుకు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. కానీ ఎంఎంటీఎస్ రైళ్లలో వారు కనిపించడం లేదు.



అమర్‌నాథ్ సింగ్



రణ్‌వీర్ సింగ్

ఎక్స్‌పోర్ట్ పేరుతో
మోసం
ఢిల్లీకి చెందిన సైబర్ నేరగాళ్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎక్స్‌పోర్ట్ పేరుతో నగరవాసిని మభ్యపెట్టి డబ్బులు కాజేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ ద్వారకా ప్రాంతానికి చెందిన అమర్‌నాథ్ సింగ్ (32), రణ్‌వీర్‌సింగ్(46) కలిసి ఢిల్లీలో ఎక్స్‌పోర్ట్ సంస్థను స్థాపించారు. సోషల్‌మీడియా ద్వారా పలువురు వ్యాపారులను సంప్రదించేవారు. ముందుగా ట్రేడింగ్, ఎక్స్‌పోర్ట్, కొత్త కస్టమర్లు, ఆర్డర్లు పెంచడం, వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశాలపై ప్రాథమిక శిక్షణ ఇస్తామని చెప్పేవారు. మీ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని మభ్యపెట్టేవారు. ఎక్స్‌పోర్ట్ వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో రిజిస్ట్రేషన్, జీఎస్టీ, రీఫండబుల్ అమౌంట్ అంటూ పలు దఫాలుగా అందినకాడికి దండుకునేవారు. ఇలా నగరానికి చెందిన వ్యాపారిని

మిగతా 6వ పేజీలో..

పానీ.. పరేషానీ!

- నగరంలో పెరుగుతున్న నీటి కొరత
- ఇదే అదునుగా ప్రైవేటు ట్యాంకర్ల దందా
- చెరువులు, కుంటల పక్కనే బోర్లు
- పెద్దఎత్తున నీళ్లు తోడి విక్రయం
- ఒక్కో ట్యాంకర్ ధర రూ.1500కు పైగానే
- 25వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ.5వేల పైనే
- నల్లా కనెక్షన్లు లేని వారికి అవే ఆధారం



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీటి కొరత రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి నేపథ్యంలో ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో బోర్లు పని చేయడం లేదు. దీంతో ట్యాంకర్ నీళ్లను కొనుగోలు చేయాల్సి వస్తోంది. వాటర్‌బోర్డు నీటి కనెక్షన్ లేనివారికి ప్రైవేటు ట్యాంకర్లే దిక్కు కావడంతో వాటికి డిమాండ్ భారీగా పెరిగింది. ఇదే అదునుగా నిర్వాహకులు దోచుకుంటున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెరువులు, కుంటల పక్కన బోర్లు వేసి మరీ ట్యాంకర్ల నిర్వాహకులు నీటిని తోడేస్తున్నారు. ఆ నీటినే హాస్టల్స్, హోటల్స్, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు విక్రయిస్తున్నారు. మాదాపూర్‌లోని సున్నంచెరువు, ముల్లకత్వాచెరువు, ఖాజాగూడలో భగీరథ చెరువు, ఖాజాగూడ పెద్దచెరువు, కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు, కాముని చెరువు, చందానగర్‌లో మదీనగూడ చెరువు ఇలా నగరంలోని పలు ప్రాంతాల్లో గల చెరువులు, కుంటల పక్కన గల ఖాళీ స్థలాలను లీజుకు తీసుకుంటున్నారు. బోర్లు వేసి నీటిని పెద్దఎత్తున తోడుతున్నారు.

ఒక్కో ట్యాంకర్ ధర రూ.1500కు పైగానే

వాటర్‌బోర్డు నగరంలోని సరఫరా చేస్తున్న 5వేల లీటర్ల నీటి ట్యాంకర్‌ను గృహ కనెక్షన్లకు రూ.500, వాణిజ్య కనెక్షన్లకు రూ.850 వసూలు చేస్తోంది. కానీ ప్రైవేటు ట్యాంకర్ల నిర్వాహకులు మాత్రం 5వేల లీటర్ల ట్యాంకర్‌ను రూ.1200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. పైగా సరఫరా చేసే నీరంతా చెరువులు, కుంటల పక్కన నుంచి బోర్ల ద్వారా తోడింది కావడంతో దుర్వాసన కూడా వస్తున్నట్లు తెలిసింది. టార్పాలిన్లు కట్టి నీళ్లు నిల్వ చేస్తుండడంతో పురుగులు సైతం చేరుతున్నాయి. ఆ నీటినే సరఫరా చేస్తున్నారు. హాస్టల్స్, హోటల్స్, వాణిజ్య సముదాయాలవారు నీరు ఎలా ఉన్నదో గాకుండా అవసరాలను తీర్చుకోవడానికి ఎలాంటి నీరైనా తీసుకుంటున్నారు. రాకపోకలకు ఇబ్బందులు లేనివారైతే 25వేల లీటర్ల నీటి ట్యాంకర్‌ను రూ.5వేలకు పైగా చెల్లించి మరీ కొనుగోళ్లు చేస్తున్నారు.

నియంత్రణ కరువు

నగరంలో వివిధ ప్రాంతాల్లో విచ్చలవిడిగా ప్రైవేటు నీటి ట్యాంకర్ల దందా సాగుతున్నా జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు అధికారులు నియంత్రించడం లేదు. చెరువులు, కుంటల వద్ద బోర్లు వేసి పెద్దఎత్తున సాగుతున్న నీటి దందాను కట్టడి చేయాల్సిన స్థానిక రెవెన్యూ అధికారులు కూడా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఏ సమయంలోనైనా అనుమతులు

నగరంలో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు భారీ వాహనాలకు

మిగతా 6వ పేజీలో..

రోజుకు రూ.5 వేలు ఖర్చు

మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో పలు భవనాలకు నీటి కనెక్షన్లు లేవు. వాటిలో ఎక్కువగా లివింగ్ రూమ్‌లు, హాస్టళ్లే ఉన్నాయి. ఇటీవల బోర్లు వట్టిపోవడంతో చుక్కనీరు రావడం లేదు. హాస్టళ్ల నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. దీంతో రోజూ రెండు నుంచి మూడు ప్రైవేటు ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. 5వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ.1500 వరకు వెచ్చిస్తున్నారు. నీళ్ల కోసమే రోజుకు కనీసం రూ.5వేలు ఖర్చవుతున్నాయని ఓ హాస్టల్ నిర్వాహకుడు వాపోయారు.



ఇప్పటి వరకు రూ.60 కోట్లే
ఫీజుల చెల్లింపునకు ముందుకు రాని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు

హైదరాబాద్ సిటీ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏలో ఎల్‌ఆర్‌ఎస్-2020కు సంబంధించి ఇప్పటి వరకు రూ.60కోట్లే ఫీజు వసూలైంది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని 1.95 లక్షల దరఖాస్తుదారులకు అధికారులు సమాచారం అందించగా, ఇప్పటి వరకు కేవలం 20వేల దరఖాస్తులకే ఫీజు చెల్లించారు. ఫీజు చెల్లించేందుకు ఇంకా నాలుగు రోజులే గడువు ఉంది. ఆలోపు ఏ మేరకు ఫీజు చెల్లింపులు ఉంటాయనే సందిగ్ధత నెలకొన్నది.

అప్పట్లో రూ. వెయ్యి కోట్లు

ఎల్‌ఆర్‌ఎస్ - 2015 తీసుకొచ్చిన సందర్భంలో 1.74 లక్షల దరఖాస్తుల్లో 99వేల దరఖాస్తులను పరిష్కరించారు. వాటి ద్వారా అప్పట్లో హెచ్ఎండీఏకు సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం వచ్చింది. అదే తరహాలో ఎల్‌ఆర్‌ఎస్-2020 ద్వారా హెచ్ఎండీఏకు వచ్చిన 3.44లక్షల దరఖాస్తులను పరిష్కారం చేస్తే సుమారు వెయ్యి కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేసుకున్నారు. అయితే రెండు నెలల క్రితం వరకు హెచ్ఎండీఏలో 3.44లక్షల దరఖాస్తుల్లో దాదాపు 50వేల దరఖాస్తులకు పరిష్కారం చేపట్టగా.. అందులో కొన్ని దరఖాస్తుల నుంచే ఫీజు వచ్చింది. కనీసం రూ.పది కోట్లు కూడా ఆదాయం రాలేదు. ఈ పరిస్థితుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రివర్స్ ఇంజనీరింగ్ పద్ధతి చేపట్టి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు ముందు చెల్లించుకొని.. ఆ తర్వాత ఫీజు చెల్లించిన దరఖాస్తులను పరిష్కారం చేసే ప్రక్రియను చేపట్టారు. అయినా 1.95 లక్షల దరఖాస్తులకు గాను, కేవలం 20వేల దరఖాస్తులకు మాత్రమే ఫీజు చెల్లింపులు జరిగాయి.

బ్రాండెడ్ పేరుతో
నకిలీ ఆయిల్

- సైబర్ క్రిమినల్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ పేరుతో ఆన్‌లైన్‌లో నకిలీ ఆయిల్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం పునర్నీవని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు రాబిట్ బ్లడ్ హెయిర్ ఆయిల్‌ను తయారు చేసి విక్రయిస్తున్నారు. కాగా, ఇండియా పీవీపై లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుశాంత్ సింగ్, ప్రతీక్‌కుమార్‌లతో కలిసి మధ్యప్రదేశ్‌కు చెందిన విశేష్ ఆహూజా పునర్నీవని ప్రై.లిమిటెడ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించారు. వారు తయారు చేసిన నకిలీ ఆయిల్‌ను రాబిట్ బ్లడ్ హెయిర్ ఆయిల్ బ్రాండ్‌తో ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు పోలీసులు సుశాంత్‌సింగ్, ప్రతీక్ కుమార్‌లను ఈనెల 4న అరెస్ట్ చేశారు. తాజాగా బుధవారం విశేష్ ఆహూజాను అరెస్ట్ చేశారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తదితరులు

సమాజ అవసరాలు తీర్చేలా
పరిశోధనలు జరగాలి: గవర్నర్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగం 'మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ సొసైటల్ అప్లికేషన్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు సాధారణ పౌరులకు, ముఖ్యంగా గిరిజనులకు అందాలని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యం, వైమానిక రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సును వేదికగా చేసుకుని అనేక పరిశోధనలపై చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ

మిగతా 8వ పేజీలో..

హెచ్‌సీయూ
భూమి వేలం సరికాదు

- ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేయవద్దు
- ప్రభుత్వం పంతానికి పోవద్దు
- వర్సిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలి
- ఆచార్య హరగోపాల్



6



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ

యూట్యూబ్‌లో శోధించి చోరీ

- ఏటీఎం దొంగల ముఠా ఆటకట్టు
- ఐదుగురు నిందితుల అరెస్ట్

8

నిమ్స్‌ను సందర్శించిన పాండిచ్చేరి జిప్మార్ బృందం



పాండిచ్చేరి జిప్మార్ ఆస్పత్రి నుంచి ప్రొఫెసర్ లత చతుర్వేదుల (ఆఫీసర్ ఇన్‌చార్జి డైటిక్స్) బృందం పంజాగుట్టలోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ను బుధవారం సందర్శించారు. నిమ్స్ డైటిక్స్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించి వంటశాల, స్టోర్స్‌ను పరిశీలించి, ఆరోగ్య శ్రీ ద్వారా రోగులకు అందుతున్న భోజన సదుపాయాల గురించి నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్, డీన్ ప్రొ.లీజా రాజశేఖర్‌ని, డైటిషన్ శాలిని అడిగి తెలుసుకున్నారు. నిమ్స్‌లో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)

● మేయర్‌తో..



అమెరికాలోని ఇండియానా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఇండియానాతో 2010లో జీహెచ్‌ఎంసీ సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకోగా గతంలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు ప్రతినిధులు గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలను మేయర్ వారికి వివరించారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)

హెచ్‌సీయూ భూమి వేలం సరికాదు

● ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య హరగోపాల్

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ ప్రమేయంతో 50 ఏళ్ల కిందట హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి ఇచ్చిన భూమిని రేవంత్‌రెడ్డి సర్కారు తిరిగి తీసుకుంటామనడం భావ్యం కాదని ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ అన్నారు. రిజిస్ట్రేషన్ లేనంత మాత్రాన ఆ 400 ఎకరాలు వర్సిటీ భూమి కాదని అనడం అన్యాయమని ఆక్షేపించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాలు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది కలిసి బుధవారం 'హెచ్‌సీయూ భూమిని కాపాడుకుందాం' అనే నినాదంతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఆచార్య హరగోపాల్ హాజరై మాట్లాడారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, అక్కడి చెరువులు, వాటి మీద ఆధారపడిన జీవరాసులు నశిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఐఎంజీ స్పోర్ట్స్ అకాడమీ లిమిటెడ్‌కు 2003లో ఇదే 400 ఎకరాల భూమిని నాటి ప్రభుత్వం కేటాయించింది. తర్వాత వచ్చిన ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేయడంతో సదరు సంస్థ కోర్టుకెళ్లింది. ఆ నేపథ్యంలో అది ముమ్మాటికీ ప్రభుత్వ భూమి అని గతేడాది మేలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దాంతో తెలంగాణ సర్కారు వేలానికి సిద్ధమైంది' అని హరగోపాల్ వివరించారు. ఇన్నాళ్లు ఆ భూమిని కాపాడిన వర్సిటీకే 400 ఎకరాలు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడే ఊపిరితిత్తుగా ఆ స్థలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం పంతానికి పోవడం తగదని హితవుపలికారు. దీన్ని ప్రతిపక్షాలు సైతం రాజకీయం చేయొద్దని ఆయన విన్నవించారు. బోధనా సిబ్బంది సంఘం అధ్యక్షుడు ఆచార్య భంగ్యా భూక్యా మాట్లాడుతూ... కేవలం 400 ఎకరాలే కాదు వర్సిటీ ఉన్న మిగతా ప్రదేశమంతా ప్రభుత్వానిదే, అలా అని వేలానికి పెడతారా అంటూ నిలదీశారు. హెచ్‌సీయూ భూమిని కాపాడుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ఉమేష్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షుడు ఆకాష్, తెలుగు శాఖ విభాగాధిపతి ఆచార్య పిల్లలమర్రి రాములు తదితరులు స్పష్టం చేశారు.

ఎక్స్‌పోర్ట్ పేరుతో మోసం

(5వ పేజీ తరువాయి)

మోసం చేసిన వీరిద్దరూ రూ. 9.50 లక్షలు కాజేశారు. వీరిపై దేశ వ్యాప్తంగా 17 కేసులు, తెలంగాణలో ఒక కేసు మొత్తం 18 కేసులు నమోదయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబర్ క్రైం సిబ్బంది సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. డీసీపీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు బృందం ఢిల్లీ వెళ్లి అమర్‌నాథ్ సింగ్, రణ్‌వీర్ సింగ్‌లను అరెస్ట్ చేసింది. పోలీసులు వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, కంపెనీ దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు.

పానీ.. పరేషానీ!

(5వ పేజీ తరువాయి)

అనుమతి లేదు. అత్యవసర విభాగం కింద ట్యాంకర్లకు ట్రాఫిక్ పోలీసులు అనుమతించారు. నీరు, పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లకు ఏ సమయంలోనైనా నగరంలోకి అనుమతి ఉన్నది. దీంతో కొందరు ప్రైవేటు ట్యాంకర్ల డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తాగి మరీ రోడ్లు ఎక్కుతున్నారు. రెండు రోజుల క్రితం పంజాగుట్టలో ఓ నీటి ట్యాంకర్ డ్రైవర్‌ను ఆపి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 300లకు పైగా పాయింట్లు రావడంతో ట్రాఫిక్ పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు.

కొడాలి నానికి స్వల్ప అస్వస్థత

● ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుడివాడ వైఎస్‌ఆర్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆయనను నగరంలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. హృదయ సంబంధిత సమస్యతో ఆస్పత్రిలో చేరిన ఆయనకు వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఏఐజీ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా కొడాలి నాని గ్యాస్ట్రిక్ సమస్యతో ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారని.. ఆయన క్షేమంగానే ఉన్నారని, మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని ఎక్స్ (ట్విట్టర్)లో నాని అనుచరులు పోస్ట్ చేశారు.

గంజాయి లేడీ డాన్ సంగీత సాహూ అరెస్ట్

(5వ పేజీ తరువాయి)

ఎక్కడ ఎక్కువగా ఉంటే, అక్కడి వ్యాపారులతో పరిచయం పెంచుకునేది. వారికి గంజాయిని సరఫరా చేసేది. అనతికాలంలోనే సంగీత సాహూ గంజాయి డాన్‌గా ఎదిగింది. ఖాళీ సమయంలో హీరోయిన్‌లా ఫోజులు కొడుతూ ఇన్‌స్టా రీల్స్ చేసి, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేది.

ధూల్‌పేట స్మగ్లర్స్‌తో లింకులు

నగరంలోని ధూల్‌పేటకు చెందిన గంజాయి స్మగ్లర్లు సంగీత సాహూ నుంచే సరుకును తెప్పించుకునేవారు. చదువుకునే యువతిలా నటిస్తూ బ్యాగుల్లో, లేదా ఇతర రహస్య మార్గాల ద్వారా గంజాయిని నగరానికి తెచ్చి సరఫరా చేసేది. ఆమెకు ధూల్‌పేట లేడీ గంజాయి డాన్‌లుగా పేరున్న షీలాబాయ్, నేహాబాయ్, ఇషికాసింగ్‌లతో పరిచయం ఏర్పడింది. ఇటీవల 29 కేజీలు, 11.3 కేజీల గంజాయితో పట్టుబడిన స్మగ్లర్స్‌కు సంగీత సాహూ సరుకు సరఫరా చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2022లో రైల్వే పోలీసులకు చిక్కిన సంగీత ఒకసారి జైలుకు వెళ్లి వచ్చినట్లు గుర్తించారు.

అరెస్ట్ చేశారిలా..

తెలంగాణలో మొత్తం నాలుగు కేసులు నమోదైనట్లు తెలుసుకున్న సంగీత సాహూ కొంతకాలంగా అజ్ఞాతంలోకి వెళ్లింది. ఎలాగైనా ఆమెను పట్టుకోవాలని నిర్ణయించుకున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రత్యేక ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో నిందితురాలికి సంబంధించిన వివరాలు, టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించారు. సుమారు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించి ఒడిశాకు వెళ్లారు. మంగళవారం నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత నగరానికి తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి లేడీ గంజాయి డాన్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్ ఎస్‌ఐ సైదులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుళ్లు మహేష్, అరుణ్, మంగను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

సీనియర్ జర్నలిస్టు శాంతారామ్ కన్నుమూత

● పాత్రికేయుడిగా నలభై ఏళ్లకు పైగా సేవలు

● ముగిసిన అంత్యక్రియలు



శాంతారామ్(ఫైల్)

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు బి.శాంతారామ్(64) ఇకలేరు. కొన్నాళ్లుగా శ్వాసకోస సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శాంతారామ్ స్వస్థలం మచిలీపట్నం. ఆయన 1983లో పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. పలు తెలుగు దిన, వార పత్రికలు, వెబ్‌సైట్‌లలో పని చేశారు. కొన్ని కథానికలు కూడా రాశారు. శాంతారామ్ మృతికి పలువురు సీనియర్ పాత్రికేయులు, కవులు, రచయితలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం ప్రకటించారు. శాంతారామ్ అంత్యక్రియలు బుధవారం కూకట్‌పల్లి శ్మశాన వాటికలో ముగిశాయి.

భవిష్యత్ సమాజ నిర్మాణంలో 'ఏఐ' పాత్ర కీలకం

● ఎలక్ట్రానిక్స్ నిపుణుడు భరత్ నీడికొండ

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి టెక్నాలజీలు భవిష్యత్ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించనున్నాయని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రంగ నిపుణుడు భరత్ నీడికొండ అన్నారు. జేఎన్‌టీయూలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విత్ మెషీన్ లెర్నింగ్'పై ఈసీఈ విభాగం- స్వేచ్ఛ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సమాజంలో ఎంతోకాలంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారాలను వెతికేలా ఆలోచనలు చేయాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి రజిని, స్వేచ్ఛ సంస్థ ప్రతినిధులు, ప్రతాప్‌రెడ్డి, ఖాజా మహ్మద్, శ్రీనివాస్, వర్క్‌షాప్ నిర్వహణ కమిటీ సభ్యులు అర్జున్, అనీష్, ప్రసన్న, గాయత్రీ, అరవింద్, విజ్ఞత, సాహితీ, హీరవర్ధన్, వేద శ్రీ, సాయికుమార్, వర్ష, షర్మిల వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీ 'కార్'డార్!

(5వ పేజీ తరువాయి)

రైడ్ షేరింగ్ సొల్యూషన్స్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్రశేణి కార్‌పూలింగ్ ప్లాట్‌ఫామ్‌లుగా ఉన్న ఎస్ రైడ్, క్విక్ రైడ్ సంస్థలతో సంప్రదిస్తున్నారు.

మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ లేక..

నిత్యం లక్షలాదిమంది ఉద్యోగులు ఐటీ కారిడార్ వైపు రాకపోకలు సాగిస్తున్నా, ఆ స్థాయిలో ప్రజారవాణా వ్యవస్థ అందుబాటులో లేదు. మెట్రోరైలు సౌకర్యం ఉన్నా అది రాయదుర్గం వరకే పరిమితమైంది. ఐటీ కంపెనీలు మాత్రం మాదాపూర్, రాయదుర్గం నుంచి గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ మీదుగా కోకాపేట వరకు విస్తరించి ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు, మెట్రోరైలు, ఎంఎంటీఎస్ వంటి ప్రజా రవాణా సాధనాలు లేకపోవడంతో మెజారిటీ ఉద్యోగులు సొంత వాహనాల్లోనే కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నారు. ఫలితంగా లక్షలాది వాహనాలు ఐటీ కారిడార్‌కు వస్తున్న నేపథ్యంలోనే ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తుతున్నట్లు ట్రాఫిక్ పోలీసుల అధ్యయనంలో తేలింది. ప్రైవేటు వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో రోడ్లన్నీ వాహనాలతోనే నిండిఉంటున్నాయి. ఇందులో 30శాతం మేర ప్రైవేటు వాహనాలను తగ్గించడమే లక్ష్యంగా సైబరాబాద్ నుంచి కార్ పూలింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీతో పాటు షేర్ రైడింగ్ సంస్థలతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. దీని వల్ల రోడ్లపై దాదాపు 3లక్షల వాహనాలు తగ్గుతాయని, రోజూ 750 టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గే అవకాశం ఉంటుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.


కొత్తగా రోజుకు 1,600 కార్లు

మహానగర ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో మార్చి 16న ప్రత్యేకంగా మాట్లాడారు. రోడ్లపై పెరుగుతున్న కార్లను, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి పరిష్కారాలను ప్రస్తావించారు. అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానంగా నగర రోడ్లపై రోజూ కొత్తగా 1,600 కార్లు అదనంగా చేరుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్‌పూలింగ్ విధానంతో ఎంతో మేలు చేస్తుందని వెల్లడించారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు, స్నేహితులు, సహోద్యోగులు తాము పనిచేసే చోటుకు వేర్వేరు కార్లలోనే వెళ్లి వస్తుంటారు. ఇది రోడ్లపై ట్రాఫిక్ రద్దీని పెంచుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో కార్‌పూలింగ్ పట్ల అవగాహన పెంచి, ప్రతీ కారులో నలుగురు నుంచి ఐదుగురు వెళ్లేలా చేయాల్సిన అవసరం ఉంది. దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే సైబరాబాద్ పరిధి నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు కార్ పూలింగ్ విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.











శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట నాయకులు చెరుకు అమరేందర్, చెరుకు మాధవి ఉన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తిరుమలలో అనుమతిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

ఇంటర్నెట్ సాయంతో పాడి రైతులకు సూచనలు

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్‌ను ఉపయోగించి పాడి రైతులకు సూచనలు, సలహాలు అందజేయాలని నిర్ణయం తీసుకున్నామని పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు. పాడి పశువుల పెంపకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడంపై భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రూపొందించిన ఆవిష్కరణలపై బుధవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో జరిగిన ఒక రోజు సదస్సులో పలువురు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఉదయ్‌కుమార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ సీహెచ్ హరికృష్ణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శోభాయాత్ర రూట్ పరిశీలన

గోషామహల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి నేపథ్యంలో నిర్వహించే శోభాయాత్ర ప్రధాన ఊరేగింపు సాగే మార్గాన్ని బుధవారం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి పరిశీలించారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారిలతో కలిసి శోభాయాత్ర సాగే బేగంబజార్‌ఛత్రి, స్వస్తిక్ మిర్చి చౌరస్తా, అంబర్‌బజార్, కోఠి, పుత్లిబౌలి, కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా, హనుమాన్ వ్యాయామశాల తదితర రూట్లను వారు పరిశీలించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. యాత్ర సాగే రూట్‌లో బారికేడ్లను ఏర్పాటు చేసి యాత్ర సాఫీగా సాగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని డీసీపీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తానని నమ్మించి మోసం

బంజారాహిల్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్స్ బల్క్‌లో సరఫరా చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యాపారి వద్ద రూ.44 వేలు తీసుకుని మోసం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14కు చెందిన మిద్దెల ఆలనారెడ్డి జీహెచ్ఎంసీ క్రీడా ప్రాంగణాల్లో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో కేపీహెచ్‌బీ క్రీడాస్థలంలో కూల్ డ్రింక్స్ సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూటర్ల కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. ఓ వ్యక్తి కరాఫా ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడిగా పరిచయం చేసుకొని తాను కోక్ డీలర్‌నని చెప్పాడు. సరుకు, ఫ్రిడ్జ్ సరఫరా చేస్తానని నమ్మించి పలు దఫాలుగా రూ.44,052 వసూలు చేసి ఆ తర్వాత ఫోన్‌కు స్పందించడం మానేశాడు. మోసపోయినట్లు గ్రహించిన ఆలనారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో వసతి పేరుతో..

తిరుమలలో వసతి కల్పిస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు వ్యక్తిని మోసం చేశారు. కమలాపురి కాలనీలోని సాయి నిలయంలో నివసించే చిరుమామిళ్ల ప్రసాదరావు తిరుమల వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో వసతి కోసం వెతికాడు. అమన్ పరస్ అనే వ్యక్తి వసతి కల్పిస్తానని నమ్మించి రూ.10వేలు యూపీఐ పేమెంట్ ద్వారా తీసుకున్నాడు. అనంతరం ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. మోసపోయినట్లు గ్రహించిన ప్రసాదరావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాడని దాడి

- కేసు నమోదు

మదీన, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విబేదాలు సృష్టిస్తున్నాడనే కోపంతో మహిళ ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మహిళపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ కొల్లూరుకు చెందిన సంధ్య(20) చాలా రోజుల క్రితం నగరానికి వచ్చింది. బహదూర్‌పురా చౌరస్తాలోని ఫుట్‌పాత్ గుడిసెల్లో నివసిస్తూ బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. పాతబస్తీకి చెందిన హనీఫ్‌తో సహజీవనం చేస్తుంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. అయితే, ఆసిఫ్ అనే వ్యక్తి తన భర్తకు వేరే మహిళతో పరిచయం చేయించడంతో చనువుగా ఉంటున్నాడని సంధ్య భావించింది. మంగళవారం అర్ధరాత్రి పదునైన ఆయుధంతో ఆసిఫ్ మెడపై కొట్టింది. సమాచారమందుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ ఆసిఫ్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం తప్పినట్లు పోలీసులు తెలిపారు. సంధ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో నిందితులు

చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు అరెస్ట్

అఫ్జల్‌గంజ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల మెడ నుంచి చైన్‌లు లాక్కెళ్తున్న నలుగురిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మధుకుమార్, డీఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్జల్‌సాగర్ బస్తీకి చెందిన కాంబే శ్రీను, మహబూబ్, శ్రీనివాస్, వికాస్ ఒక ముఠాగా ఏర్పడి రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులను ఎంచుకుని ప్రయాణికుల మెడ నుంచి బంగారు గొలుసులను తస్కరించి తప్పించుకుని తిరుగుతున్నారు. బుధవారం గౌలిగూడ సీబీఎస్ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు చేస్తున్నట్లు అంగీకరించారు. గతంలో అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఏడు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం : పొన్నం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కూనంనేని, వెంకటేష్ తదితరులు

హిమాయత్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు బి.వెంకటేశం, వీఎస్ బోస్ తదితరుల మంత్రి పొన్నంను బుధవారం కలిశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. గత నెలలో జరిగిన సమావేశంలో ఏప్రిల్‌లో ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి ఇచ్చిన హామీని వారు గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ తండ్రి కబ్జా భూములపై హైకోర్టు తీర్పును అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖవి అబ్బాసీ

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్ తండ్రి జావెద్ అలీఖాన్ కబ్జా భూములపై హైకోర్టు తీర్పును అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ డిమాండ్ చేశారు. ఆ భూములను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకుని వక్ఫ్, ఎఫ్‌టీఎల్‌కు అప్పగించాలన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అబ్బాసీ లా ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జావెద్ అలీఖాన్ 1996లో రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ వద్ద వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన మూడెకరాల భూమిని, ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన మూడెకరాల పది గుంటల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఈ భూముల కబ్జాపై 2022లో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వక్ఫ్‌బోర్డు జాయింట్ విచారణ జరిపి ఈ భూములను కబ్జా చేశారని తేల్చిచెప్పిందని గుర్తు చేశారు. దీనిపై ఈనెల 25న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పేర్కొందని తెలిపారు. సమావేశంలో ఇంక్విలాబ్ పార్టీ నేత సమీల్లఅజార్, హైకోర్టు న్యాయవాదులు జునేద్ బాసిక్, రిజ్వాన్ హష్మీ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఎలక్ట్రికల్ వాహనాలు పంపిణీ



అక్షయ ఫౌండేషన్‌కు వాహనాలను అందజేస్తున్న సుమ కనకాల

నార్సింగ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిడ్ డే మీల్స్ పంపిణీ కార్యక్రమాల నిర్వహణ కోసం అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాఘ్‌బక్రీ ఫౌండేషన్ వారు ఎలక్ట్రిక్ వాహనాలను బుధవారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు టెలివిజన్ ప్రముఖురాలు, బ్రాండ్ అంబాసిడర్ సుమ కనకాల, వాఘ్‌బక్రీ టీ గ్రూప్ సీఈవో సంజయ్‌సింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్ శిండే, దక్షిణ విభాగ అధిపతి పీవీ సురేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస్ మాట్లాడుతూ వాఘ్ బక్రీ ఫౌండేషన్ తమకు అందిస్తున్న నిరంతర మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు. కొత్త వాహనాల ద్వారా తమ సేవలను మరింత సమర్థంగా విస్తరిస్తామని అన్నారు. అనంతరం వాఘ్ బక్రీ టీ గ్రూప్ సీఈవో సంజయ్ సింగ్ మాట్లాడుతూ అక్షయ పాత్ర ఫౌండేషన్ వారి భాగస్వామ్యంతో వేలాది మంది విద్యార్థులకు మద్దతు అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ సామాజిక విధ్యతా విభాగం అధిపతి అజయ్ సిసిలియా, అక్షయ పాత్ర ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ యాగ్నేశ్వర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న సత్యం, వెంకటేష్, రామకృష్ణ, అంజి తదితరులు

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఈనెల 18న అసెంబ్లీలో తీర్మానం చేశారని, ఆ రోజు నుంచే రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేసి జీవోను జారీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు అఖిలపక్ష మద్దతు కూడగట్టేందుకు ఎంపీ ఆర్.కృష్ణయ్య సారథ్యంలో ఏప్రిల్ చివరి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, అంజి, భాగ్యలక్ష్మి, జి.అనంతయ్య, జె.నరేందర్, రఘుపతి, వెంకటేష్, నాగేంద్రబాబు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ప్రభుత్వ భూములను విక్రయించాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంకుడు గుంత నిర్మాణానికి

అవగాహన ఒప్పందం



బోర్‌వెల్ వద్ద కళాశాల అధ్యాపకులు, వాసన్ గ్రూప్ ప్రతినిధులు

మదీన, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వాసన్(వాటర్‌షెడ్ సపోర్ట్ సీవీనెస్ అండ్ యాక్టివిటీ నెట్‌వర్క్ గ్రూప్) సంయుక్తంగా ఇంకుడు గుంత నిర్మాణానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా వాసన్ గ్రూప్ కళాశాల ప్రాంగణంలో ఇంజెక్షన్ బోర్‌వెల్ నిర్మాణానికి సరైన స్థలాలను గుర్తించి బోర్‌వెల్ వేశారు. అంతేగాకుండా వాసన్ గ్రూప్ తరఫున కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్‌కు ఐదు కుట్టుమిషన్లను విరాళంగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ్యచిన్నమ్మ కుట్టుమిషన్లను ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

సరస్వతీదేవి పుష్కరాలలో నిత్యాన్నదానం



ఒప్పంద పత్రం రాసుకున్న రాధాకృష్ణ, రాకేశ్, అనిల్ నాయర్ తదితరులు

అఫ్జల్‌గంజ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ (చారధామం) ఆలయం ప్రాంగణంలో సరస్వతీదేవి పుష్కరాల సందర్భంగా మే 15 నుంచి 26వ తేదీ వరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేశ్, కోశాధికారి సీఏ అనిల్ నాయర్ తెలిపారు. బుధవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ సంస్థ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమంపై శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్, భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితిలు ఒప్పందం చేసుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమం గురించి భక్తులు బాస్ వెబ్‌సైట్‌లో సంప్రదించి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడు యాద అశోక్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి పి.మల్లికార్జునరావు, కోశాధికారి జె.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



సెపక్ తక్రా క్రీడాకారులతో ఫెడరేషన్ ప్రతినిధులు

సెపక్‌తక్రా వరల్డ్‌కప్‌లో ఇండియా విజయం

గోషామహల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సెపక్ తక్రా వరల్డ్‌కప్ 2025లో ఇండియా విజయం సాధించడంతో తమ 27 ఏళ్ల కల సాకారం అయ్యిందని సెపక్ తక్రా ఫెడరేషన్ ఆల్ ఇండియా సెక్రెటరీ పెరిక సురేశ్ అన్నారు. బుధవారం సెపక్ తక్రా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సెపక్‌తక్రా వరల్డ్ కప్‌లో పురుషుల్లో విన్నర్‌గా, మహిళల జట్టు రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి బృహత్తర విజయాలు నమోదు చేసిందని తెలిపారు. 2017లో గచ్చిబౌలి స్టేడియంలో సెపక్ తక్రా వరల్డ్ కప్ పోటీలు నిర్వహించామని తెలిపారు. కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో సెపక్ తక్రా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేడు సెపక్ తక్రా వరల్డ్ కప్ గెలవడం ద్వారా దేశం నలుమూలల సెపక్ తక్రా క్రీడకు ప్రాచుర్యం లభిస్తుందని సురేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



హ్యాట్రిక్ విజయం సాధించిన అమెరికా జట్టు

పృథ్వీశ్వర్ శతకం

- టీడీసీఏ అండర్-17 వన్డే ట్రోఫీ

హైదరాబాద్: తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) వన్డే ట్రోఫీలో పాంథర్స్ బ్యాటర్ ఆర్.పృథ్వీశ్వర్ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో అదరగొట్టాడు. తొలుత బ్యాట్‌తో 76 బంతుల్లో 104 పరుగులు చేసి శతకం సాధించిన పృథ్వీ తర్వాత మూడు వికెట్లు (3/30) తీసి సత్తా చాటాడు. బుధవారం తెలంగాణ రూరల్ రైజర్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాంథర్స్ మొదటి బ్యాటింగ్ చేసింది. సెంచరీ హీరో పృథ్వీశ్వర్‌తో పాటు అభినవ్ (65), మణీశ్వర్ (58) అర్ధ శతకాలతో రాణించారు. మొత్తంగా పాంథర్స్ 45.1 ఓవర్లలో 296కు ఆలౌటైంది. ఛేదనలో రైజర్స్ జట్టు 36.5 ఓవర్లలో 172కు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో వారియర్స్‌పై అమెరికా యూత్ టీమ్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన వారియర్స్ 36.1 ఓవర్లలో 105కు ఆలౌటైంది. అమెరికా జట్టు 16 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసి గెలిచింది.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ypi45Lbలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రమాదకరంగా

నాలా పై కప్పు



ఉప్పుగూడ రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షపు నీరు వెళ్లేందుకు ఇరువైపులా నిర్మించిన నాలా పైకప్పు నోరు తెరుచుకుని ప్రమాదకరంగా మారింది. నాలాపై ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలు ఎక్కడికక్కడ పాడైపోయాయి. గౌలిపురా నుంచి ఉప్పుగూడకు వెళ్లే పాదచారులు ఈ పైకప్పు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిపూట అంధకారం ఉంటుండడంతో నాలాలో పడిపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పైకప్పు దిమ్మెలు ఏర్పాటు చేయాలని పాదచారులు కోరుతున్నారు.

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



పాతబస్తీ భయ్యాలాల్ నగర్, కాళికానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రెషర్ కుక్కర్‌లను అందజేసిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్ తదితరులు

\- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పుష్పలీల

ప్రతీ నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వర్షం నీరు భూమిలో ఇంకేటట్లు ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పుష్పగిరి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు పుష్పలీల అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణం, నీటి సంరక్షణ, నీటిపొదుపు గురించి అవగాహన కలిగి ఉండడం మంచిదన్నారు. ఇది జాతి ప్రజలకు, దేశ అభివృద్ధికి అవసరం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగారెడ్డి, రోజారాణి, పద్మావతి, సురేశ్, కమలమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

సిక్కుల వివాహ చట్టాన్ని అమలు చేయాలి

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిక్కు వివాహ చట్టం (ఆనంద్ కరాజ్)ను అమలు చేయాలని రాజేంద్రనగర్‌లోని సిక్కుల నాయకుడు ఎస్.హర్పాల్‌సింగ్ రంజన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంపై తెలంగాణ హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సిక్కు వివాహ చట్టం సిక్కులకు ఎంతో ఉపయోగమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని కోర్టులో వాదించిన సర్దార్ జస్బీర్ సింగ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మల్లాపూర్ చౌరస్తాలో జరిగిన ఇఫ్తార్ విందులో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తదితరులు

- పహాడిషరీఫ్, ఆంధ్రజ్యోతి



భవాణిని సత్కరిస్తున్న అతిథులు

ఘనంగా అభినందన భవాణి

సాంస్కృతిక జీవిత మహోత్సవం

రవీంద్రభారతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవా రంగంలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అభినందన భవాణి సేవలు అనిర్వచనీయమని వక్తలు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో సంగమం సంస్థ అధ్యక్షుడు సంజయ్ కిషోర్ ఆధ్వర్యంలో తెలుగు నేలపై సాంస్కృతిక సంస్థను నెలకొల్పిన తొలి మహిళామూర్తి ప్రముఖ సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు అభినందన భవాణి నాలుగు దశాబ్దాల సాంస్కృతిక జీవిత మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంజు భార్గవి, శోభారాజు, రోజారమణి, రేలంగి నరసింహారావు, నన్నపనేని రాజకుమారి, వంశీరామరాజు తదితరులు హాజరై అభినందన ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక రంగంలో అభినందన సంస్థను ఏర్పాటు చేసి ఎంతోమంది కళాకారులకు వేదిక కల్పించిన ఘనత ఆమెదని కొనియాడారు. సంగమం సంస్థ విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టడంలో ముందుటుందని అభినందించారు. కళలు, కళాకారులు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కళాపోషణలో ఉన్న వారిని సత్కరించుకునే సభ ఏర్పాటు చేయడం సంజయ్ కిషోర్ గొప్పతనమని వక్తలు అన్నారు. సభకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

యూట్యూబ్‌లో శోధించి చోరీ

● ఏటీఎం దొంగల ముఠా ఆటకట్టు
● ఐదుగురు నిందితుల అరెస్ట్
● రూ. 4 లక్షలు, కారు, గ్యాస్ కట్టర్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పోలీసులు అరెస్ట్ చేసిన దొంగలు(ముసుగు వేసుకున్నవారు)

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి, రూ. 29 లక్షలు కొల్లగొట్టి పారిపోయిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఐదుగురు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4 లక్షలు, కారు, గ్యాస్ కట్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు.

ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రావిర్యాలలో ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తుతెలియని దుండగులు గ్యాస్ కట్టర్లతో కట్‌చేసి, రూ. 29లక్షలు దోపిడీ చేశారు. అదేరోజు రాత్రి మైలార్‌దేవ్‌పల్లిలో మరో ఎస్‌బీఐ ఏటీఎంను కొల్లగొట్టేందుకు గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రావడంతో పారిపోయారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఏటీఎం ముందు, క్యాబిన్‌లో ఉన్న సీసీటీవీ కెమెరాలకు నల్లని స్ప్రే కొట్టి, అలారం వైర్ కట్ చేసి, గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను మూడు నిమిషాల్లో కట్ చేసి డబ్బు దోచుకుని పారిపోయినట్లు గుర్తించారు. పోలీసులు సుమారు 100 కిలోమీటర్లు, 500 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి వాటి ఆధారంగా రాజస్థాన్, హరియాణా ప్రాంతాలకు చెందిన దొంగలుగా నిర్ధారించుకున్నారు. అక్కడి జిల్లాల పోలీస్ అధికారులతో కో-ఆర్డినేట్ చేసిన పోలీసులు ఈ తరహా దొంగల ముఠాలపై ఆరా తీయగా నిందితుల ఆచూకీ లభించింది. 3 ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితుల కోసం గాలించారు. ముఠాలోని 10 మంది నిందితుల్లో రాహుల్‌ఖాన్, ముస్తకీమ్‌ఖాన్, వహీంఖాన్, షకీల్‌ఖాన్, మహ్మద్ సర్ఫరాజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడిని విశాఖపట్నం పోలీసులు అరెస్టు చేశారు.

విమానంలో వచ్చి..

దొంగల ముఠాలో ప్రధాన నిందితులు రాహుల్ ఖాన్, ముస్తకీమ్ ఖాన్ రాజస్థాన్ నుంచి బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చారు. రాహుల్ పహాడిషరీఫ్‌లో, ముస్తకీమ్ ఖాన్ పటాన్‌చెరులో ఎక్స్‌కవేటర్ మెకానిక్‌లుగా పనిచేస్తున్నారు. జల్సాలు, లగ్జరీ జీవితానికి అలవాటుపడటంతో వచ్చే సంపాదన సరిపోలేదు. ఏటీఎంలను కొల్లగొట్టి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల ఊరెళ్లిన వీరిద్దరు అక్కడ తన కుటుంబంలోని ఇతర దొంగల ముఠాకు విషయం చెప్పారు. అందరూ సరే అనడంతో రాహుల్ ఒక్కడే తిరిగి నగరానికి వచ్చాడు. ఆదిభట్ల, మైలార్‌దేవ్‌పల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలను గుర్తించాడు. రాహుల్ సూచనతో ఈనెల 1న ముస్తకీమ్‌ఖాన్, షారుక్‌ఖాన్, సుబ్దిన్ ఖాన్, రఫీక్ విమానంలో నగరానికి వచ్చారు. నగరంలోనే ఉన్న మరో నిందితుడు పర్వేజ్ వారిని రిసీవ్ చేసుకొని జల్‌పల్లిలో ఉంటున్న మరో నిందితుడు సర్ఫరాజ్‌ఖాన్ రూమ్‌కు తీసుకెళ్లాడు. యూట్యూబ్‌లో శోధించి చోరీకి పథకం వేశారు. ముస్తకీమ్‌ఖాన్ కారులో రాత్రి 10 గంటలకు బయల్దేరి రావిర్యాలలో ఏటీఎం వద్దకు వెళ్లారు. 3 నిమిషాల్లో గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్‌చేసి రూ. 29లక్షలు దోచుకొని పారిపోయారు. నిందితులు ఉపయోగించిన కారును పోలీసులు గుర్తించకుండా ముందుభాగంలో నల్లటి స్టిక్కర్, నకిలీ నంబర్‌ప్లేట్ ఏర్పాటు చేశారు. ముఠాపై ఒడిశా, తెలంగాణలో ఆరు క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేలింది. కేసును ఛేదించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు, ఐటీసెల్ ఏసీపీ నరేందర్, ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఇతర క్రైమ్ టీమ్‌ను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.



పిడమర్తి రవికి మిఠాయి తినిపిస్తున్న ప్రొఫెసర్ కాశీం

నెలరోజులు ఉత్సవాలు నిర్వహిస్తామన్న మందకృష్ణ పత్తాలేకుండా పోయాడు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై నెల రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామన్న మంద కృష్ణ మాదిగ పత్తాలేకుండా పోయాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి విమర్శించారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిడమర్తి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన సందర్భంగా గ్రామ గ్రామాన మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఆరెకంటి శ్రీకాంత్, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రింగు రాంబాబు, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెర్రిపోతుల సాయన్న, బీఎస్ఎఫ్ ఓయూ నాయకులు పాల్గొన్నారు.



ఎంసీఈఎంఈని సందర్శించిన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

వెటరన్ అధికారులకు అచీవర్స్ అవార్డులు

అల్వాల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అత్యుత్తమ సేవలు అందించిన నలుగురు వెటరన్ అధికారులకు అచీవర్స్ అవార్డులు ప్రదానం చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ రాజీవ్ సిసోడియా(రిటైర్డ్), మేజర్ శివకిరణ్(రిటైర్డ్), కెప్టెన్ బండి వేణు(రిటైర్డ్), నాయక్ లింగాల జగన్‌రెడ్డి(రిటైర్డ్)కి సైనిక దళాల అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అవార్డులను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డులు అందుకున్న వారిని ప్రశంసించారు. అనంతరం సికింద్రాబాద్ మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ)ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డుల కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలి

కవాడిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం రూ 26 వేలుగా నిర్ణయించాలని, జీవో 814 ప్రకారం మినిమమ్ టైంస్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ. 19 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో సుమారు 12 వేలమంది సెక్యూరిటీ గార్డులు 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీల ద్వారానే వేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ మార్కెట్ కమిటీలే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు సారిక రాము, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, కోశాధికారి కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



నాన్‌టీచింగ్ ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జె. వెంకటేష్

వర్సిటీల్లో నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలి

కవాడిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను టైం స్కేల్ సిబ్బందిగా మార్చాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జె. వెంకటేష్ డిమాండ్ చేశారు. నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూనిన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 యూనివర్సిటీలలో దాదాపు 10 వేలమంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వీరికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేఎన్‌టీయూ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కాకతీయ వర్సిటీలలో ఈపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు చెల్లించాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు మెట్టురవి, ప్రధాన కార్యదర్శి వి. నారాయణ, ఉపాధ్యక్షులు ఎం. పద్మశ్రీ, కోశాధికారి మహ్మద్ సలార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ రంగంలో సవాళ్ల పరిష్కారానికి

హెచ్‌సీయూ-ఆస్ట్రేలియా వర్సిటీ ఒప్పందం

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ-నిర్వహణ సవాళ్లకు పరిష్కారాలను కనుగొనేందుకు ఆస్ట్రేలియన్ యూనివర్సిటీతో ఉమ్మడి దృక్పథం దోహదపడనుందని హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. ఆస్ట్రేలియన్ దౌత్యవేత్తల సమక్షంలో బుధవారం హైదరాబాద్ విశ్వవిద్యాలయంతో ఫ్లిండర్స్(ఆస్ట్రేలియా) విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ బీజేరావు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ- నిర్వహణలో ఉమ్మడిగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనింగ్ కార్యక్రమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు, స్వల్పకాలిక కార్య నిర్వాహక శిక్షణను రూపకల్పన చేశామన్నారు. ఆరోగ్య శ్రామిక శక్తి, డిజిటల్ ఆరోగ్యం, వృద్ధుల సంరక్షణ వంటి అంశాల్లో సహకార పరిశోధనలు నిర్వహిస్తామని, రెండు యూనివర్సిటీల్లోనూ ఫ్యాకల్టీ మార్పిడి, బోధనా మాడ్యూల్స్, విద్యార్థుల చలనశీలత, తెలంగాణలోని, దక్షిణ ఆస్ట్రేలియాలోని పరిశ్రమలతో భాగస్వామ్యాలను ఏర్పరచుకుంటామని పేర్కొన్నారు. ఫ్లిండర్స్ యూనివర్సిటీ వీసీ కాలిన్ స్టిర్లింగ్ మాట్లాడుతూ విద్యానైపుణ్యాలను అందింపచ్చుకోవడంలో రెండు సంస్థలు పరస్పర సహకారం, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయన్నారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్, ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కాలిన్ స్టిర్లింగ్ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ ఆచార్యులు, ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయం హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మదన్ బాలసుబ్రమణియన్, డీన్ అంజీ షఫీ, అంతర్జాతీయ భాగస్వామ్యాల డైరెక్టర్ బిల్ డమాచిస్, హెచ్‌సీయూ అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రహ్మానందం, భారతదేశంలో ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్‌గ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల ఆర్థిక స్వావలంబనకు నిధుల్లో వాటా పెరగాలి

● మాండ్య వర్సిటీ వీసీ శివచితప్ప
● అంబేడ్కర్ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు



వీసీ శివచితప్పకు జ్ఞాపిక అందజేస్తున్న అంబేడ్కర్ వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ జి.పుష్పా చక్రపాణి, ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రాష్ట్రాలు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే నిధుల్లో రాష్ట్రాల వాటా పెరగాలని కర్ణాటకలోని మాండ్య విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కె. శివచితప్ప అన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్ (ఎస్.ఆర్.సి) ఆధ్వర్యంలో "భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదం-వికేంద్రీకరణ, అభివృద్ధి, ఆర్థిక స్థితిగతులు" అనే అంశంపై జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం బుధవారం వర్సిటీలో జరిగింది. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ జి.పుష్పా చక్రపాణి మాట్లాడుతూ రెండురోజుల పాటు నిర్వహించిన సదస్సులో దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్ర విభాగపరిశోధక విద్యార్థులు, పలు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు 120 పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని ఐసీఎస్ఎస్ఆర్ అందిస్తోందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డా. యల్. విజయ కృష్ణారెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగం డీన్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డా. చిట్టెడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాలకు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని, ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3 శాతం నుంచి కేంద్రం మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, కాన్ఫరెన్స్ డైరెక్టర్ డా.కె.కృష్ణారెడ్డి రెండు రోజుల సదస్సు రిపోర్ట్‌ను సభకు సమర్పించారు.

సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలి: గవర్నర్

(5వ పేజీ తరువాయి)

పరిశోధనల్లో ఓయూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతోందన్నారు. 21వ శతాబ్దం మెటీరియల్ విప్లవానికి సూచికగా నిలుస్తుందని ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయ్ అన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం సరికొత్త పరిశోధనలు జరగాలని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్(ఏఎండీ) హైదరాబాద్ డైరెక్టర్ ధీరజ్ పాండే అన్నారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా ఫిజిక్స్‌లో పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయని సదస్సు కన్వీనర్, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితేంద్ర కుమార్ నాయక్, పలువురు మాజీ ఉపకులపతులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్

గవర్నర్ పర్యటన దృష్ట్యా విద్యార్థి నాయకుల హాస్టల్ గదుల్లోకి వెళ్లి పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య, పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మంద నవీన్, సహాయ కార్యదర్శి ఎస్‌కే ఆసీఫ్ ఉన్నారు. సర్క్యులర్‌ని రద్దు చేయాలని, నీటి సమస్యను, మెస్‌లో నాణ్యత పెంచాలని కోరుతూ గవర్నర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన బీఆర్ఎస్ యువ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు డాక్టర్ సత్య తదితరులను కూడా అరెస్ట్ చేసి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అన్నమయ్య సంకీర్తలను విశ్వవ్యాప్తం చేయాలి

రవీంద్రభారతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలను విశ్వవ్యాప్తంగా చేయాల్సిన అవసరముందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు 500వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ గరికపాటి వ్యాఖ్యానంతో శ్రీసప్తగిరీశ సంకీర్తన సౌరభం (అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాన సహిత గాత్రగోష్ఠి) ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నమయ్య సంకీర్తనలను ఆవిష్కరించారు. అన్నమయ్య సంకీర్తనలను విశ్వవ్యాప్తం చేయడంలో గరికపాటి కృషి అభినందనీయమని అన్నారు.



శ్రీసప్తగిరీశ సంకీర్తన సౌరభం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

నేటి నుంచి కియో జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

గచ్చిబౌలి మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాలయోగి స్టేడియంలో గురువారం నుంచి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 4వ కియో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, శాప్ చైర్మన్ శివసేనరెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఏర్పాట్లను పరిశీలించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని స్టేడియం సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

పెద్దపేగు క్యాన్సర్‌ను గుర్తించేందుకు కొల్‌ఫిట్ పరీక్ష

● అందుబాటులోకి తీసుకొచ్చిన అపోలో ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపేగు క్యాన్సర్(కొలొరెక్టల్ క్యాన్సర్)ను ముందుగా గుర్తించేందుకు అపోలో డాక్టర్లు కొల్‌ఫిట్ పేరిట ప్రత్యేక పరీక్షా పద్ధతిని తీసుకువచ్చారు. ఈ వివరాలు తెలియజేసేందుకు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన సమావేశంలో అపోలో హాస్పిటల్స్ తెలంగాణ రీజియన్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు, కొలొరెక్టల్ సర్జన్ కిశోర్ ఆలపాటి, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రఘు డీకే, గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అజేష్ రాజ్ సక్సేనా పాల్గొన్నారు. కిశోర్ ఆలపాటి మాట్లాడుతూ కొలొరెక్టల్ క్యాన్సర్‌లను ముందుగా గుర్తిస్తే నయం చేయడం సులభమే కాక, పేగులలోని పాలిప్స్‌ను ముందుగానే గుర్తించి తొలగించడం ద్వారా ఈ క్యాన్సర్ బారిన పడకుండా చేయవచ్చన్నారు. పైల్స్ లక్షణాలు, ఈ క్యాన్సర్ లక్షణాలు కాస్త దగ్గరలో ఉంటాయన్నారు. పైల్స్‌కు రెండు వారాలపాటు చికిత్స తీసుకున్న తరువాత కూడా ఉధృతి తగ్గకపోతే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జీవనశైలి, ఊబకాయం, మారిన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు మూల కారణాలుగా మారుతున్నాయని డాక్టర్ అజేష్ రాజ్ సక్సేనా వివరించారు. కొల్‌ఫిట్ పద్ధతిలో కొలనోస్కోపీ, ఫీకల్ ఇమ్యునోకెమికల్ టెస్ట్ (ఫిట్), రక్త పరీక్షలు భాగంగా ఉంటాయని, వీటిద్వారా ఈ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చన్నారు. చికిత్స కంటే నివారణ ఉత్తమమని డాక్టర్ రఘు డికె తెలిపారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మలబద్ధకం, మలంలో రక్తం పడటం, తరచుగా కడుపులో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ క్రికెట్‌మ్యాచ్‌లకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ అడిషనల్ ఇన్‌చార్జి ఈడీ ఖుస్రోషా ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో జరిగే క్రికెట్ మ్యాచ్‌లకు నగరంలోని 24 ప్రాంతాల నుంచి 60 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు సాయంత్రం 6 గంటలకు, మ్యాచ్ ముగిసిన అనంతరం రాత్రి 11.30 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. పత్యేక బస్సుల వివరాల కోసం కోఠి-9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్-9959226154 కమ్యూనికేషన్ సెంటర్లలో సంప్రదించవచ్చన్నారు.

దాసరి వెంకట రమణ కథ సోలాపూర్ వర్సిటీలో పాఠం

● ఆయన రాసిన ఆనందం కథ మరాఠాలోకి అనువాదం



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత దాసరి వెంకట రమణ రాసిన "ఆనందం" పిల్లల కథలను షోలాపూర్‌కు చెందిన బుధారం రేణుక మరాఠాలోకి అనువదించారు. అందులోని ఆనందం కథను మహారాష్ట్రలోని సోలాపూర్ విశ్వవిద్యాలయం బీఏ డిగ్రీ కోర్సు మొదటి సంవత్సరం పాఠ్యాంశాల్లో చేర్చినట్లు రచయిత దాసరి వెంకట రమణ తెలిపారు. ఇదే కథా సంపుటికి గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. దాసరి వెంకటరమణ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'చందమామ కథలు వ్యక్తిత్వ వికాసం' అంశంపై పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు.

పాత నేరస్థుడి హత్య కేసులో ఆరుగురికి రిమాండ్

● కారు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు, గొడ్డలి, కొడవళ్లు స్వాధీనం



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు (కూర్చున్న వారు)

కొత్తపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్థుడు మహేష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి కారు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లు, గొడ్డలి, రెండు కొడవళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌వో వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీలో నివసిస్తున్న బొడ్డడ మహేష్(31) పాత నేరస్థుడు. క్యాటరింగ్ వ్యాపారంచేసే పగిళ్ల పురుషోత్తం (28), స్కూల్ బస్ డ్రైవర్ నోముల నాగార్జున(28), డ్రైవర్ మంద సందీప్(25), ఫొటోగ్రాఫర్ గడమోని రాము(28), డ్రైవర్ ఎల్. రాజా రాకేష్(27) మహేష్ స్నేహితులు. బోడుప్పల్‌కు చెందిన ఆటోడ్రైవర్ కుంచల ఓంకార్(33) పురుషోత్తం స్నేహితుడు. 2023 మార్చి నెలలో హయత్‌నగర్ పీఎస్ పరిధిలో నాగరాజు అనే స్నేహితుడి పెళ్లి పార్టీలో పురుషోత్తం, మహేష్ మధ్య గొడవ జరగడంతో పురుషోత్తం మహేష్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేశాడు. ఈ కేసులో పురుషోత్తం, రాములు 36 రోజులు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించారు. ఆ తర్వాత కొందరు స్నేహితులు మహేష్‌తో విడిపోయి, పురుషోత్తంతో తిరిగేవారు. మహేష్ కొత్త స్నేహితులతో కలిసి 2024 డిసెంబర్‌లో చైతన్యపురి పీఎస్ పరిధిలో పురుషోత్తం, రాము తదితరులపై కత్తులతో దాడి చేశాడు. పురుషోత్తం తప్పించుకోగా మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో మహేష్, అతడి స్నేహితులు కటకటాలపాలయ్యారు. మహేష్‌ను అడ్డుతొలగించాలని పురుషోత్తం, అతడి స్నేహితులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి భరత్‌నగర్‌లో స్నేహితులతో మద్యం తాగిన మహేష్‌ను ఓ స్నేహితుడు బైక్‌పై ఎక్కించుకుని ఆర్టీసీ కాలనీలో దింపేందుకు శివగంగ కాలనీ గుండా వెళ్తున్నాడు.

సమాచారం అందుకున్న పురుషోత్తం తదితరులు కారులో వెంబడించి బైక్‌ను ఢీకొట్టడంతో మహేష్, బైక్ నడుపుతున్న యువకుడు కిందపడిపోయారు. పురుషోత్తం, నోముల నాగార్జున, మంద సందీప్ మహేష్‌పై గొడ్డలి, కొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రమైన గాయాలవడంతో మహేష్ రక్తపు మడుగులో రోడ్డుపై కుప్పకూలిపోయాడు. చనిపోయాడని భావించిన నిందితులు పారిపోయాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎల్‌బీనగర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా రాము సహా నలుగురు నిందితులను అదేరోజు అరెస్ట్ చేశారు. మహేష్ హత్యకు పరోక్షంగా సహకరించిన మరో ఇద్దరిని ఈనెల 25న అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కౌన్సెలింగ్

పిల్లలు పాలు కక్కేస్తూ ఉంటే?

Q డాక్టర్! మా బాబుకు రెండు నెలలు. తల్లి పాలు తాగడంలో ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ పాలు తాగిన తర్వాత రోజులో మూడు నుంచి నాలుగు సార్లు వాంతి చేసుకుంటున్నాడు. ఇది ప్రమాదకర లక్షణమా?

- ఓ సోదరి, గుంటూరు

A ఆరు నెలల లోపు పిల్లలకు పాలు, పెరుగు లాంటి వాంతులు కావడం సహజం. ఈ లక్షణాన్ని 'గ్యాస్ట్రో ఈసోఫిగల్ రిఫ్లక్స్' అంటారు. అన్నవాహికకు, జీర్ణాశయానికి మధ్య ఉండే కండరం వదులుగా ఉండడం మూలంగా పాలు కొంత మేరకు బయటకు వచ్చేస్తూ ఉంటాయి. ఆరు నెలల వయసు వరకూ పిల్లల్లో ఈ వ్యవస్థ పూర్తిగా ఎదిగి ఉండదు. కాబట్టి ఇలా పాలు కక్కుకోవడం సహజం. కొంతమంది పిల్లల్లో ఈ సమస్య ఏడాది వరకూ కొనసాగవచ్చు. అయితే ఈ పరిస్థితి ప్రమాదకరమా? కాదా? అని తెలుసుకోవడానికి పిల్లల బరువును గమనించాలి. బిడ్డ బరువు తగ్గకుండా వారానికి 150 గ్రాముల చొప్పున క్రమేపీ బరువు పెరుగుతూ ఉంటే, పాలు వాంతి చేసుకుంటున్నా కంగారు పడవలసిన అవసరం లేదు. అయితే కొందరు తల్లులు బిడ్డ ఏడ్చిన ప్రతిసారీ పాలు పట్టించేస్తూ ఉంటారు. ఇలా అవసరానికి మించి పాలు పట్టించినా ఇలా జరిగే అవకాశం ఉంటుంది. అలాగే సీసా పాలు పట్టించే పిల్లల్లో కూడా ఇలా జరుగుతుంది. కాబట్టి కారణం గమనించాలి. అలాగే పాలు తాగించిన వెంటనే బిడ్డను పడుకోబెట్టకుండా, 10 నిమిషాల పాటు భుజం మీద పడుకోబెట్టుకుని, త్రేన్పు వచ్చేవరకూ వెన్ను తట్టాలి. ఇలా చేసినా పిల్లలు పాలు కక్కేసుకోకుండా ఉంటారు.

డాక్టర్ విజయానంద్
పీడియాట్రీషియన్ అండ్ నియోనాటాలజిస్ట్, హైదరాబాద్.



కొబ్బరి నీళ్లు తాగుదాం!

వేసవికాలంలో తరచూ గొంతు ఎండిపోతూ ఉంటుంది. ఎండ తీవ్రత వల్ల శరీరంలో నిర్జలీకరణ, అలసట, నీరసం, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. వీటి నుంచి తక్షణమే ఉపశమనం పొందేందుకు కొబ్బరినీళ్ల తాగడం శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరినీళ్ల అందించే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- ఎండాకాలంలో మధ్యాహ్నం వేళ కొబ్బరి నీళ్ల తాగితే వడదెబ్బ తగలదు. శరీరానికి కావాల్సిన సహజ లవణాలు అందుతాయి.
- కొబ్బరినీళ్లలో సోడియం, పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతాయి. భోజనానికి అరగంట ముందు కొబ్బరి నీళ్ల తాగడం మంచిది.
- కొబ్బరినీళ్లకు ఆల్కలీన్ గుణాలు ఉంటాయి. తరచూ ఈ నీళ్ల తాగుతూ ఉంటే కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది. కారంగా ఉండే పదార్థాలు తిన్నతరవాత అరగ్లాసు కొబ్బరినీళ్ల తాగితే కడుపులో చల్లగా అనిపిస్తుంది.
- కొబ్బరి నీళ్ల తాగడం వల్ల జీర్ణక్రియ సజావుగా జరిగి మలబద్ధకం సమస్య తీరుతుంది.
- కొబ్బరి నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, రైబోఫ్లేవిన్, థయమిన్, నియాసిన్, పైరిడాక్సిన్, ఫోలేట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు కొబ్బరినీళ్ల తాగుతూ ఉంటే అంటువ్యాధులు దరిచేరవు.
- ఉదయం వ్యాయామం చేసిన తరవాత కొబ్బరి నీళ్ల తాగితే తక్షణ శక్తి లభిస్తుంది. శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహం, గుండె సమస్యలు తగ్గుతాయి.



- తరచూ కొబ్బరినీళ్ల తాగుతూ ఉంటే శరీరానికి కావాల్సిన సి, ఇ విటమిన్లు; కాల్షియం లభిస్తాయి. దీంతో దంతాలు, కండరాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి.

వ్యాయామం తరువాత..!

వ్యాయామం చేసిన తరువాత ఆలసటగా అనిపిస్తూ ఉంటుంది. అంతేకాదు కండరాలు పట్టేసినట్లు నొప్పిగా ఉంటాయి. వీటినుంచి ఉపశమనం పొందేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి నిపుణులు ఇలా చెబుతున్నారు.

- గుడ్లలో ప్రోటీన్లు, అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. వ్యాయామం తరవాత ఉడికించిన గుడ్లు తింటే కండరాల నొప్పి తగ్గుతుంది
- బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్ తినడం మంచిది. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి శక్తిని అందిస్తాయి.
- చీజ్, చియా గింజలు, అవిసె గింజలతోపాటు సాల్మన్, ట్యూనా, మాకెరెల్ లాంటి చేపలను ఆహారంలో చేర్చుకుంటే కండరాల వాపు, నొప్పి తగ్గుతాయి. వీటిలోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు.. శరీరానికి మేలు చేస్తాయి.



- అరటి పండు, స్ట్రాబెర్రీ, పైనాపిల్ తినడం వల్ల శరీరంలోని కణాలు బలంగా, ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు బలోపేతమవుతాయి.
- వ్యాయామం తరవాత శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. దీనిని భర్తీ చేసేందుకు పళ్ల రసాలు, కొబ్బరినీళ్ల, మంచినీళ్ల, పలుచని మజ్జిగ తాగడం మంచిది. కేరట్, బీట్‌రూట్, టమాటాలతో చేసిన రసం తాగినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మొలకలు, కీరా, కేరట్ ముక్కలతోపాటు తాజా పళ్ల తినడం మంచిది.

నలుపును ఎందుకు అవమానించాలి?



నలుపు రంగు పట్ల మన సమాజంలో ఉన్న వివక్ష ఈనాటిది కాదు. మన జీవితాలలోని అనేక పార్శ్వాలలో ఇది బయటపడుతూనే ఉంటుంది. ముఖ్యంగా నల్లగా ఉన్న మహిళల పట్ల అవాంఛనీయమైన వ్యాఖ్యలు వింటూనే ఉంటాం. తాజాగా కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్‌కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. నల్లగా ఉన్నందుకు తనను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఫేస్‌బుక్ వేదికగా స్పందించారు. ఆ పోస్టుకు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది మద్దతు తెలియజేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతున్న ఆ పోస్టులో ఏముంది..?

"నేను నల్లగా ఉండటంవల్ల చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేకపోతున్నానని నిన్న ఒకరు వ్యాఖ్యానించారు. నాకన్నా ముందు ఈ బాధ్యతలు నిర్వహించిన నా భర్తతో (వేణు) పోలిస్తే నా పనితీరు పేలవంగా ఉందన్నారు. ఎందుకంటే నా భర్త తెల్లగా ఉంటారు. నేను నల్లగా ఉన్నందుకట. ఈ నేపథ్యంలో చేసిన వ్యాఖ్యలివి. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను నల్లగా ఉంటానని చెప్పటానికి నాకు ఎటువంటి సంకోచం లేదు. నేను ఈ పోస్టును ఈ రోజు ఉదయం ఫేస్‌బుక్‌లో పెట్టా. ఆ పోస్టుకు విపరీతమైన స్పందనలు రావటం మొదలుపెట్టాయి. నేను చేసింది సరైన పనేనా అనే సందేహం కలిగింది. దాంతో వెంటనే ఆ పోస్టును తొలగించా. ఆ తర్వాత కొంత మంది సన్నిహితులు ఈ విషయంపై చర్చ జరిగితే బాగుంటుందని సూచించారు. వారితో నేను ఏకీభవిస్తున్నా. అందుకే దీనిని మళ్లీ పోస్ట్ చేస్తున్నా.

ఈ విషయాన్ని నేను ఎందుకు చెప్పాలను కున్నాననే ప్రశ్న చాలా మందిలో తలెత్తవచ్చు. నా నలుపు రంగుపై చేసిన వ్యాఖ్యలు నాకు బాధ కలిగించాయి. నేను పదవిలోకి వచ్చి ఏడు నెలలు అయింది. ఈ ఏడు నెలలు నాకన్నా ముందు పదవిలో ఉన్న వ్యక్తి రంగుతో నన్ను పోలుస్తూనే ఉన్నారు. నేను సహిస్తూనే వచ్చాను. కానీ నా చర్మపు రంగు ఆధారంగా నేను సిగ్గుపడాలనే ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలను మాత్రం సహించలేకపోతున్నా. ఈ తరహా వ్యాఖ్యలు చేసేవారు నలుపును ఒక రంగుగా చూడటంలేదు. వారి దృష్టిలో... నలుపు ఎప్పుడూ మంచి చేయదు. నలుపు ఒక రుగ్మత. నలుపు నిరంకుశధోరణికి చిహ్నం. నలుపు చీకటికి సంకేతం. కానీ నలుపును ఎందుకు తప్పుగా భావించాలి? నలుపు మన విశ్వపు రంగు. నలుపు దేనినైనా తనలో కలిపేసుకోగలదు. మానవాళికి తెలిసిన అత్యంత శక్తిమంతమైన శక్తి నలుపే! ఈ రంగు అందరికీ సమానంగా పనికొస్తుంది. అనేక ఆఫీసులలో డ్రెస్ కోడ్ రంగు అది. సాయంత్రం పార్టీ డ్రెస్ కోడ్ అది. కళ్లకు పెట్టుకొనే కాటుక రంగు అది. వాన వస్తుందనే ఆశకు చిహ్నం అది.

> **నేను పదవిలోకి వచ్చి ఏడు నెలలు అయింది. ఈ ఏడు నెలలు నాకన్నా ముందు పదవిలో ఉన్న వ్యక్తి రంగుతో నన్ను పోలుస్తూనే ఉన్నారు. నేను సహిస్తూనే వచ్చాను. కానీ నా చర్మపు రంగు ఆధారంగా నేను సిగ్గుపడాలనే ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలను మాత్రం సహించలేకపోతున్నా.**

నాకు నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడు మా అమ్మను అడిగాను... "నన్ను మళ్లీ నీ కడుపులో పెట్టి తెల్లగా, అందంగా బయటకు తీసుకువస్తావా' అని! గత 50 ఏళ్లగా నలుపు మంచిది కాదు అనే బలమైన భావన వింటూ పెరిగాను. దానిని నమ్మాను. తెల్లటి చర్మం ఉంటే మంచి ఆలోచనలు ఉంటాయని... వారు మంచివారని... గొప్పవారనే భావన నాలో కూడా ఉండేది. నేను తెల్లగా ఉన్నవారి కన్నా తక్కువ కాబట్టి... ఆ లోపాన్ని పూరించుకోవటానికి ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలు నాలో కలిగేవి.

> **విమర్శిస్తూ వ్యాఖ్యలు చేసేవారు నలుపును ఒక రంగుగా చూడటంలేదు. వారి దృష్టిలో... నలుపు ఎప్పుడూ మంచి చేయదు. నలుపు ఒక రుగ్మత. నలుపు నిరంకుశధోరణికి చిహ్నం. నలుపు చీకటికి సంకేతం. కానీ నలుపును ఎందుకు తప్పుగా భావించాలి?**

నాకు పిల్లలు పుట్టి.. వారు పెద్దవారయ్యే దాకా



ఇదే భావనలో ఉన్నా. కానీ నా పిల్లలు తాము నల్లగా ఉన్నందుకు గర్వపడతారు. అందంగా ఉన్నామని భావిస్తారు. వారి దృష్టి కోణం నుంచి చూసినప్పుడు నాకు కూడా నలుపు అందంగా కనబడటం మొదలుపెట్టింది. ఇప్పుడు నాకు నలుపు ఒక బ్రహ్మాండమైన రంగు. నలుపు వెనకున్న గొప్పతనాన్ని నేను అర్థం చేసుకున్నా!

స్నానానికి వెళ్లే ముందు

వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, హార్మోన్ల అసమతౌల్యం లాంటి పలు కారణాల వల్ల ముఖంపై మొటిమలు, వీటి నుంచి మచ్చలు ఏర్పడుతుంటాయి. స్నానానికి వెళ్లేముందు కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ మచ్చలను త్వరగా పోగొట్టుకోవచ్చు.

- రెండు చెంచాల కలబంద గుజ్జును తీసుకుని మంచి నీళ్లలో ముంచి కడగాలి. తరవాత దీన్ని ముఖమంతా పట్టించాలి. పావుగంటసేపు ఆరిన తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. కలబంద గుజ్జులోని తేమ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మం పొరలను శుభ్రం చేస్తాయి. ఆరోగ్యవంతమైన నూతన చర్మ కణాలు పెరిగేందుకు తోడ్పడతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల పెరుగు, అర చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా పలుచగా పట్టించాలి. పది నిమిషాలు ఆరాక వేళ్లతో సున్నితంగా మర్దన చేస్తే చర్మం మీద ఉన్న మృతకణాలు తొలగిపోతాయి. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం, పసుపులోని కర్క్యుమిన్ మూలకం కలిసి మచ్చలను పోగొడతాయి.



- ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం తీసుకోవాలి. ఇందులో చూపుడు వేలుని ముంచి దానితో ముఖం మీద ఉన్న మచ్చలపై పూతలా రాయాలి. అయిదు నిమిషాల తరవాత నీళ్లతో కడిగేసుకోవాలి. నిమ్మరసంలోని సిట్రిక్ ఆమ్లం, బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి మచ్చలను పోగొడుతుంది. చర్మాన్ని మెరిపిస్తుంది.
- ఒక చెంచా తేనెలో చిటికెడు దాల్చినచెక్క పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి సున్నితంగా మర్దన చేయాలి. పదినిమిషాల తరవాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం రాయడం వల్ల మొటిమలకు కారణమైన బ్యాక్టీరియా తొలగిపోతుంది. చర్మానికి రక్తప్రసరణ జరిగి మచ్చలు పోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, మూడు చెంచాల గులాబీ నీళ్ల వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత ముఖంపై నీళ్ల చిలకరించుకుంటూ శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం రాయడం వల్ల చర్మ రంధ్రాల్లో పేరుకున్న మురికి వదిలిపోతుంది. చర్మానికి తగినంత తేమ, ఆక్సీజన్ అంది మొటిమల బాధ తగ్గుతుంది. క్రమంగా చర్మం మృదువుగా మారుతుంది.

ఆమే ఒక స్ఫూర్తిమంత్రం

వృత్తి అంటే ప్రాణం, విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలనే తపన... వీటికి సృజనాత్మకత తోడైతే గొప్ప ఫలితాలు సాధించవచ్చని నిరూపిస్తున్నారు 36 ఏళ్ల కె.శారద. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆమె చిన్న వయసులోనే వైకల్యానికి గురైనా... ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగారు. బోధనలో కొత్త ప్రయోగాలు చేసి, ఉత్తమ ఉపాధ్యాయినిగా జాతీయ పురస్కారాన్ని అందుకున్న శారద పయనం గురించి ఆమె మాటల్లోనే...



"మనకు మనమే పరిమితులు విధించుకుంటే ఏ పనీ చెయ్యలేం. అసాధ్యాలను సుసాధ్యం చెయ్యలేక పోవచ్చు. కానీ మనం చెయ్యగలిగే పనులను కూడా ఏదో వంకతో తప్పించుకోకూడదు. దానివల్ల మన శక్తి సామర్థ్యాలు వృథా అవుతాయి. ఏడాది వయసులో పోలియో వచ్చి, నడుము నుంచి కిందిభాగం చచ్చుబడిపోయింది. ఎక్కడికి వెళ్లాలన్నా ఎవరో ఒకరి సాయం తప్పనిసరి.ఆ సమయంలో నా తల్లిదండ్రులు నన్ను కంటికి రెప్పలా కాపాడారు. బాగా చదువుకోవాలనే ఆకాంక్ష నాలో కలిగేలా చేశారు. బడిలో చేరిన తరువాత... నా సోదరుడు నన్ను మోసుకుంటూ బడికి తీసుకువెళ్ళేవాడు. రాకపోకలకు, తోటి విద్యార్థులతో కలిసిపోవడానికి కాస్త ఇబ్బందులు ఎదురైనా... చదువులో ఎప్పుడూ ముందుండేదాన్ని.

కొత్త పద్ధతుల కోసం...

మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భిలాయ్. చిన్నప్పటి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి నాకు ఎక్కువ. నా జీవితంలో నా కుటుంబం తరువాత ముఖ్యపాత్ర పోషించింది ఉపాధ్యాయులే. అందుకే టీచర్ కావాలని బాల్యంలోనే నిర్ణయించుకున్నాను. ఆ లక్ష్యం దిశగా నన్ను నేను నడిపించుకున్నాను. గణితం, ఆర్థిక శాస్త్రాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తోపాటు బీఈడీ కూడా పూర్తి చేశాను. గణిత ఉపాధ్యాయినిగా వృత్తి జీవితం మొదలుపెట్టాను. బోధనా పద్ధతులు విద్యార్థులకు అర్థమయ్యేలా లేవనే సంగతి కొద్దిరోజుల్లోనే గ్రహించాను. సిలబస్ పూర్తి చేయడం మీద టీచర్ల దృష్టి ఉంటే, పాఠాలపై అవగాహన పెంచుకోవడానికి బదులు ఎలా పాసవ్వాలా? అనే ఆలోచనలో విద్యార్థులు ఉంటున్నారు. బట్టీ పట్టాల్సిన అవసరం లేకుండా వారికి పాఠాలు గుర్తుండిపోవాలంటే బోధనలో కొత్త పద్ధతులు అనుసరించాలి. అందుకోసం సాంకేతికతను ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాను. మొదట్లో ఆడియో పాఠాలు రూపొందించాను. ఆ తరువాత వివిధ అంశాలపై వీడియోలు తీశాను. వాటిని తరగతి గదుల్లో ప్రదర్శించడానికి అనుమతి కోరినప్పుడు... మొదట్లో పాఠశాల యాజమాన్యం, ఉన్నతాధికారులు సంకోచించినా, చివరకు ఒప్పుకున్నారు. కంటెంట్ అంతా నా సొంత ఖర్చులతోనే తయారు చేశాను. విద్యార్థుల నుంచి మంచి స్పందన రావడంతో... నాకు ఉత్సాహం కలిగింది. ఆడియో, వీడియో పాఠాల రూపకల్పనను కొనసాగించాను.

2 వేల ఆడియో బుక్స్

కొవిడ్ విజృంభణ అన్ని రంగాల్లోనూ పెను మార్పులను తీసుకొచ్చింది. ప్రజలు సాంకేతికత గురించి అంతకుముందు కన్నా చాలా ఎక్కువ తెలుసుకున్నారు. ఆన్‌లైన్... నేర్చుకోవడానికి చక్కటి, సమర్థవంతమైన మాధ్యమం. బోధనా వృత్తిలో ఉన్నవారికి అది మరింత ప్రయోజనకరమైనదని నా నమ్మకం. విద్యాబోధనలో వీలైనంత ఎక్కువ సాంకేతికతను ఉపయోగించుకోవాలన్న నా ఆలోచనను ఆ పరిస్థితులు మరింత బలోపేతం చేశాయి. మొదట్లో ఆడియో పాఠాలు తయారు చేశాను. పాఠాలను వివిధ భాషల్లోకి తర్జుమా చేసే యాప్‌లను ఉపయోగించుకున్నాను. వివిధ రంగాల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ)ను ఉపయోగించే విషయంలో అభ్యంతరాలు వినిపిస్తు న్నాయి. కానీ సరైన రీతిలో వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయనేది నా అనుభవం. ఇప్పటివరకూ ఏఐని, కార్టూన్ పాత్రలను ఉపయోగించి నేను 2 వేలకు పైగా ఆడియో బుక్స్ తయారు చేశాను. ఇ-కంటెంట్, ఇతర వనరులతో ఒక వెబ్‌సైట్ సృష్టిం చాను. అలాగే ఆరు నుంచి పన్నెండు తరగతుల విద్యార్థుల కోసం 270 టీచింగ్ వీడియోలు రూపొందించి, పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాను. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని ప్రోత్సహించడానికి లెక్కలు, జనరల్ నాలెడ్జ్ సైన్స్ తదితర అంశాలపై ఇరవైకి పైగా పుస్తకాలు రాశాను. వాటిని మా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పిల్లకు బోధిస్తున్నారు. అలాగే లెక్కల పుస్తకాన్ని క్యూఆర్ కోడ్‌లో తయారు చేశాను. విద్యార్థులు దాన్ని స్కాన్ చేసి, కోరుకున్న పాఠాన్ని నా యూట్యూబ్ చానల్ ద్వారా వివరంగా తెలుసుకోవచ్చు. బస్తర్‌లోని విద్యార్థుల కోసం హల్బీ భాషలో ఒక పుస్తకాన్ని, అలాగే గోండీ బాషలో మరొకటి రాశాను. పిల్లల్లో నైతికతను పెంపొందించడం కథల ద్వారానే సాధ్యమ వుతుంది. అందుకే ఇంగ్లీష్, హిందీ, హల్బీ భాషల్లో యాభైకి పైగా కథలు రాశాను. నా ప్రయత్నాలు అన్నిటికీ నా కుటుంబం, తోటి ఉపాధ్యాయులు, అధికారుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

అదే ప్రేరణ



దుర్గ్‌లో నిర్వహించిన ఒక జాతీయ సదస్సులో... ముఖ్యమంత్రి తదితరుల సమక్షంలో నా కృషిని వివరించే అవకాశం దొరికింది. ఎందరో ప్రముఖులు నన్ను ప్రశంసించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి 2021లో 'ముఖ్యమంత్రి గౌరవ అలంకరణ్ జ్ఞానదీప్ పురస్కార్, 2023లో 'గవర్నర్ అవార్డు', కిందటి ఏడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్'... ఇలా ఎన్నో గౌరవాలు, పురస్కారాలు అందుకు న్నాను. వీటితోపాటు... కొన్ని వేల మంది విద్యార్థుల పురోగతికి కాస్తయినా తోడ్పడ్డాననే సంతృప్తిని సంపాదించుకున్నాను. బోధనలో మరిన్ని కొత్త పద్ధతులు రూపొందించడానికి అదే నాకు ప్రేరణగా నిలుస్తోంది.

వేసవిలో మొక్కల సంరక్షణ ఇలా...


మనం... ఇంటి పరిసరాల్లో లేదంటే బాల్కనీలో చిన్న కుండీల్లో రకరకాల మొక్కలు పెంచుతూ ఉంటాం. వేసవిలో ఎండ తీవ్రత వల్ల ఈ మొక్కలు ఎండిపోతూ ఉంటాయి. ఒక్కోసారి చనిపోతాయి కూడా. ఇలా కాకుండా ఎండాకాలంలో కూడా మొక్కలు పచ్చగా ఏపుగా పెరగాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవి ...

- మధ్యాహ్న సమయంలో మొక్కల మీద నేరుగా సూర్యరశ్మి పడకుండా మందపాటి వస్త్రాన్ని పరదాలా వేయాలి. మొక్కలకు ఇలా నీడను అందించడం వల్ల వాటి ఆకులు, వేర్లు ఎండిపోకుండా ఉంటాయి. కాండంలో తేమ నిలిచి మొక్క చక్కగా పెరుగుతుంది.
- ఎండాకాలంలో సూర్యోదయానికి ముందే మొక్కలకు నీళ్ల పోయడం మంచిది. ఈ సమయంలో అయితే వాతావరణంలో వేడి ఎక్కువగా ఉండదు కాబట్టి, మట్టి మెల్లగా తడిని పీల్చుకుని ఎక్కువసేపు నిల్వ ఉంచుకుంటుంది. దీనిని మొక్కలు గ్రహించి ఆరోగ్యంగా పెరుగుతాయి.
- మొక్కలకు ఒకేసారి ఎక్కువగా నీళ్ల పోయాలి. దీనివల్ల భూమి లేదా కుండీ లోపలికి వ్యాపించి ఉన్న వేర్లకు నీరు అందుతుంది.
- మొక్కలను ఒక్కోటిగా కాకుండా నాలుగు లేదా అయిదింటిని ఒక సమూహంలా నాటాలి. దీనివల్ల మొక్కలన్నింటికీ నీరు, సూర్యరశ్మి సమపాళ్లలో అందుతాయి.
- ఎండిపోయిన ఆకులు, పువ్వులను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. దీంతో పోషకాలు అంది మొక్కలు పచ్చగా ఏపుగా పెరుగుతాయి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు మొక్కలకు ఎరువులు అందించకూడదు. వాతావరణం కాస్త చల్లబడినప్పుడు మట్టిలో ఎరువులు కలిపితే మొక్కలు బలంగా ఉంటాయి.
- వేసవికాలంలో మట్టి ఎక్కువగా తడారిపోతూ ఉంటుంది. ఈ సమయంలో బిందు సేద్య విధానం లేదా స్వీయ నీటి కుండీలను ఉపయోగించి మట్టి ఎల్లప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి. మట్టిపై ఎండిన ఆకులు లేదా గడ్డి పరచి ఉంచితే ఎక్కువసేపు తడి నిలుస్తుంది.











చిత్రజ్యోతి
SINCE 1965

'చిరు'నవ్వుల 'పండగ' బొమ్మ!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తను రూపొందించే చిత్రానికి సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు అనిల్ రావిపూడి. అద్భుతమైన కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు పేరొందిన ఆయన ఈ సారి కూడా వినోదభరిత ఇతివృత్తాన్నే ఎన్నుకున్నారు. కామెడీ, ఎమోషన్, యాక్షన్ అంశాలు కలగలిసే ఈ చిత్రంలో తను ఇంతవరకూ చేయని పాత్రను చిరంజీవి పోషిస్తున్నారు. తన అసలు పేరు.తో, శివశంకర వరప్రసాద్ గానే చిరంజీవి ఇందులో కనిపించనుండడం విశేషం.ఈ సినిమా స్క్రిప్ట్ సిద్ధం కావడంతో చిరంజీవికి ఫైనల్ నేరేషన్ ఇచ్చారు అనిల్. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక షూటింగ్ ప్రారంభించడమే తరువాయి. అదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ 'స్క్రిప్ట్ వినిపించడం పూర్తయింది.. గ్రీన్ సిగ్నల్ వచ్చింది. చిరంజీవిగారికి నా కథలో పాత్ర 'శంకర్ వరప్రసాద్‌ని పరిచయం చేశా. ఆయనకు ఆ రోల్ బాగా నచ్చింది. ఇంకెందుకు ఆలస్యం.. మంచి ముహూర్తంతో.. 'చిరు'నవ్వుల 'పండగ బొమ్మకి శ్రీకారం' అని పేర్కొన్నారు అనిల్ రావిపూడి. సాహు గారపాటి నిర్మించే ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని అంటున్నారు.

మునుపెన్నడూ చూడని మాస్ లుక్



కథానుగుణంగా పాత్రలో ఒదిగి అద్భుతంగా భావోద్వేగాలను పలికించగల అరుదైన నటుల్లో కథానాయకుడు నాని ఒకరు. ఆయన హీరోగా తెరకెక్కుతోన్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్ - రా స్టేట్‌మెంట్'. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతోందని యూనిట్ తెలిపింది. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. విడుదలకు ఇంకా ఏడాది సమయం ఉన్న విషయాన్ని తెలుపుతూ బుధవారం నాని కొత్త లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. కండలు తిరిగిన దేహం, భుజాన తుపాకితో మునుపెన్నడూ చూడని మాస్ లుక్‌లో ఆయన ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీతం: అనిరుధ్ రవిచందర్, సినిమాటోగ్రఫీ: జీకే విష్ణు



ఎంటర్‌టైన్ చేయబోతున్నాం

- నితిన్

"రాబిన్‌హుడ్ ఫైనల్ కాపీ చూశాం. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందనే సంతృప్తి కలిగింది. కథ విన్నప్పుడే సినిమా పెద్ద విజయం అందుకుంటుందనే నమ్మకం కలిగింది. గతంలో నేను హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'భీష్మ' చిత్రం సూపర్‌హిట్ అయింది. 'రాబిన్‌హుడ్' చిత్రం దానికి మించి ఉండబోతోంది. ప్రేక్షకులను ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేయబోతున్నాం' అని హీరో నితిన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'రాబిన్‌హుడ్' చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం మీడియా సమావేశం నిర్వహించింది. వెంకీ కుడుముల మాట్లాడుతూ 'సినిమా కోసం మా టీమ్ అంతా చాలా కష్టపడింది. తప్పకుండా 'రాబిన్‌హుడ్' ఘన విజయాన్ని అందుకుంటుంది. ప్రేక్షకులు మా సినిమాను బ్లాక్ బస్టర్ చేస్తారనే నమ్మకం ఉంది' అని చెప్పారు. నిర్మాత వై. రవిశంకర్ మాట్లాడుతూ 'రాబిన్‌హుడ్ ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లోకి చొచ్చుకెళ్లింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. మంచి పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి. సినిమా ఆద్యంతం అలరిస్తుంది' అని చెప్పారు.

భారీ ఓపెనింగ్స్ ఖాయం

నాగచైతన్య



'తనలోని ధైర్యమే నిర్మాతగా వంశీని ఈ స్థాయిలో నిలబెట్టింది. ఆయన జడ్జిమెంట్‌లో తిరుగుండదు. ప్రచార చిత్రాలతోనే 'మ్యాడ్ మాక్స్' సినిమా ప్రేక్షకులకు దగ్గరైంది. ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ ఖాయం' అని హీరో నాగచైతన్య అన్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన సినిమా 'మ్యాడ్ స్క్వేర్'. సంగీత్ శోభన్, నార్నె నితిన్, నితిన్ రామ్ ప్రధాన తారాగణం. కల్యాణ్ శంకర్ దర్శకుడు. నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా యూనిట్ బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ "మ్యాడ్ స్క్వేర్' లాంటి సినిమాలు మనసుకు ఉల్లాసం కలిగిస్తాయి. సానుకూల దృక్పథాన్ని పెంచుతాయి. 'సరదాగా 'మ్యాడ్' లాంటి సినిమాలు చూడండి' అని డాక్టర్లు కూడా తమ పేషంట్లకు సిఫారసు చేయాలి. పాత్రలు, కథ మన జీవితాలకు దగ్గరగా ఉంటాయి. ఇలాంటి సినిమాలను స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి చూడాలి. 'మ్యాడ్ స్క్వేర్' విడుదలయ్యాక నటీనటులు అంతా ప్రేక్షకుల కుటుంబంలో ఒకరవుతారు. తెరపై కామెడీ పండించడం అంత సులువు కాదు. నార్నె నితిన్, శోభన్, రామ్ అద్భుతంగా నటించారు. కల్యాణ్ దర్శకత్వం అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు. నాగవంశీ మాట్లాడుతూ 'మ్యాడ్ స్క్వేర్' సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులను ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తేలా ఉంటుంది. టికెట్ కోసం పెట్టిన ప్రతి రూపాయికీ న్యాయం జరిగిందని ప్రేక్షకులు భావిస్తారు' అని చెప్పారు. హారికా సూర్యదేవర మాట్లాడుతూ 'కామెడీ నేపథ్యంలో సాగే కథతో ఏకంగా ఫ్రాంఛైజీ చిత్రాలు చేస్తున్నారంటే అది మా దర్శకుడి గొప్పదనమే. ప్రచార చిత్రాల్లో కొంతే చూశారు. సినిమా మరింత అలరిస్తుంది' అని తెలిపారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెక్కిస్తున్న వినోదాత్మక చిత్రం ఇదని నార్నె నితిన్ అన్నారు. ఈ సినిమాలో కామెడీ చాలా కాలం పాటు ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని సంగీత్ శోభన్ తెలిపారు.



మేలో భూల్ ఛుక్

అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న స్పై థ్రిల్లర్ 'గూఢచారి 2'తో కథానాయికగా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు బాలీవుడ్ భామ వామికా గబ్బి. అయితే ఈ లోపులో ఓ హిందీ చిత్రంతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు వామిక. రాజ్‌కుమార్ రావుకు జోడీగా వామిక నటించిన 'భూల్ ఛుక్ మాఫ్' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ సందర్భంగా మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ రొమాంటిక్ కామెడీకి కరణ్ శర్మ దర్శకుడు. వారాణసి నేపథ్యంలో సాగే ఓ మంచి ప్రేమకథతో ముడిపడిన చిత్రమిది. 'ఛావా' చిత్రంతో ఇండస్ట్రీ హిట్ కొట్టిన మడ్డోక్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం అంచనాలను పెంచింది.

మైత్రీ సంస్థ ద్విభాషా చిత్రం



'లవ్ టుడే, డ్రాగన్' చిత్రాలతో కథానాయకుడిగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు ప్రదీప్ రంగనాథన్. ఇప్పుడు ఆయనతో ప్రముఖ టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'ప్రేమలు' చిత్రంతో యువతను మెప్పించిన మమితాబైజు ప్రదీప్‌కు జోడీగా నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. శరత్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: భరత్ విక్రమన్.

నాలో ఏదో మొదలైందని...



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సంతాన ప్రాప్తిరస్తు'. సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా 'నాలో ఏదో మొదలైందనీ.. నీ చెలిమే రుజువైందని..' అంటూ సాగే పాటను బుధవారం విడుదల చేశారు. శ్రీజో రాసిన ఈ పాటను దినకర్, అదితి పాడారు. సునీల్ కశ్యప్ స్వరాలు అందించారు. విక్రాంత్, చాందినీ చౌదరిపై ఈ పాట చిత్రీకరించారు. ఈ సందర్భంగా హీరో విక్రాంత్ మాట్లాడుతూ 'చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమాకు పని చేశాం. 'నాలో ఏదో' పాట అద్భుతంగా ఉంటుంది. ఈ పాటను మీరంతా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు.

నిర్మాత మధుర శ్రీధరరెడ్డి మాట్లాడుతూ 'మా సంస్థకు సునీల్ గుర్తుండిపోయే పాటలు ఎన్నో ఇచ్చారు. అలాగే 'నాలో ఏదో..' పాట కూడా టాప్ టెన్ ఛాట్ బస్టర్స్‌లో ఉంటుందని నా నమ్మకం' అన్నారు. 'హీరో హీరోయిన్ల లవ్‌జర్నీని చూపించే పాట ఇది. మ్యూజిక్ లవర్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. ప్రస్తుత సమాజంలోని ఒక సమస్యను తీసుకుని యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని రూపొందించాం' అని చెప్పారు దర్శకుడు సంజీవ్‌రెడ్డి.

అందులో తప్పేముంది?

- మోహన్‌లాల్



మలయాళ చిత్ర కథనాయకుడు మోహన్‌లాల్ ఇటీవల శబరిమల అయ్యప్ప క్షేత్రాన్ని సందర్శించారు. తన ఆప్త మిత్రుడు, నటుడు మమ్ముట్టి కోసం ప్రత్యేక పూజలు జరిపించారు. మమ్ముట్టి అసలు పేరు మహమ్మద్ కుట్టి కనుక ఆ పేరుతోనే మోహన్‌లాల్ పూజలు చేయించడం విమర్శలకు కారణమైంది. అలా ఎలా చేస్తారని చాలా మంది సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. దానిపై ఆయన స్పందిస్తూ అందులో తప్పేముందని ప్రశ్నించారు. 'మమ్ముట్టి కోసం పూజలు జరిపించడం నా వ్యక్తిగత విషయం. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి ఆయన గురయ్యాడు. ఇప్పుడు బాగానే ఉంది. ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అన్నారు మోహన్‌లాల్.

ఇక్కడే స్థిరపడాలని అనిపిస్తోంది

సన్నీ డియోల్



టాలీవుడ్‌లో స్థిరపడాలని ఉందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్. ఆయన హీరోగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. తెలుగు నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా సంయుక్తంగా నిర్మించాయి. ఏప్రిల్ 10న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ని ముంబైలో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సన్నీ డియోల్ మాట్లాడుతూ 'బాలీవుడ్ నిర్మాతలు టాలీవుడ్ వాళ్లని చూసి నేర్చుకోవాలి. ఎందుకంటే ఒకసారి స్క్రిప్ట్ లాక్ అయితే పూర్తిగా దర్శకుడిపైనే నమ్మకం ఉంచుతారు. టాలీవుడ్ వాళ్లతో కలసి పనిచేయడం నాకు నచ్చింది. నేను సౌత్ వాళ్లతో మరో సినిమా చేయాలనుకుంటున్నా. ఇక్కడే స్థిరపడాలని కూడా అనిపిస్తోంది' అని అన్నారు.

బిజినెస్

బ్యాంకు ఖాతాలకు ఇక నలుగురు నామినీలు

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులకు ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. ఖాతాదారులు ఇక తమ ఖాతాలకు నలుగురు వరకు నామినీలుగా నామినేట్ చేయవచ్చు. దీనికి సంబంధించిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లుకు రాజ్యసభ బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. లోక్‌సభ గత ఏడాది డిసెంబరులోనే ఈ బిల్లుకు ఆమోద ముద్ర వేసింది. ఒక వ్యక్తి బ్యాంకులో ఉంచదగినందుకు అనుమతించే 'సెక్యూర్‌డ్ మొత్తం' నిర్వచనాన్నీ ఈ బిల్లు ప్రస్తుత రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచింది.

ఏడు రోజుల లాభాలకు బ్రేక్

» సెన్సెక్స్ 729 పాయింట్ల నష్టం

ముంబై: గత వారం రోజులుగా స్టాక్ మార్కెట్‌లో కొనసాగుతున్న రిలీఫ్ ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 728.69 పాయింట్ల నష్టంతో 77,288.50 వద్ద ముగియగా నిఫ్టీ 181.80 పాయింట్ల నష్టంతో 23,486.85 వద్ద ముగిసాయి. దీంతో సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 25 కంపెనీల షేర్లు నష్టాలతో క్లోజయ్యాయి. ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైనా ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు బుధవారం సూచీలను కుంగదీశాయి. గురువారం ముగిసే వీకెండ్ టీ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్, ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వచ్చే డొనాల్డ్ ట్రంప్ సుంకాల భయాలు కూడా మార్కెట్‌ను వెంటాడాయి. అమ్మకాల ఒత్తిడి ఇలానే కొనసాగితే గురువారం నిఫ్టీకి 23,300 పాయింట్లు కీలక మద్దతు స్థాయి అవుతుందని భావిస్తున్నారు.

2,000 నగరాల్లో ఐపీటీవీ సేవలు

» ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2,000 నగరాల్లో ఇంటర్నెట్ ప్రోటోకాల్ టీవీ (ఐపీటీవీ) సేవలు ప్రారంభించినట్టు ఎయిర్‌టెల్ ప్రకటించింది. దీంతో ఖాతాదారులు ఇక సింగిల్ ప్లాన్‌తో హైస్పీడ్ ఇంటర్నెట్, 350కి పైగా టీవీ చానల్స్, వైఫై, అమెజాన్ ప్రైమ్, ఆహా, నెట్‌ఫ్లిక్స్ వంటి 29 స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ కూడా పొందవచ్చు. రూ.699 కనీస సబ్‌స్క్రిప్షన్‌తో ఎయిర్‌టెల్ ఈ ఐపీటీవీ సేవలు అందిస్తోంది. ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ ద్వారా ఈ సేవలు బుక్ చేసుకుంటే సెట్ టాప్ బాక్సుతో పాటు ఉచితంగానే ఈ సేవలను ఆస్వాదించవచ్చని తెలిపింది. ప్రస్తుతం ఢిల్లీ, రాజస్థాన్, ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం ఈ సేవలు లభించవు. ఈ ప్రాంతాల్లో కూడా వచ్చే కొద్ది వారాల్లోనే తమ సేవలు ప్రారంభమవుతాయని తెలిపింది. దీంతో కేబుల్ టీవీ, డీటీహెచ్ కంపెనీలకు భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. జియో కూడా త్వరలో ఇదే బాట పడుతుందని సమాచారం.

భారత్‌కు కుబేరులు బై బై!

22% మంది వలస యోచన

కోటక్ ప్రైవేట్-ఈవై సర్వే నివేదిక



ముంబై: భారత కుబేరుల్లో కనీసం 22 శాతం మంది దేశం వీడాలనుకుంటున్నారట. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో స్థిరపడాలను కుంటున్నారు. గోల్డెన్ వీసా స్కీమ్ ఆఫర్ చేస్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వలస పోయేందుకు కూడా మొగ్గు చూపుతున్నారు. దేశీయంగా జీవన స్థితిగతులు అంత అనుకూలంగా లేకపోవడంతో పాటు ఇతర దేశాల్లో మెరుగైన జీవన ప్రమాణాలు, సులభతర వ్యాపార వాతావరణం వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణమని ప్రముఖ వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల కంపెనీ కోటక్ ప్రైవేట్, అంతర్జాతీయ కన్సల్టింగ్ సేవల కంపెనీ 'ఈవై'తో కలిసి చేపట్టిన సర్వేలో వెల్లడైంది. 150 మంది అత్యంత సంపన్నుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం, ఏటా 25 లక్షల మంది భారతీయులు ఇతర దేశాలకు వలసపోతున్నారని ఆ నివేదికలో తెలిపారు. సర్వే ఇతర ప్రధానాంశాలు...

● ప్రతి ఐదుగురు అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిజువల్స్‌లో (యూహెచ్ఎన్ఐ) ఒకరు దేశం వీడే ఆలోచనలో ఉన్నారు. అయితే, భారత పౌరసత్వం కొనసాగిస్తూనే తమకు నచ్చిన దేశంలో ఉండిపోవాలనుకుంటున్నారు.

● మెరుగైన జీవన, విద్యా ప్రమాణాలు, ఆరోగ్య సేవల కారణంగా మన శ్రీమంతులు ఇతర దేశాల వైపు ఆకర్షితులవుతున్నారు. సాఫీగా వ్యాపారం చేసుకొనేందుకు వాతావరణం మరో ప్రధాన కారణమని సర్వేలో పాల్గొన్న మూడింట రెండొంతుల మంది తెలిపారు.

● తమ వలస నిర్ణయాన్ని భవిష్యత్‌పై పెట్టుబడిగా వారు భావిస్తున్నారు. తమ పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న కారణంగానూ వారు వలస పోవాలనుకుంటున్నారు.

● పారిశ్రామికవేత్తలు, వారసత్వంగా సంపద లభించిన వారితో పోలిస్తే వృత్తి నిపుణులు ఇతర దేశాల్లో స్థిరపడేందుకు అధికంగా మొగ్గు చూపుతున్నారు. వయసు పరంగా చూస్తే, 36-40 ఏళ్ల వారితోపాటు 61 ఏళ్లకు పైబడిన శ్రీమంతులు ఇందుకు అధిక ఆసక్తి కనబరిచారు.

● శ్రీమంతుల వలసలను మూలధన తరలింపుగా చూడవద్దని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రెసిడెంట్ గౌతమి గవాంకర్ అన్నారు. దేశంలోని నివసిస్తున్న భారత పౌరులు ఏటా 2.50 లక్షల డాలర్ల (రూ.2.15 కోట్లు) వరకే బయటి దేశాలకు తరలించగలరు. ప్రవాస భారతీయులు మాత్రం గరిష్ఠంగా 10 లక్షల డాలర్లు (రూ.8.57 కోట్లు) వరకు తీసుకెళ్లవచ్చన్నారు.

నిస్సాన్ నుంచి 2 కొత్త కార్లు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్కెట్లోకి



గురుగ్రామ్: జపాన్ కార్ల కంపెనీ నిస్సాన్.. భారత మార్కెట్లోకి 2 కొత్త కార్లను ప్రవేశపెట్టబోతోంది. అందులో 7 సీట్ల సామర్థ్యంతో కూడిన బీ-ఎంపీవీ (మల్టీ పర్పస్ వెహికిల్) కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26) తొలినాళ్లలో అందుబాటులోకి తేనున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఆ తర్వాత 5 సీట్ల సామర్థ్యంతో కూడిన కాంపాక్ట్ ఎస్‌యూవీని విడుదల చేస్తామని పేర్కొంది. దేశీయ మార్కెట్లో విడుదల చేయనున్న ఈ రెండు కొత్త కార్లను కంపెనీ జపాన్‌లోని యోకోహామాలో ఈ మధ్యనే నిర్వహించిన గ్లోబల్ ప్రొడక్ట్ షోకేస్ ఈవెంట్‌లో ప్రదర్శించింది. నిస్సాన్ ప్రస్తుతం మాగ్నైట్, ఎక్స్-ట్రయల్ మోడళ్లను మన మార్కెట్లో విక్రయిస్తోంది.

కియా ఈవీ6 సరికొత్తగా..

ధర రూ. 65.9 లక్షలు



న్యూఢిల్లీ: కియా ఇండియా సరికొత్త హంగులతో కూడిన ఈవీ6 ఆధునిక వెర్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.65.9 లక్షలు. 27 అత్యాధునిక భద్రత, 5 కొత్త అటానమస్ ఫీచర్లతో మరింత ఆధునీకరించిన అడాస్ 2.0 ప్యాకేజీతో ఈ కారు అందుబాటులోకి వచ్చింది. పూర్తి చార్జింగ్‌తో 663 కి.మీ వరకు ప్రయాణించగలిగేందుకు 84 కిలోవాట్ బ్యాటరీని కంపెనీ ఆఫర్ చేస్తోంది. కారు ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ డిజైన్‌ను మరింత ఆకర్షణీయంగా మలచడంతో పాటు అధునిక, స్మార్ట్ ఫీచర్లను జోడించినట్టు కంపెనీ వెల్లడించింది.

'జేపీఎల్'పై అదానీ గ్రూప్ ఆసక్తి

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ మరో కొనుగోలుకు సిద్ధమవుతోంది. దివాలా ప్రక్రియలో ఉన్న జైప్రకాశ్ గ్రూప్ కంపెనీ జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్) కొనుగోలు కోసం ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ సమర్పించింది. అయితే అదానీ గ్రూప్ ఎంత మొత్తానికి ఈ బిడ్ సమర్పించింది వెల్లడి కాలేదు. జేఏఎల్ కంపెనీకి సిమెంట్, విద్యుత్, హోటల్స్, నిర్మాణ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయి. జేఏఎల్ కొనుగోలు ఈ రంగాల్లో పట్టు మరింత పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని అదానీ గ్రూప్ భావిస్తోంది. తమ రుణాలు చెల్లించలేక పోవడంతో రుణదాతలు జేఏఎల్‌పై గత ఏడాది జూన్‌లో ఎన్‌సీఎల్‌టీ, అలహాబాద్ బెంచ్‌లో దివాలా పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నాటికి జేఏఎల్ రుణదాతలకు దాదాపు రూ.55,493 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఖర్ఖోడాలో మారుతి మూడో ప్లాంట్

రూ.7,410 కోట్ల పెట్టుబడికి బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ: హర్యానాలోని ఖర్ఖోడాలో మారుతి సుజుకీ మూడో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఏడాదికి 2.5 లక్షల కార్ల తయారీ సామర్థ్యం గల ఈ ప్లాంట్‌పై రూ.7410 కోట్లు పెట్టుబడికి కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్టు రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలియచేసింది. 2.5 లక్షల ఉత్పత్తి సామర్థ్యం గల మరో ప్లాంట్ ఇప్పటికే నిర్మాణంలో ఉన్నట్టు తెలిపింది. ఖర్ఖోడా ప్లాంట్ ఏర్పాటుతో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.5 లక్షలకు చేరుతుంది. 2029 నాటికి ఈ సామర్థ్యం సాధించగలుగుతామని కంపెనీ వెల్లడించింది. అంతర్గత సమీకరణల ద్వారానే ఈ పెట్టుబడులు సమకూర్చుకుంటామని కంపెనీ తెలిపింది. ఎగుమతి మార్కెట్ సహా దేశీయ డిమాండును తీర్చడానికి ఈ ప్లాంట్ దోహదపడుతుందని పేర్కొంది.

టెక్ మి 2 స్పేస్‌తో హైలెనర్ ఎంఓయూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ హై లెనర్ టెక్నాలజీస్ అంతరిక్ష టెక్నాలజీలో అగ్రగామి అయిన టెక్ మి2స్పేస్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో అంతరిక్ష ప్రయోగాలకు అవసరం అయిన లెనర్ టెక్నాలజీతో పని చేసే కృత్రిమ మేధస్సు అభివృద్ధి చేసి, పరీక్షిస్తారు. ఇందుకు అనుగుణంగా హైలెనర్‌కు చెందిన లెనర్ ఆధారిత థర్డ్ ఎంటీక్ జెనరేటర్‌ను పరీక్షించేందుకు అవసరం అయిన ఉపగ్రహ వ్యవస్థలను టెక్ మి2స్పేస్ తయారుచేస్తుందని ఆ కంపెనీలు ఒక ప్రకటనలో తెలిపాయి.

2025-26లో ఎంపీసీ షెడ్యూల్ ఇదే

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య విధాన ద్వైమాసిక సమావేశాల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం, తదుపరి ఎంపీసీ సమావేశం ఏప్రిల్ 7-9 తేదీల మధ్యన జరుగుతుంది. సమావేశాల షెడ్యూల్ ఇలా ఉంది..

సమావేశాలు	తేదీలు
తొలి సమావేశం	ఏప్రిల్ 7-9
రెండో సమావేశం	జూన్ 4-6
మూడో సమావేశం	ఆగస్టు 5-7
నాలుగో సమావేశం	సెప్టెంబరు 29-అక్టోబరు 1
ఐదో సమావేశం	డిసెంబరు 3-5
ఆరో సమావేశం	2026 ఫిబ్రవరి 4-6

(సమావేశాల ముగింపు రోజున ఆర్‌బీఐ గవర్నర్ ద్రవ్య విధానంపై ఎంపీసీ నిర్ణయాలు ప్రకటిస్తారు)

తెలుగు రాష్ట్రాల్లో 20 కొత్త శాఖలు

» 2025-26లో రూ.4,000 కోట్ల రుణాలు

» ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ తెలుగు రాష్ట్రాల్లో తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) తెలంగాణలో 10, ఆంధ్ర ప్రదేశ్‌లో 10 కొత్త శాఖలు ఏర్పాటు చేయనుంది. ఈ శాఖల్ని రెండు రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఏర్పాటు చేస్తామని కంపెనీ జోనల్ సేల్స్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. కంపెనీకి ఇప్పటికే తెలంగాణలో 42, ఆంధ్ర ప్రదేశ్‌లో 50 శాఖలున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం రెండు రాష్ట్రాల్లోని శాఖల ద్వారా స్థిరాస్తి రంగానికి గృహ, మార్ట్‌గేజ్, ప్రాజెక్టు రుణాల రూపంలో రూ.2,400 కోట్లు మంజూరు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఈ మొత్తాన్ని రూ.4,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శ్రీనివాస్ చెప్పారు. రుణ దరఖాస్తులను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో ప్రాసెస్ చేసి ఆన్‌లైన్ వారికి ఆర గంటలోనే సూత్రప్రాయ ఆమోదం తెలపడం తమ సంస్థ ప్రత్యేకత అన్నారు. రుణాల విడుదల కూడా వారం రోజుల్లోనే పూర్తవుతుందన్నారు. దరఖాస్తుదారుల పరపతి స్కోరును బట్టి తమ రుణాలపై 8.25-13 శాతం వడ్డీరేటు ఉంటుందని శ్రీనివాస్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27న ధర



హైదరాబాద్	405	విజయవాడ	415
వరంగల్	407	గోదావరి	407
చిత్తూరు	470	విశాఖపట్నం	410
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	110
వరంగల్	104	గుంటూరు	113
కరీంనగర్	104	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	95
కర్నూలు	104	నెల్లూరు	100
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	110		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,400	81,950	1,11,000
విజయవాడ	90,500	85,000	1,00,200
విశాఖపట్నం	88,200	80,850	1,02,000
రాజమండ్రి	89,400	81,950	1,01,500
ప్రొద్దుటూరు	89,950	83,290	1,00,500
ముంబై	87,790	80,420	98,790

ఐపీఎల్‌లో నేడు

వేదిక హైదరాబాద్

హైదరాబాద్ x లఖ్‌నవూ రా.7.30

స్పోర్ట్స్

క్వింటన్.. మెరిసెన్!

విజయోత్సాహంలో సన్‌రైజర్స్

పంత్‌పై భారీ అంచనాలు



అభిషేక్-పంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తొలి మ్యాచ్‌లో సొంతగడ్డ హైదరాబాద్‌లో మన విజయం సాధించి సీజన్‌ను అద్భుతంగా ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో పోరుకు సమరోత్సాహంతో బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్ సెంచరీ వీరుడు ఇషాన్ కిషన్, హెడ్, క్లాసెన్, అభిషేక్ శర్మ, నితీశ్‌కుమార్ రెడ్డిలతో ఎస్ఆర్‌హెచ్ బ్యాటింగ్ లైనప్ అరవీర భయంకరంగా ఉంది. లఖ్‌నవూ విషయానికొస్తే కొత్త కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్యంలో ఆ జట్టు తొలి మ్యాచ్‌లో పరాజయాన్ని చవి చూడడం తెలిసిందే. పంత్ కెప్టెన్సీతో పాటు అతడి బ్యాటింగ్ సామర్థ్యానికి కూడా ఉప్పల్‌లో ఎస్ఆర్‌హెచ్ దళపతి కమిన్స్ నుంచి సవాల్ ఎదురు కానుంది. లఖ్‌నవూ బ్యాటర్లలో డేవిడ్ మిల్లర్, నికోలస్ పూరన్, మార్క్రమ్, మార్ష్ వెంటనే గత ఉప్పల్‌లో బౌలర్లకు నిత్యం మోత తప్పదు. ఈ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన జట్టుకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.


రాణించిన నీషమ్, సీఫెర్ట్

చివరి టీ20లో పాక్ పరాజయం



వెల్లింగ్టన్: పేసర్ జేమ్స్ నీషమ్ (5/22) ఐదు వికెట్లు, ఓపెనర్ సీఫెర్ట్ (38 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 97 నాటౌట్) దనాదన్ ఇన్నింగ్స్‌తో మెరవడంతో చివరి టీ20లో న్యూజిలాండ్ 8 వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో.. నీషమ్ ధాటికి తొలుత పాకిస్థాన్ 20 ఓవర్లలో 128/9 స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ సల్మాన్ అఘా (51), షాదాబ్ ఖాన్ (28) మాత్రమే రాణించారు. డఫీ (2/18) రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో సీఫెర్ట్ సునామీ ఇన్నింగ్స్‌తో కేవలం 10 ఓవర్లలోనే 131/2 స్కోరు చేసి న్యూజిలాండ్ నెగ్గింది.

రోహిత్, కోహ్లీ ఆ గ్రేడ్‌లో ఉంటారా ?



న్యూఢిల్లీ: 2024-25 సీజన్‌కు సంబంధించి పురుషుల సెంట్రల్ కాంట్రాక్టుల జాబితాను బీసీసీఐ త్వరలో వెల్లడించనుంది. ఈసారి దీనిలో ఆ జాబితాలో ఉండే క్రికెటర్లపై ఉత్కంఠ ఏర్పడింది. గత ఏడాది చోటు దక్కించుకోలేకపోయిన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లకు ఈసారి అవకాశం లభించవచ్చు. అలాగే అర్ష్‌దీప్ శర్మకు కూడా ఈ ఏడాది స్థానం కల్పిస్తారని తెలిసింది. టీ20ల నుంచి రిటైరైన ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజాలకు ఈసారి గ్రేడ్-ఎ+లో చోటుపై సందేహాలు నెలకొన్నాయి. బీసీసీఐ నిబంధనల ప్రకారం గ్రేడ్-ఎ+లో ఉండాలంటే టెస్టులు, వన్డేలు, టీ20లలో ఆడుతుండాలి. నిరుడు గ్రేడ్-ఎలో ఆరుగురు క్రికెటర్లు, గ్రేడ్-బిలో ఐదుగురు, గ్రేడ్-సిలో 15 మంది ఆటగాళ్లకు బీసీసీఐ చోటు కల్పించింది.



డికాక్ (61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సులతో 97 నాటౌట్)

కోల్‌కతా బోణీ

8 వికెట్లతో రాజస్థాన్ చిత్తు

గువాహటి: క్లిష్టమైన పిచ్‌పై క్వింటన్ డికాక్ (61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 97 నాటౌట్) సత్తాచాటడంతో.. డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఖాతా తెరిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 8 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 151/9 స్కోరు చేసింది. ధ్రువ్ జురెల్ (33), యశస్వీ జైస్వాల్ (29), రియాన్ పరాగ్ (25) టాప్‌స్కోరర్లు. వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో కోల్‌కతా 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (22 నాటౌట్) రాణించాడు. డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సునాయాసంగా..

ఓపెనర్ డికాక్ ఆఖరికంటా క్రీజులో నిలవడంతో.. మ్యాచ్ పూర్తిగా ఏకపక్షమైంది. రఘువంశీతో కలిసి డికాక్ మూడో వికెట్‌కు 83 పరుగులు అజేయ భాగస్వామ్యం నెలకొల్పడంతో..

మరో 15 బంతులు మిగిలుండగానే నైట్‌రైడర్స్ గెలుపు గీత దాటింది. ఛేదనలో డికాక్, మొయిన్ అలీ (5) శుభారంభం అందించారు. ముఖ్యంగా డికాక్ పసలేని రాజస్థాన్ బౌలింగ్‌ను ఆడేసుకున్నాడు. అయితే, ఏడో ఓవర్లో లేని పరుగు కోసం ప్రయత్నించిన అలీ రనౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మధ్య ఓవర్లలో కెప్టెన్ రహానె (18)తో కలిసి డికాక్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు నైట్‌రైడర్స్ 70/1 స్కోరు చేసింది. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో హసరంగ బౌలింగ్‌లో రహానె క్యాచవుట్ అయినా.. సిక్సర్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకున్న డికాక్ దూకుడు పెంచాడు. మరోవైపు రఘువంశీ చక్కని సహకారం అందించడంతో.. సాధించాల్సిన రన్‌రేట్ తగ్గుతూ వచ్చింది. 18 బంతుల్లో 17 పరుగులు కావల్సి ఉండగా.. ఆర్చర్ బౌలింగ్‌లో డికాక్ ఫోర్, రెండు సిక్సర్లతో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. కానీ, సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచిపోయాడు.

రాణించిన స్పిన్నర్లు

కోల్‌కతా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో.. తడబడిన రాజస్థాన్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్‌కు ఓపెనర్లు జైస్వాల్, సంజూ



వరుణ్ (2/17)

శాంసన్ (13) నిలకడైన ఆరంభాన్నిచ్చారు. తొలి ఓవర్‌లోనే వీరిద్దరూ చెరో బౌండ్రీతో ఖాతాలు తెరిచారు. ఆ తర్వాతి ఓవర్‌లో జాన్సన్ బౌలింగ్‌లో జైస్వాల్ 4, 6తో దూకుడు పెంచాడు. కానీ, వేగంగా ఆడే ప్రయత్నం చేస్తున్న శాంసన్‌ను అరోరా అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ పరాగ్, మరో ఓపెనర్ జైస్వాల్‌తో కలిసి రెండో వికెట్‌కు 34 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. పరాగ్ మూడు సిక్సర్లతో జోరు చూపడంతో పవర్‌ప్లేను రాజస్థాన్ 54/1తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు వరుణ్, మొయిన్ ఎంట్రీతో రాజస్థాన్ టపటపా వికెట్లు చేజార్చుకొంది. రెండు పరుగుల తేడాతో పరాగ్, జైస్వాల్ పెవిలియన్ చేరారు. వరుస బంతుల్లో హసరంగ, రాణా అవుట్ చేయగా.. జైస్వాల్‌ను మొయిన్ పెవిలియన్ చేర్చాడు. హసరంగ (4), నితీశ్ రాణా (8) కూడా స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో ఆరో వికెట్‌కు 28 పరుగులు జోడించిన జురెల్, శుభమ్ దూబే (9) టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించారు. అయితే, దూబేను అరోరా వెనక్కిపంపాడు. చివరి ఓవర్లలో జురెల్, హెట్‌మయర్ (7)ను హర్షిత్ అవుట్ చేశాడు. కానీ, జోఫ్రా ఆర్చర్ (16) రెండు సిక్సర్లు బాదడంతో.. టీమ్ స్కోరు కష్టంగా 150 దాటింది.

స్కోరుబోర్డు

రాజస్థాన్ రాయల్స్: జైస్వాల్ (సి) హర్షిత్ (బి) మొయిన్ 29, శాంసన్ (బి) అరోరా 13, పరాగ్ (స్టంప్డ్) డికాక్ (బి) వరుణ్ 25, నితీశ్ రాణా (సి) (బి) మొయిన్ 8, హసరంగ (సి) రఘువంశీ (బి) వరుణ్ 4, జురెల్ (బి) హర్షిత్ 33, శుభమ్ దూబే (సి) రస్సెల్ (బి) అరోరా 9, హెట్‌మయర్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 7, ఆర్చర్ (బి) జాన్సన్ 16, తీక్షణ (నాటౌట్) 1, దేశ్‌పాండే (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 151/9; వికెట్ల పతనం: 1-33, 2-67, 3-69, 4-76, 5-82, 6-110, 7-131, 8-138, 9-149; బౌలింగ్: స్పెన్సర్ జాన్సన్ 4-0-42-1, వైభవ్ అరోరా 4-0-33-2, హర్షిత్ రాణా 4-0-36-2, మొయిన్ అలీ 4-0-23-2, వరుణ్ చక్రవర్తి 4-0-17-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్: మొయిన్ అలీ (రనౌట్-తీక్షణ/పరాగ్) 5, డికాక్ నాటౌట్ 97, రహానె (సి) తుషార్ (బి) హసరంగ 18, రఘువంశీ (నాటౌట్) 22, ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 17.3 ఓవర్లలో 153/2; వికెట్ల పతనం: 1-41, 2-70; బౌలింగ్: ఆర్చర్ 2.3-0-33-0, తీక్షణ 4-0-32-0, రియాన్ పరాగ్ 4-0-25-0, సందీప్ శర్మ 2-0-11-0, హసరంగ 3-0-34-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 1-0-7-0.

భారత్‌లో 14 ఏళ్ల తర్వాత అర్జెంటీనా జట్టు పర్యటన



న్యూఢిల్లీ: మెస్సీ అభిమానులకు అదిరిపోయే వార్త. 14 ఏళ్ల తర్వాత తొలిసారి అర్జెంటీనా జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ అక్టోబరులో కొచ్చిలో జరుగనుంది. లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా జట్టు ఆటగాళ్లందరూ పాల్గొనే అవకాశం ఉంది. 2011 సెప్టెంబరులో కోల్‌కతాలో వెనెజులాతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో మెస్సీ.. అభిమానులను అలరించాడు. ఆ మ్యాచ్‌లో అర్జెంటీనా 1-0తో విజయం సాధించింది.

సెపక్‌తక్రా జట్టుకు ప్రధాని అభినందన

న్యూఢిల్లీ: 'సెపక్‌తక్రా వరల్డ్ కప్ రెగూ విభాగంలో స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల జట్టును ప్రధాని మోదీ అభినందించారు. పురుషుల జట్టు ఫైనల్లో 2-1తో జపాన్‌ను ఓడించి తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. మొత్తంగా పురుషులు, మహిళల వివిధ విభాగాల్లో కలిపి భారత్ ఏడు పతకాలు సొంతం చేసుకుంది.

అంతా పంత్ వల్లే..

లఖ్‌నవూ ఓటమిపై సెహ్వాగ్



న్యూఢిల్లీ: కెప్టెన్ రిషభ్ పంత్ నిర్లక్ష్యంవల్లే ఢిల్లీ క్యాపిటల్స్‌తో విశాఖపట్నంలో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఓడిపోయిందని టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శించాడు. ఇక ఢిల్లీ విజయానికి చివరి ఆరు బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన తరుణంలో.. టెయిలెండర్ మోహిత్ శర్మను సునాయాసంగా స్టంపింగ్ చేసే అవకాశాన్ని పంత్ చేజార్చాడు. లేదంటే ఆ మ్యాచ్ లఖ్‌నవూ గెలిచి ఉండేది. 'మ్యాచ్ ఆఖరుకు ఆటగాళ్ల గురించి పంత్ ఆలోచించాలి. ఏ బౌలర్‌ను ఏ సమయంలో బౌలింగ్‌కు దింపాలనే విషయాన్ని పంత్ మరిచాడు. మొత్తంగా మ్యాచ్‌పై పంత్ నియంత్రణ సాధించలేకపోయాడు' అని సెహ్వాగ్ విశ్లేషించాడు.



వరల్డ్‌కప్‌నకు అర్జెంటీనా క్వాలిఫై

బ్రెజిల్‌పై 4-1తో గెలుపు

బ్యూనస్ ఎయిర్స్: డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా.. 2026 ఫిఫా వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. బుధవారం జరిగిన దక్షిణ అమెరికా క్వాలిఫయర్స్‌లో మెస్సీ గైర్హాజరీలో అర్జెంటీనా 4-1తో బ్రెజిల్‌ను చిత్తు చేసింది. అయితే, ఈ మ్యాచ్ ఫలితం కంటే ముందే మెగా టోర్నీ ప్రధానటోర్నీకి అర్హత సాధించింది. బొలీవియా-ఉరుగ్వే మ్యాచ్ 0-0తో డ్రాగా ముగియడంతో అర్జెంటీనాకు బెర్త్ ఖాయమైంది. దీంతో బ్రెజిల్‌తో మ్యాచ్‌లో సమరోత్సాహంతో అర్జెంటీనా విరుచుకుపడింది. కాగా, 48 జట్లు పాల్గొననున్న ఫిఫా వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యదేశాలుగా అమెరికా, కెనడా, మెక్సికో అర్హత సాధించాయి. జపాన్, ఇరాన్, న్యూజిలాండ్‌తోపాటు తాజాగా అర్జెంటీనా కూడా క్వాలిఫై అయింది.



రేపటి నుంచి ఎండల తీవ్రత

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండల తీవ్రత శుక్రవారం నుంచి మరింతగా పెరగనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41-42 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, నిర్మల్, ములుగు, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, నల్గొండ, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 40-42 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారామపురంలో అత్యధికంగా 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విపక్షాలను అవమానించేలా లోక్‌సభ స్పీకర్ తీరు

- రాహుల్ మాట్లాడే సమయంలోనే సభ వాయిదా వేశారు
- ఇది ముమ్మాటికీ లోక్‌సభను అగౌరవపరచడమే: చామల

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో విపక్షాలను అవమానపరిచేలా స్పీకర్ వ్యవహరిస్తున్నారని, ఈ ధోరణి సరికాదని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అధికార, విపక్షాలను సమదృష్టితో చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందన్నారు. విపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడేందుకు సిద్ధమవుతుండగానే స్పీకర్ సభను వాయిదా వేశారని, ఇది ముమ్మాటికీ లోక్‌సభను అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల వ్యవహార శైలి సరిగాలేదని, కేటీఆర్‌కు మైక్ దొరికితే మైక్ టైసన్‌లా మారిపోతున్నారని మండిపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణపై తామెప్పుడూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని, అందులో జరిగిన అవినీతిపై మాత్రమే మాట్లాడమని స్పష్టతనిచ్చారు.

విజయ దశమి నుంచి సంఘ్ శతాబ్ది ఉత్సవాలు

- ఆరెస్సెస్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) శతాబ్ది ఉత్సవాలను వచ్చే విజయ దశమి నుంచి ఏడాది పాటు నిర్వహించనున్నట్లు సంస్థ తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘ్ భావజాలం, సిద్ధాంతాలను సమాజంలోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని 1,839 ప్రాంతాల్లో 3,117 శాఖలున్నాయని చెప్పారు. విజయదశమిన రాష్ట్రవ్యాప్తంగా రూట్‌మార్చ్, శోభాయాత్ర నిర్వహిస్తామని బుధవారం కేశవ నిలయంలో మీడియాతో రమేశ్ తెలిపారు. సంఘ్ నూరేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సంఘ్ ఆలోచనలు, భావాలను సమాజంలోకి తీసుకెళ్లేలా వచ్చే నవంబరు-డిసెంబరు-జనవరి నెలల్లో ప్రతి గ్రామం, ఇంటికి వెళ్లేలా జన సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

డ్రగ్స్ కేసులో నిందితుల ఖాతాల్లోని 42 లక్షలు సీజ్

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో అరెస్టయిన నిందితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.42 లక్షలను సీజ్ చేశామని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) ప్రకటించింది. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని పుణెకు కారులో మత్తుమందులు తరలిస్తున్న ఓ వ్యక్తిని 2023 అక్టోబరు 4న ముత్తంగి సమీపంలో ఎన్‌సీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 25 కిలోల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. అతను తరలిస్తున్న మత్తు మందు.. అల్ప్రాజోలంను తెలంగాణలోని రెండు ల్యాబ్‌ల్లో తయారు చేసినట్టు ఎన్‌సీబీ విచారణలో తేలింది. ఈ క్రమంలో ఆయా ల్యాబొరేటరీలపై దాడి చేసిన ఎన్‌సీబీ అధికారులు వాటిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులకు సంబంధించిన 8 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.42,25,440ను సీజ్ చేశారు.

403 గజాలకు రూ. 20.50 కోట్లు

- ఎల్ఆర్ఎస్ చార్జి చూసి కంగుతిన్న యజమాని
- మరో 400 గజాలకు రూ. 20.34 కోట్లు
- జడ్చర్ల మునిసిపాలిటీలో ఘటన

జడ్చర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) చార్జీలు కోట్లలో రావడంతో సదరు ప్లాటు యజమాని కంగుతిన్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. జడ్చర్ల మునిసిపాలిటీలోని సర్వే నెంబరు 108లోని 400 గజాల స్థలానికి 25 శాతం రిబేటుతో రూ.20,34,29,503 రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించాలంటూ ఫీ ఇంటిమేషన్ లెటర్‌లో పొందుపరిచారు. అలాగే అదే సర్వే నెంబరులోని మరో 403 గజాల స్థలానికి చెందిన మరో ప్లాటుకు సంబంధించి 25 శాతం రిబేటుతో రూ. 20,50,06,090 రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించాలంటూ ఇంటిమేషన్ లెటర్‌ను జారీ చేశారు. సాంకేతిక సమస్యనా లేక మరే ఇతర కారణమా అనేది తెలియక యజమాని ఆందోళనకు గురయ్యారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా సాంకేతిక సమస్యతో ఉంటుందన్నారు. మునిసిపాలిటీ కార్యాలయానికి ప్లాట్ల రిజిస్ట్రేషన్ పేపర్లు తీసుకువచ్చి సంప్రదిస్తే రివైజ్ చేయిస్తామన్నారు. నిజానికి తమ 200 గజాల రెండు ప్లాట్‌లను ఇంటిమేషన్ లెటర్‌లో 400 గజాల రెండు ప్లాట్‌లుగా అధికారులు తప్పుగా చూపారని యజమాని వాపోయారు.

చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ దాసరి వెంకటరమణకు సాహిత్య అకాడమీ అవార్డు



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ డాక్టర్ దాసరి వెంకటరమణకు అరుదైన గౌరవం దక్కింది. 2014లో ఆయన రాసిన ఆనందం అనే కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. ఇదే కథల సంపుటిని షోలాపూర్‌కు చెందిన బుధారం రేణుక 'ఆనంద' పేరుతో మరాఠీలోకి అనువాదం చేశారు. కథల సంపుటిలోని ఆనంద అనే మొదటి కథను మహారాష్ట్రలోని షోలాపూర్ విశ్వవిద్యాలయంలో బీఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఈ ఏడాది ఎంపిక చేశారు. ఈ పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ఇటీవల 24 భారతీయ భాషల్లోకి కూడా అనువదించినట్లు డాక్టర్ దాసరి వెంకటరమణ తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈయన రచించిన వేగుచుక్క అనే కథను 12వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా, పల్లెకు పోదాం అనే కథను 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చింది. వెంటరమణ ఇటీవలే చందమామ కథలు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

9వ తరగతి విద్యార్థిపై పోక్సో కేసు

- స్నేహితురాళ్ల ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్
- వ్యక్తిగత ఫొటోలు షేర్ చేస్తూ వేధింపులు
- బాలుడికి మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులు, కౌన్సిలర్‌పైనా కేసు

ప్రొద్దుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తన తోటి విద్యార్థినుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను హ్యాక్ చేసి, వారిని వేధిస్తున్న 9వ తరగతి విద్యార్థిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. స్కూల్లో తనతో చదువుకొంటున్న ఐదుగురు ఆడపిల్లల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను హ్యాక్ చేశాడు. వారి వ్యక్తిగత ఫొటోలను, మెసేజ్‌లను ఇతర క్లాసుల మగపిల్లల మొబైల్ నంబర్లకు పంపి కొన్ని నెలలుగా వేధిస్తున్నాడు. ఆడపిల్లలను వేధిస్తున్న విషయం తెలుసుకొన్న స్కూల్ టీచర్లు నాలుగు రోజుల క్రితం సదరు విద్యార్థిని తీవ్రంగా మందలించి, కొట్టారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు అసలు విషయం పోలీసులకు చెప్పకుండా స్కూల్లో టీచర్ దారుణంగా కొట్టాడని రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో వేధింపులకు గురైన ఆడపిల్లల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆ విద్యార్థి, తమ పిల్లలను వేధించిన వైనంపై ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రొద్దుటూరు ఎంఈవో సావిత్రమ్మ, రూరల్ సీఐ బాలమద్దిలేటి... స్కూల్లో జరిగిన సంఘటనలపై విచారించారు. సదరు విద్యార్థి, విద్యార్థినులను వేధించినది వాస్తవమేనని నిర్ధారించారు. దీంతో బుధవారం రాత్రి ఆ విద్యార్థితో పాటు అతనికి మద్దతుగా నిలబడిన తల్లిదండ్రులు మూలే కొండమ్మ, మాధవరెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

ఉప ఎన్నిక వచ్చినప్పుడే రేషన్ కార్డులిచ్చారు

- గత పాలకులతో పేదలకు అన్యాయం
- ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం
- కార్డు లేకున్నా అర్హుల్లో పేరుంటే చాలు
- త్వరలో మరికొన్ని వస్తువులు: ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గత పాలకులు ఉప ఎన్నికలు వచ్చినప్పుడే తెల్ల రేషన్ కార్డులు ఇచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో పేదలకు అన్యాయం చేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక పౌర సరఫరాల శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని, 30 లక్షల కార్డులు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. బుధవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానం ఇచ్చారు. రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు త్వరలో మరికొన్ని వస్తువులు కూడా అందించనున్నామని తెలిపారు. ఉగాది నుంచి ప్రారంభించబోయే సన్న బియ్యం పంపిణీని రేషన్ కార్డు లేని వారికి కూడా ఇస్తామని చెప్పారు. కార్డు లేకపోయినా ప్రభుత్వం ఎంపిక చేసిన అర్హుల జాబితాలో పేరు ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ ప్రాంతం వారైనా ఎక్కడి నుంచైనా రేషన్ షాపుల్లో వస్తువులు తీసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నామని చెప్పారు. దేశంలో ఆహార భద్రత పథకం కింద సన్నబియ్యాన్ని అందించే రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. పదేళ్లగా దేవాదుల ప్రాజెక్టు తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. తమ ప్రభుత్వం దానిపై దృష్టి సారించిందని, రెండ్రోజుల్లో కొన్ని పంపులను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై అధ్యయనం చేస్తున్నామని, అవి పూర్తవ్వగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ నివేదిక వచ్చిందని, న్యాయ విచారణ కమిషన్ నివేదిక, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నుంచి నివేదిక రావాల్సి ఉందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నుంచి ప్రాథమికంగా తెలిసిన వివరాల ప్రకారం ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్న నిర్మాణ శైలికి, ఆ తరువాత చేపట్టిన నిర్మాణ శైలికి మార్పులు ఉన్నట్టు తెలిసిందన్నారు. పూర్తి నివేదిక వచ్చాక అన్ని వివరాలు సమగ్రంగా తేలతాయని, తప్పులు ఎవరు చేశారన్నది తేలితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు మార్చాలని సీడబ్ల్యూసీ ఎలాంటి లేఖా ఇవ్వలేదన్నారు. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. గ్రామాల్లో అప్పులు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో 15 నెలల్లో 24 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నట్లు తెలిస్తే తామే ముందుండి పోరాడతామని చెప్పారు.

కేటీఆర్.. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు

మేం ఓ బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం.. మీలా అడ్డగోలుగా దోచుకోవడానికి రాలేదు

- బీఆర్ఎస్ పాపాల వల్లే బిల్లుల పెండింగ్
- మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి
- భట్టి దళితుడనే ఆరోపణలు: పొన్నం
- 30 % కమీషన్లు తీసుకుంటున్నారన్న కేటీఆర్ వ్యాఖ్యలపై అట్టుడికిన సభ





హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): "ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు... మీ హయాంలో రూ.లక్ష కోట్ల పనులు చేయించి, బిల్లులు చెల్లించకుండా పోయారు. బీఆర్ఎస్ పాపం వల్లే బిల్లులన్నీ పెండింగ్‌లో పడ్డాయి. బిలుల్ల మంజూరు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించు... లేకుంటే ఈ సభకు క్షమాపణ చెప్పు... గుడ్డిగా ఆరోపణలు చేస్తే ఊరుకోం... బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం. మీలాగా అడ్డగోలుగా దోచుకోవడానికి రాలేదు... అడ్డగోలు పనులు చేసి, సర్వ నాశనం చేసి, రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగించారు"అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. శాసనసభలో బుధవారం బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "మంత్రులకు సంయమనం ఉండాలి. ఉద్రేకానికి గురైతే ఎలా? మేము కూడా రెచ్చగొట్టగలం. 30 శాతం కమీషన్ (తీసుకుంటున్నారు) అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20శాతం కమీషన్ తీసుకుంటున్నారంటూ సచివాలయంలో (కాంట్రాక్టర్లు) ధర్నాలు అవుతున్నాయి" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మంత్రులు తీవ్రంగా ఖండించారు. మాట్లాడే ముందు బాధ్యత, నిబద్ధత ఉండాలని హితవు పలికారు. ఏది పడితే అది మాట్లాడితే చెల్లుతుంది అనుకుంటున్నారా? ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఘాటుగా హెచ్చరించారు. ఈ క్రమంలో అధికార పార్టీ సభ్యులందరూ సీట్ల నుంచి నిల్చుని, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. దీంతో కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. మరోవైపు కేటీఆర్‌ను ఉద్దేశించి ఒళ్లు బలిసి.. అంటూ భట్టి దూషించారంటూ బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. కేటీఆర్ మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలంటూహరీశ్‌తోపాటు పలువురు సభ్యులు వెల్‌లోకి దూసుకుపోయారు. కేటీఆర్‌కు మళ్లీ మైక్ ఇవ్వనని, ఆందోళన విరమిస్తే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పద్దులపై ప్రసంగాన్ని కొనసాగించే అవకాశమిస్తానని ప్యానెల్ స్పీకర్ స్పష్టం చేశారు. అనంతరం పల్లా మాట్లాడుతూ కేటీఆర్‌ను సమర్థించడానికి ప్రయత్నించగా.. మైక్ కట్ అయింది. ఆయన స్థానంలో బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌కు స్పీకర్ అవకాశం ఇవ్వడంతో బీఆర్ఎస్ సభ్యులందరూ వాకౌట్ చేసి.. వెళ్లిపోయారు. కాగా, దళితుడైన భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నేత హోదా దక్కవద్దనే గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నారని, మళ్లీ ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థికశాఖ మంత్రిగా దళితుడు ఉండటాన్ని జీర్ణించుకోలేక నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆక్షేపించారు. సభ నుంచి వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు... అసెంబ్లీ మెట్ల వద్ద నిరసన తెలిపారు.

ఘర్షణకు కారణం బీఆర్ఎస్ వాళ్లే: ఆది శ్రీనివాస్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పదేళ్లలో కమీషన్-కె (కాళేశ్వరం, కాకతీయ, కరెంటు కొనుగోళ్ల)ను అమలు చేసిన వారికి ప్రతి అంశమూ కమీషన్ల మాదిరే కనబడుతుందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గొర్రెలు, గేదెలు, చేపల పంపిణీలోనూ కమీషన్ల పర్వం నడించిందని ఆరోపించారు. ఒక ఐడియా జీవితాన్నే మార్చేసిందన్న చందంగా.. బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన లిక్కర్ ఐడియాతో ఢిల్లీలో ప్రభుత్వమే మారిపోయిందని ఎద్దేవా చేశారు. సభలో ఘర్షణలకు కారణం బీఆర్ఎస్ వారేనని ధ్వజమెత్తారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "ఓటుకు నోటు కేసులో దొంగ సీఎం రేవంత్‌రెడ్డి.. గతంలో పీసీసీ అధ్యక్ష పదవిని రేవంత్‌రెడ్డి రూ.50 కోట్లకు కొనుక్కున్నాడని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు" వంటి విషయాలను తాము చెప్పొచ్చని, కానీ, తాను అలా మాట్లాడడం లేదని అన్నారు. అయితే, కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామని చెప్పిన స్పీకర్.. ఆది శ్రీనివాస్ మాట్లాడిన వ్యాఖ్యల్లోనూ ఏవైనా ఇబ్బందికరమైన అంశాలు ఉంటే వాటినీ తొలగిస్తామని చెప్పారు.

ధాన్యం టెండర్లలో 1000కోట్ల కుంభకోణం

సీబీఐ దర్యాప్తు చేయించాలి: గంగుల కమలాకర్



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో చేపట్టిన ధాన్యం టెండర్లలో రూ.700కోట్ల నుంచి రూ.1000కోట్ల కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేసిన కుంభకోణాన్ని ప్రశ్నిస్తానన్న భయంతోనే అసెంబ్లీలో పౌరసరఫరాలశాఖ పద్దులపై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ ధాన్యం టెండర్లపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మరోవైపు, రేషన్ కార్డులకు పలు దఫాలుగా దరఖాస్తులు తీసుకున్నారని, కానీ, 15నెలల్లో ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని గంగుల కమలాకర్ ఎద్దేవా చేశారు.

ప్రాథమిక పాఠశాలల్లో 16 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు

పాఠశాల విద్య పద్దులో వెల్లడించిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని ప్రభుత్వం పాఠశాల విద్య పద్దుపై విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలల్లో 16 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండగా, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 13 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్లు తెలిపింది. ఉన్నత పాఠశాలలకు సంబంధించి 15 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని నివేదికలో పేర్కొంది.

ఉగాది నాడు జగ్గారెడ్డి సినిమా ఆఫీసు ప్రారంభం

- జయలక్ష్మి ఫిల్మ్స్ పేరుతో కొత్తగా కార్యాలయం
- వచ్చే ఏడాది ఉగాదికి విడుదల కానున్న సినిమా
- 'విశ్రాంత్రి'కి ముందు సినిమాలో జగ్గారెడ్డి ఎంట్రీ
- సినిమా పూర్తయ్యేవరకూ కొనసాగనున్న పాత్ర



హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): 'జగ్గారెడ్డి-ఎ వార్ ఆఫ్ లవ్' సినిమా కార్యాలయాన్ని ఉగాది రోజున ప్రారంభించేందుకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సన్నాహాలు చేస్తున్నారు. జయలక్ష్మి ఫిల్మ్స్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. 'జగ్గారెడ్డి-ఎ వార్ ఆఫ్ లవ్' సినిమాను నిర్మిస్తూ, అందులో నటిస్తున్న జగ్గారెడ్డి.. ఆ సినిమా నిర్మాణ పనులను ఈ కార్యాలయం నుంచే పర్యవేక్షించనున్నారు. ఈ సినిమా పోస్టర్‌కు భారీ స్పందన రావడంతో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయని, రాజకీయ, సినీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోందని జగ్గారెడ్డి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా, పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మితమవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రూపొందనుంది. వచ్చే ఉగాది కల్లా షూటింగ్, పోస్టు ప్రొడక్షన్ పనులను పూర్తి చేసి.. సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'జగ్గారెడ్డి-ఎ వార్ ఆఫ్ లవ్' సినిమాలో తన పాత్రకు, ప్రేమకు సంబంధమే ఉండదని జగ్గారెడ్డి వెల్లడించారు. తన పాత్ర విశ్రాంత్రికి ముందు మొదలై.. సినిమా చివరి దాకా ఉంటుందన్నారు. ఈ సినిమాకు, రాజకీయాలకు సంబంధం లేదన్నారు. తాను విద్యార్థి నేత నుంచి కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా ఎలా ఎదిగానన్నదీ.. ఈ సినిమాలో చూపించనున్నట్లు తెలిపారు. లవ్, ఫ్యాక్షన్, ఎమోషనల్, పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా ఉంటుందన్నారు.

మాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

- మాదిగ, లంబాడా ఎమ్మెల్యేల డిమాండ్
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు వేర్వేరుగా లేఖలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి లేఖల అందజేత

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో తమ సామాజికవర్గాలకు కూడా అవకాశం కల్పించాలని ఎస్సీల్లోని మాదిగ, ఎస్టీల్లోని లంబాడా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, రాహుల్‌గాంధీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వేర్వేరుగా లేఖలు రాశారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని శాసనసభలో రెండు వర్గాల ఎమ్మెల్యేలు వేర్వేరుగా కలిసి ఆ లేఖలను అందజేశారు. కాగా, మాదిగ ఎమ్మెల్యేల లేఖను మల్లికార్జున ఖర్గేకు అందజేయడానికి ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. లేఖ రాసిన వారిలో లక్ష్మణ్‌కుమార్‌తోపాటు మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతరావు, కాలె యాదయ్య ఉన్నారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ పార్లమెంటు నియోజక వర్గాల్లో మాదిగ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా తమకు కేటాయించలేదని లేఖలో వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒక్కరికీ అవకాశం కల్పించలేదని తెలిపారు. పార్టీ పట్ల విశ్వసనీయత, సంఖ్యాపరమైన బలం ఉన్నప్పటికీ... మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం లభించలేదని గుర్తు చేశారు. మాదిగలకు న్యాయమైన వాటా కల్పించడంలో భాగంగా మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ఓ పదవి ఇవ్వాలని కోరారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక ఆర్థిక కుల గణనలో లంబాడా జనాభా 32.20 లక్షలుగా ఉన్నట్లు తేలిందని ఆ సామాజికవర్గ ఎమ్మెల్యేలు తమ లేఖలో తెలిపారు. గత 50 ఏళ్లుగా మంత్రివర్గంలో లంబాడాలకు ప్రాతినిధ్యం లభిస్తోందని, ఇప్పుడు కూడా ఒక మంత్రి పదవిని కేటాయిస్తే.. కాంగ్రెస్ పార్టీకి తమ జాతి చేసిన సేవలు, ఆకాంక్షలను గుర్తించినట్లవుతుందని పేర్కొన్నారు. లేఖ రాసిన లంబాడా ఎమ్మెల్యేల్లో నేనావత్ బాలు నాయక్, జాటోతు రాంచందర్ నాయక్, మాలోతు రాందాస్ నాయక్, భూక్యా మురళీ నాయక్ ఉన్నారు.

హామీ.. మంత్రం!

- అధిష్ఠానంపై నమ్మకంతో రాజగోపాల్, వివేక్
- గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఫలిస్తే.. వాకిటి శ్రీహరి, సుదర్శన్‌రెడ్డికి మంత్రి వర్గంలో చోటు
- తాజా విస్తరణలో వీరికి పదవులు ఖాయమనీ ప్రచారం

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు తమకు మంత్రి పదవులు వస్తాయన్న ధీమాతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్ ఉన్నారు. అలాగే, లోక్‌సభ ఎన్నికలకు ముందు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఒకరిని మంత్రివర్గంలో తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమకు మంత్రి వర్గంలో చోటు గ్యారెంటీ అన్న విశ్వాసంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉన్నారు. నిజామాబాద్ నుంచి ఒకరికి మంత్రి పదవి ఇస్తామన్న రేవంత్ ఇచ్చిన హామీ ఫలిస్తే తనకు పదవి గ్యారెంటీ అని సుదర్శన్‌రెడ్డి భావిస్తున్నారు. ఆరు గ్యారెంటీలు సహా పథకాల అమలు, పదవుల పంపకంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, సుదర్శన్‌రెడ్డికి మంత్రి వర్గ విస్తరణలో చోటు గ్యారెంటీ అన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా నడుస్తోంది. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు 2023 ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ సర్వ శక్తులను ఒడ్డింది. గెలుపు అవకాశాలపై ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించిన సునీల్ కనుగోలు బృందం.. దానికి అనుగుణంగా వ్యూహాలనూ అమలు చేసింది. అప్పట్లో బీఆర్ఎస్ అధిష్ఠానం వ్యవహార శైలిపై అసంతృప్తిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావుతో చర్చలు జరిపి.. వారిని పార్టీలో చేర్పించగలిగింది. ముగ్గురికీ మంత్రి పదవులతోపాటు వారు సూచించిన కొందరికి కార్పొరేషన్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చిన అధిష్ఠానం.. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేసింది. అలాగే, అప్పుడు బీజేపీలో ఉన్న రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గరిక పాటి మోహన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులతో సునీల్ కనుగోలు బృందం చర్చలు జరపగా.. విశ్వేశ్వర్‌రెడ్డి, గరికపాటి మినహా మిగతా వారందరూ కాంగ్రెస్ గూటికి చేరారు. ఇందులో భాగంగానే రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, విజయశాంతికి మంత్రి పదవులు, ఏనుగు రవీందర్‌రెడ్డికి పార్టీ టికెట్టు హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు. ఈ మేరకు రాజగోపాల్, వివేక్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నట్లు చెబుతున్నారు. మరోవైపు.. విజయశాంతికి ఇచ్చిన హామీ మరుగున పడిందని అందరూ అనుకున్న దశలో.. అధిష్ఠానం ఆ హామీకి దుమ్ము దులిపి అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. తాజా విస్తరణలో విజయశాంతికి మంత్రి పదవి వస్తుందని ఆమె సన్నిహిత వర్గాలు భావిస్తున్నాయి.అలాగే లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఒకరికి చోటు కల్పిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆ సామాజిక వర్గం నుంచి ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి చోటు దక్కనుందని కాంగ్రెస్ ముఖ్య నేత ఒకరు చెప్పారు. నిజామాబాద్ నుంచి ఒకరికి అవకాశం కల్పిస్తామన్న రేవంత్ హామీ నేపథ్యంలో తనకు పదవి దక్కనుందన్న అంచనాతో సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. ఈ నలుగురి విషయంలో అధిష్ఠానం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే.. హామీ మేరకు మంత్రి పదవులు పొందే వారి సంఖ్య ఏడుకు చేరనుంది. ఇక, తాజా విస్తరణలో ఐదో వ్యక్తి మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే మైనారిటీకి, ఆరో వ్యక్తికి పదవి ఇవ్వాలనుకుంటే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కనుందన్న చర్చ సాగుతోంది.

సీపీఐ, టీజేఎస్‌లకూ హామీలు

ఎన్నికల ముందు సీపీఐకి ఒక ఎమ్మెల్యే సీటు, మంత్రివర్గంలో చోటు ఇస్తామంటూ కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. అయితే మంత్రి పదవి కంటే.. చట్ట సభల్లో ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇచ్చిన సీపీఐ నాయకత్వం.. రెండు ఎమ్మెల్సీ పదవులకు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగానే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి సీపీఐకి కేటాయించింది. అలాగే, టీజేఎస్ అధినేత కోదండరామ్‌కూ ఎమ్మెల్సీ సీటు, మంత్రి పదవి, కొన్ని నామినేటెడ్ పోస్టులను ఆఫర్ చేసింది. ఈ మేరకు కోదండరామ్‌కు ఎమ్మెల్సీ సీటుతో పాటు కొందరికి నామినేటెడ్ పోస్టులను ఇచ్చింది.

మంత్రుల ఆశీర్వాదాలు తీసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రానున్న మంత్రివర్గ విస్తరణలో బీసీ జాబితాలో కచ్చితంగా మంత్రి అవుతారని ప్రచారంలో ఉన్న మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ బుధవారం శాసనసభలో సీనియర్ మంత్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. బుధవారం శాసనసభ ప్రారంభం కావడానికి ముందు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆయన ఆశీర్వాదాలు పొందారు.

కొట్టినా కేసులు పెట్టొద్దంటే ఎలా?

» కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్య



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'తోటి ఎమ్మెల్యేలను తిడతాం, కొడతాం అయినా మామీద కేసులు పెట్టొద్దు, మమ్మల్ని అరెస్టు చేయొద్దు' అంటే ఎలా అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంపై నిందలు మోపే కార్యక్రమానికి ఇకనైనా స్వస్తి పలకాలని కౌశిక్‌రెడ్డికి సూచించారు. అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, తన ఇంట్లోకి కొందరు గూండాలు వచ్చి తలుపులు పగలకొట్టారని, పండుగపూట తనను అరెస్టు చేయించారని చెప్పారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరగా, దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు ఘాటుగా స్పందించారు. ఓ సీనియర్ నాయకుడు, మంత్రి పాల్గొన్న కార్యక్రమంలో ఓ ప్రజాప్రతినిధిపై కౌశిక్‌రెడ్డి దాడి చేశారని చెప్పారు. ఆర్డీఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకే పోలీసులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యయుతంగానే ప్రివెంటివ్ అరెస్టులు చేస్తామని, గత ప్రభుత్వం లాగా నిర్బంధం చేయబోమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సబిత మాట్లాడుతూ, ఓడిపోయిన వారికి ప్రొటోకాల్ ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏడాదిలో 22 మంది పోలీసులు ఆత్మహత్యలు చేసుకున్నారని, పోలీసులకు తరచూ కౌన్సిలింగ్ ఇప్పించాలని ప్రభుత్వానికి సబిత సూచించారు.

ఒకే ప్రాంగణంలో అసెంబ్లీ, మండలి: దుద్దిళ్ల

త్వరలో తెలంగాణ శాసనసభ, శాసన మండలి వ్యవహారాలు ఒకే ప్రాంగణం నుంచి నిర్వహిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాంతి భద్రతలు, ఇతర అంశాలపై చర్చ సందర్భంగా మంత్రి సమాధానం ఇచ్చారు. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రంలో శాంతి, భద్రతలు అదుపులోనే ఉన్నాయన్నారు. ఎవరో ఒకరిద్దరు చేసే తప్పులకు మొత్తం పోలీస్ శాఖను నిందించడం సరికాదన్నారు. మహిళా భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు.

మంత్రికి ఇంగ్లీష్, హిందీ రాదు.. నాకు తెలుగు రాదు

» అందుకే నా మాటల్ని తప్పుగా అర్థం చేసుకున్నారు: అక్బరుద్దీన్

» నా మాతృభాష తెలుగు, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చా: సీతక్క



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కు మధ్య ఆసక్తికర చర్చ నడిచింది. పాతబస్తీలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారుల్ని ఎంపిక చేసినా.. చివరి నిమిషంలో కేటాయింపులు నిలిపి వేశారని, వారికి ఇళ్లను ఇవ్వాలని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కోరగా.. మంత్రి సీతక్క కలగజేసుకుని ఎమ్మెల్యే ఆరోపిస్తున్నదాంట్లో అర్థం లేదని, గత ప్రభుత్వం అనుసరించిన విధానాల్ని మరచి పదేపదే తమ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని అన్నారు. అనంతరం అక్బరుద్దీన్ మాట్లాడుతూ, తాను ప్రభుత్వాన్ని విమర్శించలేదని, తాను చెప్పింది ఒకటైతే మంత్రి మరోలా అర్థం చేసుకున్నారని అన్నారు. తనకు తెలుగు రాదని, మంత్రికి ఇంగ్లీషు, హిందీ రాదని అందుకే తన మాటల్ని ఆమె తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. ట్రాన్స్‌లేషన్ హెడ్ సెట్ పెట్టుకుంటే వారే అనువాదం చేసి చెబుతారని సూచించారు. మంత్రి సీతక్క స్పందిస్తూ, తాను గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చానని తనకు ఇంగ్లీష్, హిందీ రాదని అనడం సరికాదని హితవు పలికారు.

సీడబ్ల్యూసీ లేఖ చూపిస్తే క్షమాపణ చెప్తారా ?

» తుమ్మిడిహట్టి అంశంపై మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ సవాల్

» కొత్తగా కట్టిన ప్రాజెక్టులేవి, కొత్త ఆయకట్టు ఎంత? అని నిలదీత

» ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రూ.600 కోట్ల విలువైన పంటనష్టం

» సభలో కాంగ్రెస్, బీజేపీల కుమ్మక్కు స్పష్టం: హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 26, (ఆంధ్రజ్యోతి): మీకు తుమ్మిడిహట్టి వద్ద సరిపడా నీళ్లు లేవు అందువల్ల ప్రత్యామ్నాయం చూసుకోండి.. అంటూ కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఇచ్చిన లేఖ తమ వద్ద ఉందని, దానిని చూపిస్తే క్షమాపణ చెబుతారా? అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో సవాల్ విసిరారు. సీడబ్ల్యూసీ అలా చెప్పలేదన్న ఉత్తమ్ మాటలు నిజమైతే తానే క్షమాపణ చెబుతానని పేర్కొన్నారు. సాగునీటి పద్దులపై చర్చ సందర్భంగా సభలో, ఆ తర్వాత ఆయా అంశాలపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు మాట్లాడారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నందువల్లే కేంద్రం అనుమతులు ఇచ్చిందని అన్నారు. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోతలు సాధ్యం కాదనే ఫైవ్‌మన్ కమిటీ చెప్పింది తప్ప మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించవద్దని చెప్పలేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఉత్తమ్ అసత్యాలు చెప్పారని ఆరోపించారు. గత బడ్జెట్ సందర్భంగా సాగునీటి పద్దుల చర్చలో కొత్తగా ఆరు ప్రాజెక్టులు కడతామని, ఆరు లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని ప్రభుత్వం చెప్పిందని హరీశ్ గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టులు ఎక్కడ కట్టారు? అదనంగా నీటిని ఎక్కడిచ్చారో చెప్పాలి? అని ప్రశ్నించారు. దేవాదులలో మోటార్లు ప్రారంభించకుండా ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల రూ.600కోట్ల విలువైన పంట ఎండిపోయిందని, ఎండిన పంటకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది కృష్ణానదిలో 1,020 టీఎంసీలు నీళ్లు వచ్చాయని, 66:34 ప్రతిపాదనల ప్రకారం తెలంగాణకు 346 టీఎంసీలు రావాల్సి ఉండగా.. ప్రభుత్వం 266టీఎంసీలనే వాడిందని పేర్కొన్నారు. ఆర్డీఎస్‌లో తెలంగాణ వాటా 15 శాతం కాగా 6 శాతమే వాడుకున్నారని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల ప్రాజెక్టుల కింద కెనాళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపుపై హరీశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇక, శాసనసభలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కైన విషయం స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌పై బీజేపీ ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు.. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఇక్కడ చోటే భాయ్ ఎంత అవినీతి చేసినా ఢిల్లీలో బడే భాయ్ ఆదుకుంటున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

విద్యపై రాజకీయం దివాలాకోరుతనం: కవిత

విద్యారంగంపై కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ దివాలాకోరుతనానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పేద ప్రజల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చాల్సింది పోయి బీఆర్‌ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మండలిలో విద్యారంగంపై జరిగిన చర్చలో కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 58 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి అనుమతులిస్తే అందులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించే ఆసిఫాబాద్ తప్ప.. మిగిలిన అన్ని నియోజకవర్గాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించినవేనని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరు విషయంలో వివక్ష తగదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలన్నింటికీ కేటాయించాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను అమలు చేయాలి

» శాసనమండలి ఆవరణలో బీఆర్‌ఎస్ సభ్యుల నిరసన

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం అందించే పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం శాసనమండలి ఆవరణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన నిర్వహించారు. శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, ఆ పార్టీ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, వాణీదేవి, సత్యవతి రాథోడ్, తాతా మధుసూధన్ ప్లకార్డులు పట్టుకుని నిరసనను ప్రదర్శించారు. తులం బంగారం కోసం ఆడపిల్లల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉప ఎన్నికలు రావు

(మొదటిపేజీ తరువాయి)



చేయబోతున్నామని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏ రకమైన భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ అంతర్జాతీయ నేరంగా మారిందని సీఎం రేవంత్ అన్నారు. నేరం జరిగిన తర్వాత సర్కారు స్పందించే తీరే చాలా ముఖ్యమన్నారు. ఎంఎంటీఎస్ రైలు అత్యాచార ఘటన తెలియగానే అప్రమత్తమయ్యామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని కొందరు విమర్శలు చేస్తున్నారని తప్పుబట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఓఆర్ఆర్ వద్ద వెటర్నరీ డాక్టర్ ఘటన, నడిరోడ్డుపై న్యాయవాద దంపతుల హత్య, సింగరేణి కాలనీలో చిన్నారిపై హత్యాచారం, జూబ్లీహిల్స్ పబ్‌లో ఓ యువతిపై రేప్ లాంటి ఘటనలు జరిగాయని సీఎం గుర్తు చేశారు. 2020లో అత్యాచారాల్లో దేశంలోనే తెలంగాణ నాలుగో స్థానంలో ఉందన్నారు. జూబ్లీహిల్స్ పబ్ రేప్ ఘటనలో ఓ బీఆర్‌ఎస్ నేత కొడుకు ఉన్నాడని, అలాగే ఓ మంత్రి కుమారుడి ప్రమేయం కూడా ఉన్నట్లు ప్రచారం జరిగిందని అన్నారు. తమ ప్రభుత్వం నేరగాళ్లపై కఠినంగా, బాధితులపై సానుభూతితో ఉంటుందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో వ్యసనాలకు తావు లేదని, జూదం, గంజాయి, కోడి పందేలు ఇక్కడ ఇప్పుడు నడవవని స్పష్టం చేశారు. ఇక ఎమ్మెల్యేలు పార్టీ మార్పునకు సంబంధించి గతంలోని విధానాలే ఇప్పుడూ ఉన్నాయని, అదే సంప్రదాయాన్ని తామూ అనుసరిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విపక్ష నేతలను చేర్చుకుని మంత్రి పదవులు కూడా ఇచ్చిందని, తాము అలా చేయలేదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు కల్పించుకుని, 'కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తారా..' అని అన్నారు. దీంతో.. కేసీఆర్ అడుగుజాడల్లో నడిస్తే తాము మడుగులో పడతామని సీఎం వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికలు వస్తున్నట్లు, తానే అభ్యర్థినంటూ ఒకాయన ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గతంలో మంచి దుస్తులు వేసుకుంటే ఆయన ఉద్యోగం ఊడుతుందని చెప్పానని, తాను చెప్పినట్లుగానే ఆయన మంత్రి పదవి పోయిందని అన్నారు. తమ దృష్టి ఉప ఎన్నికలపై లేదని, ఉపాధి, ఉద్యోగాలు, శాంతిభద్రతలు, అభివృద్ధిపైనే ఉందని చెప్పారు. బీఆర్‌ఎస్‌పై తమకు ద్వేషం లేదని, కానీ.. క్షణికావేశంలో యాసిడ్ దాడులకు తెగబడినట్లుగా మాట్లాడితే నియంత్రిస్తామని అన్నారు.

పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నం..

రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని ప్రచారం చేస్తూ.. పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రం దివాళా తీస్తే బీఆర్‌ఎస్‌కు సంతోషమా? అని ప్రశ్నించారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండడం వల్లే పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారేలా బీఆర్‌ఎస్ వ్యవహరిస్తోందని, అభివృద్ధిపై ఆ పార్టీ యాసిడ్ దాడి చేస్తోందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని, అధికార కాంక్షతో ఎలాంటి అసత్య ప్రచారాలకైనా తెగబడతారని ఆరోపించారు. అధికారం లేకపోతే బతకలేమన్న ధోరణిలో ఆ పార్టీ ఉందన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా జానారెడ్డి రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అధికార పక్షానికి సలహాలు, సూచనలు ఇచ్చారని, ఆయన బాటలో బీఆర్‌ఎస్ నడవాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు మరో నాలుగేళ్ల సమయం ఉన్నా.. ఇప్పుడే ఎన్నికలు వచ్చినట్లు, తాము అధికారంలోకి రాబోతున్నామన్నట్లు బీఆర్‌ఎస్ కలలు కంటోందని సీఎం రేవంత్ విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో ఒకాయన ఉదయం ప్రెస్‌మీట్ పెడితే, మరొకరు సాయంత్రం ట్విటర్‌లో పోస్టు చేస్తాడని, వారిద్దరి (కేటీఆర్, హరీశ్‌రావు) మధ్య పోటీ తమకు తలనొప్పిగా మారిందని రేవంత్ వ్యాఖ్యానించారు. సీఎంగా తాను అందరు ఎమ్మెల్యేలకూ అందుబాటులో ఉంటానని, గజ్వేల్ ఎమ్మెల్యే వచ్చినా ఆయన సమస్యను పరిష్కరిస్తానంటూ కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఉత్తుత్తి, ఊదరగొట్టే బడ్జెట్ పెడితే రూ.4 లక్షల కోట్లు దాటేదని, కానీ.. తాము బీఆర్‌ఎస్ సర్కారులా కాకుండా వాస్తవికత ఆధారంగా బడ్జెట్ పెట్టామని అన్నారు.

గచ్చిబౌలి భూమి.. బిల్లీరావు నుంచి స్వాధీనం

గచ్చిబౌలిలోని భూములను ఉమ్మడి రాష్ట్రంలో బిల్లీరావు అనే వ్యక్తికి ఇచ్చారని, ఆ భూమిపై కేసు ఉంటే సుప్రీం కోర్టులో వాదించి తమ అధీనంలోకి తీసుకున్నామని సీఎం రేవంత్ తెలిపారు. దానిని అభివృద్ధి చేస్తామంటే బీఆర్‌ఎస్ అడ్డుకుంటోందని ఆరోపించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నవారు ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. రూ.వేల కోట్ల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, అర్ధరాత్రి అప్పనంగా ఎవరికీ కట్టబెట్టలేదని అన్నారు. అక్కడి భూములను అభివృద్ధి చేయాలనుకుంటే.. యూనివర్సిటీ పిల్లల్ని రెచ్చగొడుతున్నారని, కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఆ భూమిలో గుంటనక్కలున్నాయని, వాటికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. గచ్చిబౌలిలోని భూములకు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఏం సంబంధమని సీఎం ప్రశ్నించారు. ఎక్కడ భూసేకరణ చేయాలన్నా బీఆర్‌ఎస్ అడ్డుకుంటోందని మండిపడ్డారు. సీఎం అత్తగారి ఊరైన ఆమన్‌గల్‌కు రోడ్లు వేస్తున్నారంటూ హరీశ్‌రావు ఆరోపించారని, కానీ.. వారు 50 ఏళ్ల క్రితమే అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు మధ్య 11 చోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నామని, అందులో భాగంగానే ఆమన్‌గల్ వరకు రేడియల్ రోడ్డు వస్తుందని అన్నారు. రోడ్లు, పరిశ్రమలు, ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన వద్దా? అని నిలదీశారు. గత ప్రభుత్వాల హయాంలో చేసిన అభివృద్ధిని కొనసాగించే చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు.



బెట్టింగ్ యాప్స్ కేసులపై సీఎం ఆరా

తెలంగాణలో కలకలం సృష్టిస్తున్న బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో పోలీసు ఉన్నతాధికారులతో బుధవారం చర్చించారు. బెట్టింగ్ యాప్స్ కేసుల స్వరూపం, అవి ఎక్కడి నుంచి ఆపరేట్ అవుతున్నాయి? ఏయే దేశాల్లో బెట్టింగ్ యాప్స్ మూలాలున్నాయి? దేశం నుంచి ఆపరేట్ చేస్తున్న బెట్టింగ్ యాప్స్ వివరాలను పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్లు అయిన సినీ రంగానికి చెందిన అగ్రనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై నమోదైన కేసుల వివరాలను తెలియచేశారు. పదుల సంఖ్యలో నిందితులు ఉన్న నేపథ్యంలో కేసు నిలబడాలంటే.. నేరం చేసిన వాడిని పట్టుకోవాల్సి ఉంటుందని, ప్రమోట్ చేసిన వారిలో చాలామంది తెలియక చేశారని, వారిని అప్రూవర్లుగా మార్చుకోవడం వల్ల కేసు బలపడుతుందనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో పాటు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన వారికి ఎంతెంత డబ్బు అందింది? ఏయే విధంగా డబ్బు చేరింది? వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసిన కొందరు పెద్దలకు ఎంతెంత ప్రొటెక్షన్ ఫండ్ అందిందనే వివరాలను పోలీసు అధికారులు సీఎంకు వివరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వివిధ జిల్లాల్లో కేసులు నమోదైన క్రమంలో వీటన్నింటిని ఒక దగ్గరకు చేర్చి దర్యాప్తు చేసే అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, నిఘా విభాగం డీజీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సీఐడీ డీజీ షికా గోయల్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. వీరితో మాట్లాడాకే బెట్టింగ్ యాప్స్ కేసులపై సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

ప్రకటనల పేరుతో బీఆర్‌ఎస్ దోపిడీ

» సొంత మీడియాకు ప్రజాధనం ధారాదత్తం

» నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, టీన్యూస్‌కు దోచిపెట్టారు : పొంగులేటి

హైదరాబాద్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రకటనల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని సొంత మీడియాకు ధారాదత్తం చేసిందని సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. బుధవారం అసెంబ్లీలో సమాచార శాఖ పద్దులపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. బీఆర్‌ఎస్ సొంత మీడియా సంస్థలైన నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, టీన్యూస్ లకు ఎంత ఖర్చు పెట్టారన్న దానిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు.

ఇతర రాష్ట్రాలలో సొంత ప్రచారానికి 564 కోట్లు

బీఆర్‌ఎస్ నేతలు పదేళ్ల పాలనలో రూ.564.40 కోట్లు తెలంగాణేతర రాష్ట్రాలలో ఖర్చు చేసి పేదల సొమ్మును సొంత ప్రచారానికి వాడుకున్నారని పొంగులేటి తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటనల పేరిట చేసిన దుర్వినియోగాన్ని మంత్రి సభ దృష్టికి తీసుకొచ్చారు. 2014లో ప్రారంభమైన నమస్తే తెలంగాణ పత్రికకు కాలం సెంటీమీటర్‌కు టారిఫ్ రూ.875గా ఉండేదని, తర్వాత 2016లో అది రూ.1150కు చేరిందని, 2019లో రూ.1500కు పెంచేశారని తెలిపారు. ఇదే సమయంలో అత్యధిక సర్క్యులేషన్ కలిగిన ఈనాడు పత్రిక టారిఫ్ రూ. 1500గా ఉందని, దీన్ని బట్టి ప్రజాధనం ఏవిధంగా గత పాలకులు దుర్వినియోగం చేశారో అర్థమవుతుందన్నారు. ఇక తెలంగాణ టుడే అనే వారి సొంత ఆంగ్ల పత్రికకు 2017లో కాలం సెంటీమీటర్ రూ.1000 ఉండగా, కేవలం 2 ఏళ్ల వ్యవధిలో 2019లో ఈ రేటును రూ.2000కు పెంచారని ఇదే సమయంలో టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక టారిఫ్ రూ.1000 మాత్రమే ఉన్నదని మంత్రి వివరించారు. ఇక్కడ కూడా దోపిడీ జరిగిందన్నారు. ఇక టీవీ ప్రకటనల విషయానికి వస్తే టీ ఛానల్‌కు సెకనుకు రూ.3000 ధర నిర్ణయించారని అదే ఈటీవీకి రూ.2500, ఎన్‌టీవీకి రూ.3000 ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16నెలల వ్యవధిలో సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేసిందని పొంగులేటి తెలిపారు.

మునిసిపల్, పంచాయితీరాజ్ బిల్లులకు

శాసనమండలి ఆమోదం

కొత్తగూడెం- పాల్వంచ మునిసిపాలిటీలతో పాటు సమీపంలోని మరో ఏడు గ్రామ పంచాయితీలతో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బుధవారం చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన మునిసిపల్ చట్టం 2019 సవరణ బిల్లును, పంచాయితీరాజ్ చట్టం 2018 సవరణ బిల్లులను మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఏప్రిల్ నుంచే భూభారతి

ఇదే రిఫరెండంగా వచ్చే ఎన్నికలకు వెళ్తాం

బీఆర్‌ఎస్ హయాం నాటి భూ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం: పొంగులేటి

ధరణిని బంగాళాఖాతంలో కలపమనే ప్రజలు మాకు అధికారం ఇచ్చారు: డిప్యూటీ సీఎం భట్టి

అనుభవదారు కాలమ్ మళ్లీ వద్దు: పల్లా



హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నుంచే భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తామని చెప్పడానికి గర్వపడుతున్నానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. భూభారతి చట్టాన్ని రిఫరెండంగా చేసుకొని వచ్చే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. శాస్త్రీయంగా, ప్రజలందరి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూభారతి చట్టాన్ని తెచ్చామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజల నుంచి మరిన్ని సూచనలు వస్తే స్వీకరిస్తామని వెల్లడించారు. శాసనసభలో బుధవారం వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా భూభారతి చట్టంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. మాన్యువల్ పహాణీ, అనుభవదారు కాలమ్‌ను రికార్డుల్లో చేర్చొద్దని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, 3,795 మంది వారసత్వ వీఆర్‌ఏలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. ధరణి వంటి దుర్మార్గమైన చట్టాన్ని తెచ్చిన వారికి.. భూభారతిపై మాట్లాడే హక్కు లేదని స్పష్టం చేశారు. వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేసి, 23 వేల మంది ఉద్యోగులను రోడ్డుమీద పడేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది అని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ వ్యవస్థను త్వరలోనే పునరుద్ధరించనున్నామన్నారు. రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ పాలన అధికారులను నియమించడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. గత సమావేశాల్లో చెప్పిన విధంగా బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూలావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇదే అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో భూములపై హక్కులు కల్పించామని గుర్తు చేశారు. 70 ఏళ్ల పోరాటం ఫలితంగా ఏర్పడిన అనుభవదారు కాలాన్ని బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క కలం పోటుతో తొలగించారని ధ్వజమెత్తారు. బాజాప్తాగా ధరణిని బంగాళాఖాతంలో కలపాలనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని గుర్తు చేశారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రికార్డులను సరిచేయడమే జమాబందీ అని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య రికార్డులు రాయడం కరెక్టా? ప్రజల మధ్య రికార్డులు సరిచేయడం కరెక్టా? అని ప్రశ్నించారు. పోలీసులను రాజకీయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారన్న పల్లా ఆరోపణలపై మంత్రి పొన్నం స్పందిస్తూ.. పోలీసులను వినియోగించుకొని అధికారం చలాయిస్తే తామూ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వస్తుందని, తమకు అలాంటి అవసరం లేదన్నారు. మధ్యలో మంత్రులు మాట్లాడడంపై బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన తెలపగా.. ప్యానల్ స్పీకర్ రేవూరి కల్పించుకొని..మంత్రులకు అవకాశం ఇవ్వడం తన బాధ్యత అని పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేద్దాం

ప్రస్తుత విద్యా విధానం ప్రమాదకరం.. ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరం

టీచర్లతో కొట్లాడే శక్తి నాకు లేదు: రేవంత్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మన విద్యా విధానం ప్రమాదకరంగా ఉందని, విద్యలో ప్రమాణాలు పడిపోవడం ఆందోళన కలిగించే అంశమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు ప్రభుత్వం మాత్రమే కాకుండా.. తెలంగాణ సమాజం కూడా బాధ్యత వహించాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంచే విషయంలో ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మండలిలో విద్యాశాఖపై ముఖ్యమంత్రి మాట్లాడారు. 2021లో నేషనల్ అచీవ్ మెంట్ సర్వే జరిగిందని, అందులో మూడో తరగతి, ఐదో తరగతి చదివేవారిలో 75 శాతం మంది విద్యార్థులు ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యం కూడా చూపలేదని తేలిందన్నారు. సబ్జెక్టులవారీగా దేశంలో తెలంగాణ 37వ ర్యాంకులో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య 6.50 లక్షలు తగ్గిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 10 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశామని, 36 వేల మంది టీచర్లను



బదిలీ చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 26,100 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో ఒక్కో విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు పెడుతున్నామని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూల్లో ఒక్కో విద్యార్థికి 98 వేలు ఖర్చు చేస్తోందని అన్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా ప్రభుత్వం ఎక్కడ విఫలమైందో చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయ కోణంలో ఆలోచించినంత కాలం విద్యారంగాన్ని ప్రక్షాళన చేయలేమన్నారు.

నైపుణ్య కొరతను అధిగమించేందుకే..

సమాజంలో అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యం కొరవడుతోందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని అధిగమించేందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించి త్వరలోనే విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. విద్యావ్యవస్థపై సూచనలు ఇవ్వాలని మండలి సభ్యులను సీఎం కోరారు. అందరి సూచనలు, సలహాలతో ప్రక్షాళన చేస్తామని, పాలసీ ముసాయిదా రూపొందించి ప్రజల్లో చర్చకు పెడదామని అన్నారు. ఈ రోజు నిర్ణయం తీసుకోకపోతే ఇక ఎప్పుడూ ప్రక్షాళన చేయలేమన్నారు. భవిష్యత్తులోనూ విద్యాశాఖను తన వద్దే పెట్టుకుని పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఉపాధ్యాయులతో కొట్లాడే శక్తి తనకు లేదని, వారు కూడా విద్యావ్యవస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు. త్వరలోనే కొత్తగూడెంలో మైనింగ్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరు విషయంలో ఎమ్మెల్సీ కవిత పొరపాటు పడుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. ఈ పథకానికి గతంలో ఏ పేరూ లేనందునే జైపాల్ రెడ్డి పేరు పెట్టామన్నారు. అంబేడ్కర్ పేరును మార్చి.. జైపాల్‌రెడ్డి పేరును ఏ పథకానికీ పెట్టలేదని చెప్పారు. తెలంగాణ ఏర్పాటులో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు.

కోర్టులో అంశం.. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి తీర్పు

» ఎమ్మెల్యేల అనర్హతపై సభలో సీఎం వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధం..

» సీఎం వ్యాఖ్యలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తాం: హరీశ్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడడాన్ని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుబట్టారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై అసెంబ్లీలో మాట్లాడడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు అసెంబ్లీ లాబీలో బుధవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హులు కారు, ఉప ఎన్నికలు రానేరావంటూ సభలో సీఎం జడ్జిమెంట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. సభలో సీఎం మాట్లాడింది అసెంబ్లీ, పార్లమెంటు వ్యవస్థ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదని కౌల్ అండ్ శకధర్ పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉందని వివరించారు. ముఖ్యమంత్రి తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయంపై మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకు వస్తుందని హరీశ్ పేర్కొన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద ఈ విషయాన్ని తాను చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో మైక్ కట్ చేశారని ఆరోపించారు. కాగా, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై సీఎం చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్తామని ఈ సందర్భంగా హరీశ్ వెల్లడించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్‌ను బ్యాన్ చేస్తూ జీఓ తెచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్‌ని నియంత్రించడంలో విఫలమైందని విమర్శించారు. డీజీపీ అధికారికంగా విడుదల చేసిన లెక్క ప్రకారం గతేడాది కంటే ఈసారి 23శాతం క్రైమ్ రేట్ పెరిగిందని, 15 నెలల్లో 9 మతసంబంధ అల్లర్లు జరిగాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఒకే రోజు రెండు అత్యాచార ఘటనలు రెండు హత్యలు జరిగాయన్నారు. హైదరాబాద్‌లో 50శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, సీసీ కెమెరాల నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమయ్యిందని ఆరోపణ చేశారు.

'పాయింట్ ఆఫ్ ఆర్డర్' కోసం బీఆర్‌ఎస్ వాకౌట్ చేసింది

» ముఖ్యమంత్రి ఎక్కడా కోర్టు పేరు తీయలేదు: శ్రీధర్‌బాబు

» చట్టసభలో ఏ అంశంపైనైనా మాట్లాడే అవకాశముంటుంది: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన అంశంపై 'పాయింట్ ఆఫ్ ఆర్డర్'కు అనుమతించాలంటూ బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టారు. సభలో పలుమార్లు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు. అయితే సీఎం మాట్లాడేటప్పుడు కాకుండా, అంతా అయిపోయిన తర్వాత పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడగడం సరికాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులే న్యాయస్థానాలను కించపరిచే విధంగా మాట్లాడారని, సీఎం మాట్లాడేటప్పుడు ఎక్కడా కోర్టు పేరు తీయలేదని తెలిపారు. కాగా, పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై ప్రతిపక్షం పట్టుబట్టడం సరికాదని అధికారపక్ష నేతలు చెప్పడంతో సభలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కల్పించుకుంటూ.. పార్లమెంట్‌లో సభ్యులు ఏ అంశంపై మాట్లాడేందుకైనా అనుమతిస్తారని చెప్పారు. అయితే పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు స్పీకర్ అనుమతించకపోవడంతో బీఆర్‌ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికి తిరిగి సభలోకి వచ్చారు. అనంతరం ఒక్కసారి తనకు మైక్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ స్పీకర్‌ను కోరారు. తమకు మైక్ ఇవ్వకపోతే.. రేపటి నుంచి తామే సొంతంగా మైక్ తెచ్చుకుంటామన్నారు. కొద్దిసేపటి తర్వాత గంగుల మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించారు.

కోతలు లేని కరెంట్ ఇస్తున్నాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ నానాటికీ పెరుగుతున్నప్పటికీ కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆరునెలల క్రితం తాము రూపొందించిన యాక్షన్‌ప్లాన్ దీనికి కారణమని చెప్పారు. విద్యుత్‌శాఖకు సంబంధించి నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. పోయిన ఏడాది 15,497 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ఈ ఏడాది 17,162 మెగావాట్ల డిమాండ్ ఉందన్నారు. 2030 నాటికి 24,215 మెగావాట్ల డిమాండ్ ఉంటుందనే అంచనాతో సౌర, జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు పలు పథకాలు రూపొందించామని చెప్పారు.

అమెజాన్ గోదాంపై బీఐఎస్ దాడులు

- ధ్రువీకరణ లేని 2,783 ఉత్పత్తులు సీజ్
- వాటి విలువ రూ.50 లక్షల పైనే..

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అమెజాన్ గోదాంపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘించి నిల్వ చేసిన ఉత్పత్తులను పెద్ద ఎత్తున సీజ్ చేశారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్ సిటీలో ఉన్న గోదాంలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. ఇందులో దాదాపు రూ.50 లక్షల పైగా విలువైన 2,783 ఉత్పత్తులకు బీఐఎస్ ధ్రువీకరణ, ఐఎస్ఐ మార్క్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు ఉండాల్సిన రిజిస్ట్రేషన్ మార్కు లేవని గుర్తించారు. ఆ ఉత్పత్తులను జప్తు చేశారు. వీటిలో 1,937 స్టెయిన్ లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లు, 150 స్మార్ట్ వాచ్‌లు, 326 వైర్‌లెస్ ఇయర్ బడ్స్, 170 మొబైల్ చార్జర్లు తదితరాలున్నాయి. దీనిపై పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం బీఐఎస్ ధ్రువీకరణను తప్పనిసరి చేసిందని, ఐఎస్ఐ మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ మార్కు ఉండాలని చెప్పారు. బీఐఎస్ అనుమతి పొందకుండా తయారుచేసినా, విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు. జరిమానతో పాటు జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. వస్తువుల నాణ్యతా ప్రమాణాలను బీఐఎస్ కేర్ యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చని, ఉల్లంఘనలను గుర్తిస్తే అందులో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

సూర్యాపేట డీఎస్పీపై బదిలీ వేటు

- కాంగ్రెస్ నేత హత్య ఘటనలో చర్యలు


డీఎస్పీ జి.రవి

సూర్యాపేట క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ నేత చక్రయ్య హత్య ఘటనలో సూర్యాపేట డీఎస్పీ జి.రవిపై ఆ శాఖ ఉన్నతాధికారులు బదిలీ వేటువేశారు. ఇప్పటికే తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్‌ను ఐజీ ఆఫీస్‌కు అటాచ్‌చేయడంతో పాటు నూతనకల్ ఎస్ఐ మహేంద్రనాథ్‌కు చార్జ్‌మెమో ఇచ్చారు. డీఎస్పీ రవిని బదిలీచేస్తూ బుధవారం రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీచేశారు. హత్యకు ముందే చక్రయ్య కుటుంబసభ్యులు తమకు ప్రాణహాని ఉందని డీఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చక్రయ్య హత్యకు గురైనట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. కాగా, చక్రయ్య హత్య కేసులో ఇప్పటివరకు 34ని మంది పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఆరుగురు తుంగతుర్తి కోర్టులో లొంగిపోగా, ఈనెల 24న 13 మందిని, 25న మరో 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న మరికొందరిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ శ్రీనునాయక్ వెల్లడించారు. చక్రయ్య హత్యకేసులో కుమార్తెలు, అల్లుళ్లు, వారి కుటుంబసభ్యులే ప్రధాన నిందితులుగా ఉన్నారు.

ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీల పోరు గర్జన

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

పంజాగుట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదానికి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగర్జన ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారీ, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీ సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, తెలంగాణ అసెంబ్లీలో బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బేషరతుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం మాట మార్చి మైనారిటీ రిజర్వేషన్ల సాకుతో బిల్లును ఆమోదించకుండా బీసీలకు అన్యాయం చేయాలని చూస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును యథావిధిగా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్రప్రభుత్వం ఆమోదించి చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బాధ్యతను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీసుకోవాలని కోరారు. పోరు గర్జన సభను విజయవంతం చేయాలని జాజుల పిలుపునిచ్చారు.

రుణమాఫీ హామీ..
కాంగ్రెస్ పూర్తిగా నెరవేర్చలేదు: నిర్మల

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ హామీని కాంగ్రెస్ పూర్తిగా నెరవేర్చలేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బుధవారం ఆమె రాజ్యసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమం జరిగిందని చెప్పగా, నిర్మల తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ ఆ తర్వాత అరకొర మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రైతులు బ్యాంకుల నుంచి తిరిగి రుణాలు పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ హామీలిచ్చిన ప్రతిసారి మాట తప్పిందని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ.6వేల చొప్పున నేరుగా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోందని వివరించారు.

పూజారి సాయికృష్ణకు జీవిత ఖైదు

- సాక్ష్యాలను తారుమారు చేయాలని యత్నించినందుకు మరో ఏడేళ్ల జైలు
- రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు
- 2023 జూన్ 3న పథకం ప్రకారం అప్సరను హత్య చేసిన సాయికృష్ణ


మృతురాలు అప్సర


పూజారి సాయికృష్ణ

రంగారెడ్డి కోర్టు/శంషాబాద్ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నటి కురుగంటి అప్సర హత్య కేసులో నిందితుడు ఆలయ పూజారి వెంకట సూర్య సాయికృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రేమిస్తున్నానంటూ అప్సరను నమ్మించిన సాయికృష్ణ.. ఆమె పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. పథకం ప్రకారం ఆమెను హత్య చేసి.. మృతదేహాన్ని మ్యాన్‌హోల్ పడేసి సిమెంట్ పోశాడు. పీపీ వోద్యారపు రవికుమార్ కథనం ప్రకారం.. ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పిగన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన సాయికృష్ణ తన భార్య, కూతురితో కలిసి సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో నివసించేవాడు. స్థానికంగా ఉన్న బంగారు మైసమ్మ దేవాలయంలో పూజారిగా పనిచేసేవాడు. చెన్నైకి చెందిన అప్సర తన తల్లితో కలిసి గుడి సమీపంలో నివసించేది. పలు చిత్రాలు, సీరియల్స్‌లో చిన్న చిన్న పాత్రల్లో నటిస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న అప్సర అప్పుడప్పుడు గుడికి వెళుతుండేది. ఈ క్రమంలో సాయికృష్ణ, అప్సర మధ్య పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారితీసింది. కొంతకాలం తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని అప్సర... సాయికృష్ణపై ఒత్తిడి చేసింది. దీంతో ఆమెను వదిలించుకోవాలని సాయికృష్ణ పథకం పన్నాడు. దాని ప్రకారం 2023 జూన్ 3న కోయంబత్తూరు వెళదామని చెప్పి ఆమెను కారులో శంషాబాద్ తీసుకుని వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో శంషాబాద్ మండలం నర్కుడలో గోశాల సమీపంలోని నవరంగ్ వెంచర్‌లోకి తీసుకెళ్లి ఆమె ముఖంపైన కారు కవర్ చుట్టి ఊపిరాడకుండా చేయగా ఆమె ప్రతిఘటించింది. సాయికృష్ణ ఆమె ముఖంపై రాయితో బాదడంతో మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కవర్‌లో చుట్టి కారు డిక్కీలో పెట్టాడు. అలాగే ఇంటికొచ్చి రెండు రోజుల పాటు కారును పార్కింగ్ ప్రదేశంలో ఉంచాడు. తర్వాత సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో వేసి ఎర్రమట్టితో కప్పెట్టి సిమెంట్ వేశాడు. జూన్ 5న అప్సర స్నేహితులతో కలిసి భద్రాచలం వెళ్లిందని ఆమె తల్లిని నమ్మబలికాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవడంలేదని చెప్పుకొచ్చాడు. అప్సర తల్లితో కలిసి శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులకు సాయికృష్ణ మాట్లాడే తీరుతో అనుమానం వచ్చింది. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. రంగారెడ్డి జిల్లా 11వ అదనపు సెషన్స్ జడ్జి వై.జయప్రసాద్ నిందితుడు సాయికృష్ణకు జీవిత ఖైదుతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించారు. అందులో రూ.9.75 లక్షలు మృతురాలి కుటుంబ సభ్యులకు నష్టపరిహారంగా చెల్లించాలని, రూ.25 వేలు ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించారు. జమ చేయలేని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. సాక్ష్యాలను తారుమారు చేయాలని ప్రయత్నించినందుకు మరో ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఇది చెల్లించకపోతే మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు చెప్పారు.


రాజమహేంద్రవరం ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న క్రైస్తవులు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

- పాస్టర్ మృతిపై రాజమహేంద్రవరం ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం/ అమరావతి/ పంజాగుట్ట/ మన్సూరాబాద్, మార్చి 26: హైదరాబాద్‌కు చెందిన క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఇందులో నిజానిజాలు కేసు దర్యాప్తులో తెలుస్తాయన్నారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 ప్రత్యేక బృందాలు ఈ కేసులో నిజం నిగ్గు తేల్చే పనిలో నిమగ్నం అయ్యాయని చెప్పారు. ప్రవీణ్ మృతి నేపథ్యంలో క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలు బుధవారం రాజమహేంద్రవరం బోధనాసుపత్రి వద్ద ఆందోళన చేపట్టాయి. ప్రజాశాంతి వ్యవస్థాపకుడు కేఏ పాల్ మాట్లాడుతూ ఇది ప్రమాదం కాదని, హత్యేనని ఆరోపించారు. పోస్ట్‌మార్టం ముగిశాక ప్రవీణ్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. బుధవారం అర్ధరాత్రికి పాస్టర్ ప్రవీణ్ మృతదేహం సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉంటే, దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువైందని క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మన్ రాజ్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, మేడే రాజీవ్ సాగర్, ఎల్‌బీనగర్ క్రైస్తవ సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. కాగా, పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని పోలీసు శాఖను ఆదేశించారు.

భద్రాచలంలో కుప్పకూలిన ఆరు అంతస్తుల భవనం

- శిథిలాల కింద ఇద్దరు మేస్త్రీలు.. పలువురు కూలీలూ..!
- కాపాడాలంటూ ఓ మేస్త్రీ ఆర్తనాదాలు.. స్లాబ్‌కు రంధ్రం ద్వారా ఆక్సిజన్, నీరు సరఫరా
- కొనసాగుతున్న సహాయక చర్యలు


సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది


ప్రమాదానికి ముందు భవనం

భద్రాచలం మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ ఆరు అంతస్తుల భవనం నిట్టనిలువునా కూలిపోయింది.. ఇద్దరు తాపీ మేస్త్రీలు శిథిలాల కింద చిక్కుకున్నారు. అయితే పలువురు కూలీలు కూడా ఉండే అవకాశముందని అనుమానిస్తున్నారు. బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం భద్రాద్రి రామయ్య ఆలయానికి కూతవేటు దూరంలో (సూపర్ బజార్ సెంటర్‌లో) ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టుకు చెందిన శ్రీ విజయ కనకదుర్గ భవానీ దేవస్థానం భద్రాద్రి భవానీ పేరుతో అక్కడ భవన (గుడి) నిర్మాణం చేపట్టింది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఇంటిపైనే సామర్థ్యానికి (జీ+1కు అనుమతి) మించి జీ+5 నిర్మాణం చేపట్టడమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఒక్కసారిగా భవనం పేక మేడలా కూలి పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో స్థానిక జగదీశ్‌కాలనీకి చెందిన మేస్త్రీ పడిచాల ఉపేందర్‌రావు, లంబాడీ కాలనీకి చెందిన మేస్త్రీ కామేశ్ ఉన్నట్లు వారి కుటుంబీకుల ద్వారా తెలిసింది. ప్రమాద విషయం తెలిసి ఇద్దరి కుటుంబీకులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. అయితే మేస్త్రీలకు సాయంగా కూలీలు కూడా అక్కడ ఉండే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం ఘటనపై స్థానికుల సమాచారంతో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు శాఖ అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్డీవో దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్ తదితరులు హుటాహుటిన చేరుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సింగరేణి రెస్క్యూ బృందాన్ని రప్పించారు. సింగరేణి కార్మికులు సారపాక ఐటీసీ నుంచి తెప్పించిన యంత్రాలతో శిథిలాలు తొలగిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో చిక్కుకుపోయిన మేస్త్రీ కామేశ్ తనను కాపాడాలంటూ అరుస్తున్నట్లు సహాయక సిబ్బంది గుర్తించారు. అతడున్న గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్‌కు రంధ్రం చేసి ఆక్సిజన్, నీరు అందిస్తున్నారు. కలెక్టర్ జితేశ్‌తో పాటు అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకుపోయారన్న దానిపై అధికారులు స్పష్టతనివ్వలేదు. ఇటు భవన యజమాని శ్రీపతి దంపతులు పోలీసుల ముందు లొంగిపోయినట్లు సమాచారం.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*